ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥ 150/-
పేజీలు: 150



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 210 | మంగళవారం | 30-06-2026 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


విద్యార్థుల ఆత్మహత్యల పట్ల

## కేంద్రం ఉదాసీనత

- బాధిత కుటుంబాల పట్ల స్పందించకపోవడం శోచనీయం
- సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే విమర్శ
- రెండవ రోజూ కొనసాగిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహారదీక్ష
- వామపక్ష పార్టీల సంఘీభావం

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) పదవ రోజు కూడా నిరసన ప్రదర్శన కొనసాగించింది. నిరసన ప్రదర్శనకు సంఘీభావంగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆదివారం నిరాహారదీక్షను ప్రారంభించా రు.నిరసన ప్రదర్శనకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. కాగా, సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇటీవల జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలను ప్రస్తావిస్తూ, బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రదీప్ మేఘ్వాల్, ఆకాంక్ష చతుర్వేది, అమైరా కుమార్, కహాన్ పటేల్ వంటి విద్యార్థుల పేర్లను ఎక్స్ వేదికగా ప్రస్తావించిన దిప్కే, వారి కుటుంబాలు న్యాయం కోసం వేడుకునే దుస్థితికి గురయ్యాయని పేర్కొన్నారు. తమ పిల్లల మరణాల పట్ల విచారం వ్యక్తం చేయడానికి ఏ ప్రభుత్వ ప్రతినిధి కూడా వారిని సంప్రదించలేదని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు ఉదాసీనతతోనే కాకుండా, ఎంతటి అహంకారంతో వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కనీసం తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలను పరామర్శిద్దామన్న ఉద్దేశం కూడా లేకపోవడం శోచనీయమని తరువాయి 12లో



### అసమర్థ మంత్రికి అభయ హస్తమా?

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపాటు**

**న్యూఢిల్లీ:** పదేపదే పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, దేశ విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభానికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చే యాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన ఆందోళనకు సోమవారం సిపిఐ, సిపిఐ(ఎం) సంఘీభావం ప్రకటించాయి. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్షేను, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు వివేక్ శర్మ, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్‌తో పాటు ఢిల్లీ రాష్ట్ర సిపిఐ నాయకులు, విద్యార్థి, తరువాయి 12లో

## నేడు రైతు భరోసా

- వర్షం కారణంగా మధిరలో జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దు
- హైదరాబాద్‌కు వేదిక మార్పు

**శిల్పకళావేదికలో పంపిణీ చేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి**




ప్రజాపక్షం/హైదరాబాద్

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా రద్దయింది. ఈ సభను రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పంపిణీ సదస్సుగా హైదరాబాద్ శిల్ప కళా వేదికలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ రైతు వేదికల నుంచి సమావేశ(ర్పా)భుత్వం తెలియజేసింది. కాగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నేడు ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వేదికను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికకు మార్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల భద్రత, ప్రజాప్రతినిధుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మధిరలో నిర్వహించాల్సిన మెగా తరువాయి 8లో

ఇళ్ల స్థలాల పట్టాల కోసం

## రేపు కలెక్టరేట్ల ఎదుట నిరసనలు

- ఇళ్లు , ఇండ్ల స్థలాల పట్టాల సాధనకు దశల వారీ అందోళనలు
- 6వ తేదీన ఇందిరాపార్కు వద్ద వేలాదిమందితో మహాధర్నా
- సిగాచి పేలుడు బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ భూములు, భూదాన భూముల్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెల కూల్చివేత నిలిపివేసి ఎక్కడికక్కడ వారికి ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇందులో భాగంగా జూలై 1న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో వామపక్షాల శ్రేణులు, ఇళ్లులేని నిరుపేదలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు సాధనే తరువాయి 8లో

దాడుల నిలిపివేతకు

## అమెరికా–ఇరాన్ నిర్ణయం

- నేడు దోహాలో సాంకేతిక చర్చలు : ట్రంప్
- ఇంకా తేదీ నిర్ణయించలేదు : ఇరాన్
- హోర్ముజ్‌లో మా కళ్ళుగప్పి దొడ్డిదారిన వెళ్ళొద్దు:నౌకలకు హెచ్చరిక

**వాషింగ్టన్:** రెండురోజులపాటు జరిగిన పరస్పర యుద్ధ దాడులను నిలిపివేయాలని అమెరికా–ఇరాన్ నిర్ణయించుకున్నాయి. దాడులు నిలిపివేశామని, సమావేశం జరపాలని ఇరాన్ కోరినందువల్ల మంగళవారం (జూన్ 30) దోహాలో రెండు దేశాల ప్రతినిధులమధ్యా సంభాషణలు జరుగుతాయని సోషల్ మీడియా వేదికగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనికి కొద్దిసేపటి ముందుగా ఇరాన్ విదేశాంగశాఖ సహాయమంత్రి కాజమ్ ఘరి బాబదీ తస్నిమ్ న్యూస్ ఏజన్సీతో మాట్లాడుతూ, రెండు దేశాలమధ్యా సాంకేతిక చర్చలకు సమావేశం జరుగుతుందని, ఇంకా ఒక తేదీ నిర్ణయించలేదని, ఐతే ఈ వారంలోనే ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. హోర్ముజ్‌పైనే పూర్తిగా ఈ సమావేశంలో సంభాషణలు జరుగుతాయని ఆక్సియోస్ సంస్థ వెల్లడించింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌ను సంప్రదించకుండా, అధికారికమార్గాలను కాదని, తరువాయి 12లో

## ఆర్‌టిసి ఎన్నికలకు రంగం సిద్ధం

**త్వరలో నోటిఫికేషన్**

ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఎస్ ఆర్‌టిసిలో యూనియన్ ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ యాజమాన్యం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసే దిశగా చర్యలు ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జాయింట్ లేబర్ కమిషనర్ ఇటీవల ఆర్‌టిసి యాజమాన్యంతో సమావేశమై ఎన్నికల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివరాలను సేకరించి, యూనియన్ వెరిఫికేషన్ ప్రక్రియ తరువాయి 8లో

## మూసీ పునరుజ్జీవంతో మహానగరానికి కొత్త రూపు

- భూ సేకరణ, పునరావాసంలో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి
- ఇళ్లు కోల్పోయే ప్రతీ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి
- అధికారులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు కోసం భూ సేకరణ, పునరావాసంలో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించిన ఆయన, ఇళ్లు కోల్పోయే ప్రతి అర్హ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక తరువాయి 8లో




యుపిఎ ప్రభుత్వం గ్రామీణులకు హామీపూర్వక ఉపాధి కల్పిస్తూ తెచ్చిన, సామాజిక ఆడిట్ కింద అమలు చేస్తున్న 'మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టాన్ని' రద్దుచేసి, దాని స్థానంలో, మోడీ ప్రభుత్వం 2025 డిసెంబర్‌లో ఏకపక్షంగా ఆమోదించిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్, గ్రామీణ్(విబి–జి రామ్ జి) బుధవారం నుంచి అమలులోకి రానుంది. జనంచేత రామజపం చేయించే ప్రధాని నరేంద్రమోదీ ఉద్దేశం మెలికలు తిప్పిన ఆ పథకం నామకరణంలోనే విదితమవుతున్నది. మహాత్మాగాంధీ పేరుతోపాటు పాతచట్టం తెచ్చిన కాంగ్రెస్ పేరును పేదల మనస్సులనుంచి చెరిపివేసే ఉద్దేశం కూడా ఆ నామకరణం వెనుక గోచరిస్తున్నది. గ్రామీణ పేదలకు ఎంతో కొంత మేలు చేస్తూ పనులు దొరకని కాలంలో కోరిన వారికి ఉపాధి కల్పనను చట్టబద్ధం చేయటం రాజ్యాంగహితం, చరిత్రాత్మకం. ఆ చట్టం అమలును, ఆచరణను మెరుగుపరిచే ప్రభుత్వం పేదల అనుకూల ప్రభుత్వం అనిపించుకుంటుంది. కాని తీపి మాటలతో చేదు గుళికలు మింగించజూస్తున్నది మోదీ చట్టం. మోదీ అధికారం చేబట్టినాక ఉపాధి హామీ చట్టం కింద పనికల్పించే దినాలు తగ్గిపోయాయి, బడ్జెట్ కేటాయింపులు కోతకు గురైనాయి. ఆ చట్టం పూర్తిగా – వేతనాలను కేంద్రప్రభుత్వం భరించే నిర్దేశన చేసింది. సామాగ్రి కొనుగోలు వ్యయం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని మరిచిపోరాదు – అది మొత్తం ఖర్చులో 10శాతం ఉంటుంది. సోనియాగాంధి నేతృత్వం వహించిన యుపిఎ ప్రభుత్వ సలహామండలి అనేక మాసాలపాటు రాష్ట్ర ప్రభుత్వాలతో, పౌర సమాజం సంస్థలతోపాటు గ్రామీణ పేదల వర్గ సంఘాలతో చర్చలు జరిపి ఆ ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిపాదించగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దానికి పార్లమెంటు ఆమోదం పొందింది. 2005 ఆగస్టు 25న పార్లమెంటు ఆమోదించిన నరేగా 2006 ఫిబ్రవరి 2 నుంచి అమలులోకి వచ్చింది. 2009లో ఆ పేరుకు ముందు మహాత్మాగాంధి పేరు చేర్చారు. అది యుపిఎ ప్రభుత్వం వామపక్షాలపై ఆధారపడిన కాలం అని మరువరాదు. వామపక్షాల ఒత్తిడివల్ల కాంగ్రెస్ అయిష్టంగానైనా ఆమోదించిన కొద్ది చట్టాల్లో ఇదొకటి.

## జి రామ్ జి భారం రాష్ట్రాల నిరసన

ఏదైనా నిర్మాణం చేయాలంటే ఎంతో కష్టపడాలి – ధ్వంసం చేయటానికి సంకల్పం చాలు. మోదీ ప్రభుత్వం అదే చేసింది. ఎంజినరేగా చట్టబద్ధంగా ఇచ్చిన హక్కు కాగా జి రామ్ జి కేంద్రప్రభుత్వ పథకం. కేంద్రం పనుల నిర్ణయం అధికారం రాష్ట్రాలనుంచి లాగేసుకుని ఆ నిర్ణయాధికారాన్ని తన చేతికి తీసుకుంది. 125 రోజులు పని హామీ ఊరిస్తున్నా గ్యారంటీ లేదు. ఆచరణలో ఇప్పుడు అమలు జరుగుతున్న 50–60 రోజుల పనిని 125కు పెంచాలంటే బడ్జెట్ పెంచాలి. అదేమీ లేదు. పైగా ఇంతకుముందు కేంద్రం–రాష్ట్రాల మధ్య 90:10గా ఉన్న వ్యయంలో 40శాతం రాష్ట్రాల నెత్తికెత్తింది. అసలే అప్పులతో మూలుగుతూ అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేక అవస్థలు పడుతున్న రాష్ట్రాలు 40శాతం భరించటమంటే, ఆచరణలో ఉపాధి కల్పన దినాలు కుదింపునకు దారితీస్తుంది.

జి రామ్ జి చట్టం తెచ్చినపుడు నోరెత్తని బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం ఇప్పుడు అసమ్మతి వ్యక్తం చేస్తున్నాయి. బిహార్, మధ్యప్రదేశ్ సహా కనీసం 5 రాష్ట్రాలు వేతనరేట్లు పెంపుదల కోరటంతోపాటు, 40శాతం వ్యయం భరించలేమని గ్రామీణ మంత్రిత్వశాఖకు చెప్పాయి. మధ్యప్రదేశ్‌కు 16 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఏలుబడి సాగించిన శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రస్తుతం ఆ శాఖ మంత్రిగా ఉన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే మాసాల్లో వ్యవసాయానికి కూలీలను లభ్యం చేసే పేరుతో 60రోజులపాటు గ్రామీణ పేదలకు పనుల నిలుపుదల నిబంధనను కనీసం 4రాష్ట్రాలు వ్యతిరేకించాయి. వేతనాల చెల్లింపులో విపరీత జాప్యాన్ని చట్టం ఆమోదం అనంతర చర్యల్లో పాల్గొన్న 13 రాష్ట్రాలు దాదాపు ఏకగ్రీవంగా వ్యతిరేకించాయి. రాష్ట్రాలవారీ కేటాయించిన ధనాన్ని చూస్తే 125 రోజుల పనిహామీలో సగంతో సరిపెట్టుకోవలసిందే.

ఈ సమాచారం ప్రతిపక్షాల ఆరోపణ కాదు. సమాచార హక్కు చట్టం కింద చక్రధర్ అనే ఆర్‌టిఐ కార్యకర్తకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానంలోని సమాచారం.

కొత్తచట్టం అమలు కోసం కేంద్రం ప్రచురించిన 8రూల్సులో ఆదేశాలు జారీచేసే కేంద్రప్రభుత్వ దృక్పథం తప్ప గ్రామీణ పేదలపట్ల సానుభూతి మచ్చుకైనా కానరాదు. కనీసం వారి సంఘాలతో చర్చించిన పాపానపోలేదు. అనేక సందర్భాల్లోవలె ఈ ధోరణి ఫెడరల్ సూత్రాలను ఉల్లంఘిస్తున్నది.

రాష్ట్ర అధికారాలను కేంద్రంచేతిలోకి తీసుకుని, గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రాల పాత్రను బలహీనపరిచే జి రామ్ జి పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారని, అందువల్ల కేరళ, కర్నాటక ప్రభుత్వాలతో చర్చించి అవసరమైతే న్యాయపోరాటానికి తెలంగాణ సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలను ఇప్పటికే కేంద్రానికి పంపింది.

పాత చట్టాన్ని పునరుద్ధరించాలని ప్రజాసంఘాలు, కొన్ని పార్టీలు, ప్రభుత్వాలు కోరుతున్నా అది ఇప్పటికే రద్దుల పద్దులో చేరింది. ఇష్టమున్నా లేకున్నా కొత్త చట్టాన్ని అమలు జరపక తప్పని స్థితిలో రాష్ట్రాలు ఉన్నాయి. అందువల్ల కేంద్రప్రభుత్వం తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లనే మొండివైఖరి మానుకుని, రాష్ట్రాల అభిప్రాయాలను మరోసారి పరిశీలించి సానుకూల నిర్ణయాలు తీసుకోవటం అవసరం. ముఖ్యంగా వ్యయపంపిణీని పాతచట్టం పద్ధతిలో 90:10కి మార్చినపుడే కొత్తచట్టం అమలు సాధ్యం. అలాగే చేబట్టే పనుల నిర్ణయాన్ని రాష్ట్రాలకు అప్పగించటం, ఆయా రాష్ట్రాల్లోని కనీస వేతన చట్టాలకు అనుగుణంగా గ్రామీణ ఉపాధి హామీ శ్రామికుల వేతనాలు నిర్ణయించటం ఎంతైనా న్యాయం. ఈ పథకం కింద చేబట్టే పనులు మరింతగా ఉత్పాదకతకు, గ్రామీణ వసతుల వృద్ధికి దోహదం చేసేవిగా ఉన్నప్పుడే వెచ్చించే ప్రజాధనానికి సార్థకత. ●



### ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చు

**తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల కోసం మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. మూడు నెలలు లేదా ఆరు నెలల్లో రావొచ్చు. పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలి. పస్తుతం అధికారంలో ఉన్న టివికె ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీలేదు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయి. ఇటీవల వరకు డిఎంకె కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, విసికె, ఐయుఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోంది. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం.**

- డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్



## కార్మిక ఉద్యమాల అజరామర యోధుడు కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు

'నాయకుడు అంటే పదవులు అనుభవించేవాడు కాదు... ప్రజల కష్టాల్లో ముందుండి పోరాడేవాడు' ఈ నిర్వచనానికి సజీవ రూపం కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు. సింగరేణి కార్మిక ఉద్యమ చరిత్రలో, తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో, ఎఐటియుసి కార్మిక సంఘ నిర్మాణంలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. 1930 డిసెంబర్ 6న జన్మించిన మాదిరెడ్డి భాస్కర్ రావు, 1991 జూన్ 30న కన్నుమూశారు. ఆయన మరణించి 35 సంవత్సరాలు పూర్తవుతున్న ఈ సందర్భంగా ఆయన జీవితాన్ని, ఉద్యమాలను, ఆశయాలను స్మరించుకోవడం ప్రతి కార్మికుడి బాధ్యత.

1960లో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, సిపిఐ సీనియర్ నేత కామ్రేడ్ టి.బి. విఠల్ రావు గారి ప్రోత్సాహంతో మాదిరెడ్డి భాస్కర్ రావు గోదావరిఖనికి వచ్చారు. అప్పటికే సింగరేణి బొగ్గ గనులు వేగంగా విస్తరిస్తున్నప్పటికీ కార్మికుల జీవన పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. తక్కువ వేతనాలు, అసురక్షిత పని వాతావరణం, నివాస సమస్యలు, వైద్య సదుపాయాల కొరత కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితులను చూసిన భాస్కర్ రావు తన జీవితాన్ని కార్మికుల విముక్తి పోరాటానికి అంకితం చేశారు. ఎఐటియుసి పతాకం కింద కార్మికులను సంఘటితం చేసి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. కొద్ది కాలంలోనే ఆయన సింగరేణి కార్మికుల్లో విశ్వసనీయ నాయకుడిగా ఎదిగారు. సింగరేణిలో ఎఐటియుసిని బలోపేతం చేయడంలో మాదిరెడ్డి భాస్కర్ రావు పాత్ర అపారమైనది. కార్మిక సంఘం అంటే కేవలం వేతనాల కోసం పోరాడే వేదిక కాదని, అది కార్మికుల గౌరవం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే శక్తిగా ఆయన తీర్చిదిద్దారు. వేతన సవరణలు, బోనస్, గని కార్మికుల భద్రత, ప్రమాద బీమా, నివాస గృహాలు, తాగునీరు, విద్య, వైద్య సేవలు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటి అనేక సమస్యలపై ఆయన రాజీలేని పోరాటం చేశారు. అవసరమైతే సమ్మెలు, ధర్నాలు, చర్చలు నిర్వహిస్తూ యాజమాన్యాన్ని పరిష్కారాల వైపు నడిపించారు.మాదిరెడ్డి భాస్కర్ రావు నాయకత్వం సభలకే పరిమితం కాలేదు. గనుల కాలనీల్లో, కార్మికుల ఇళ్లలో, వారి కష్టసుఖాల్లో ఆయన ఎప్పుడూ ఉండేవారు. ప్రతి కార్మికుడి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించేందుకు కృషి చేసేవారు. అందుకే కార్మికులు ఆయనను నాయకుడిగా మాత్రమే కాకుండా తమ కుటుంబ సభ్యుడిగా భావించేవారు. పదవుల కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆయన రాజకీయాలు చేయలేదు. నిరాడంబర జీవితం, నిజాయితీ, సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలు. భాస్కర్ రావు దృష్టిలో కార్మిక ఉద్యమం కేవలం ఆర్థిక డిమాండ్ల కోసం కాదు. సమాజంలో అసమానతలను తొలగించడం, దోపిడీని ఎదుర్కోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడడం, సామాజిక న్యాయం సాధించడం కూడా కార్మిక ఉద్యమం లక్ష్యాలేనని ఆయన విశ్వసించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై కూడా ఆయన స్పందించారు. ప్రజా ఉద్యమాలకు కార్మిక ఉద్యమాన్ని అనుసంధానం చేస్తూ విస్తృత ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు కృషి చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం విస్తరణ, కార్మిక చట్టాల మార్పులు, ఉద్యోగ భద్రతపై పెరుగుతున్న అనిశ్చితి వంటి పరిస్థితుల్లో మాదిరెడ్డి భాస్కర్ రావు ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారాయి.

సంఘటిత కార్మిక ఉద్యమమే కార్మిక హక్కులను కాపాడగలదని ఆయన చెప్పిన మాటలు నేటి తరానికి మార్గదర్శకంగా ఉన్నాయి. ఐక్యత, క్రమశిక్షణ, ఉద్యమస్ఫూర్తి ఉంటేనే కార్మికులు తమ హక్కులను సాధించగలరని ఆయన జీవితం చెబుతోంది. నేటి యువ కార్మిక నాయకులు మాదిరెడ్డి భాస్కర్ రావు జీవితం నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. సిద్ధాంతాల కోసం త్యాగం చేయడం, ప్రజల కోసం నిరంతరం శ్రమించడం, అధికారానికి కాదు బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వడం, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ ప్రయోజనాన్ని ముందుంచడం ఆయన జీవితంలోని గొప్ప పాఠాలు. 1991 జూన్ 30న కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు భౌతికంగా దూరమైనా, ఆయన ఆలోచనలు, ఆశయాలు, పోరాటాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. సింగరేణి గనుల్లో ప్రతి కార్మికుడి చెమటలో, ప్రతి కార్మిక ఉద్యమ నినాదంలో, ప్రతి హక్కుల పోరాటంలో ఆయన స్ఫూర్తి ప్రతిధ్వనిస్తోంది. ఆయనకు నిజమైన నివాళి పూలమాలలు వేయడం కాదు; కార్మికుల హక్కులను కాపాడుతూ, ఎఐటియుసి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడం.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,

## 'సంస్కరణలకు' తలుపులు తెరుస్తున్న క్యూబా

**సి.జె.అట్కిన్స్**

అమెరికా ఆర్థిక దిగ్బంధనం కారణంగా దీవిదేశం క్యూబా ప్రతిపాదిస్తున్న అత్యవసర సంస్కరణలు, ఆ దేశ సామ్యవాద వ్యవస్థలో ప్రధాన మార్పులను తీసుకువస్తాయన్నది స్పష్టం. ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం, సామ్యవాద మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, నూతన ఆర్థిక విధానం అని క్యూబన్ విప్లవ మద్దతుదారులు లేదా విమర్శకులు ఇలా ఏ పేరు పెట్టి పిలిచినా జరుగుతున్నది ఇదే.

జూన్ 19న ప్రధానమంత్రి మాన్యుయెల్ మారెరో చట్టసభ సభ్యులను ఉద్దేశించి దాదాపు రెండు గంటల పాటు చేసిన ప్రసంగంలో సమర్పించిన 176 ఆర్థిక చర్యలతో కూడిన ఒక సమగ్ర ప్యాకేజీని క్యూబా నేషనల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ప్యాకేజీ సామ్యవాద ఆర్థిక వ్యవస్థలోని ప్రైవేట్ ఆస్తి, మార్కెట్ ధరల నిర్ణయం, కార్మిక చట్టం, బ్యాంకింగ్, విదేశీ పెట్టుబడులు తదితరాలు వంటి దాదాపు ప్రతి అంశాన్ని స్పృశించింది. ఇది ఒక చారిత్రాత్మక పరివర్తనకు తొలి సూచన. కానీ ఈ చర్యలు ఏ విధంగా, అసలు అమలు అవుతాయా, అంతిమంగా ఎవరు ప్రయోజనం పొందుతారు అనేది ఇంకా ప్రశ్నగానే మిగిలిఉంది.

విదేశీ పెట్టుబడిదారులు ఇకపై ప్రభుత్వంతో జాయింట్ వెంచర్‌లను ఏర్పాటు చేయవలసిన అవసరం లేదు. తద్వారా, బైటి నుంచి వచ్చే పెట్టుబడులలో క్యూబన్ ప్రభుత్వాన్ని తప్పనిసరి భాగస్వామిగా ఉంచిన ఒక దీర్ఘకాలిక నిబంధన తొలగిపోతుంది. దశాబ్దాల ప్రభుత్వ ఏకస్వామ్యానికి ముగింపు పలుకుతూ క్యూబా ఆర్థిక రంగంలోకి ప్రైవేట్ బ్యాంకులను తొలిసారిగా అనుమతించబోతున్నారు.

ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో విఫలమై, ఉత్పత్తులను నల్లబజారులోకి నెట్టాయని ప్రభుత్వం అంగీకరిస్తూ తీసుకువచ్చిన సాధారణ ధరల నియంత్రణలను ఎత్తివేసి, వాటి స్థానంలో అత్యంత బలహీన వర్గాలు లక్ష్యంగా రాయితీలను అందించనున్నారు. ప్రైవేట్ ఆస్తుల విషయంలో ఈ సంస్కరణలు గత పద్ధతులకు భిన్నంగా గణనీయమైన మార్పును సూచిస్తున్నాయి. మారెరో ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రకారం, ప్రభుత్వ యాజమాన్యంలోని ఆస్తులను ఇప్పుడు 'విదేశాలలో నివసిస్తున్న క్యూబన్లతో సహా జాతీయ, విదేశీ చట్టపరమైన సంస్థలు, వ్యక్తులకు' విక్రయించవచ్చు. అలాగే, అనేక తరాల తరువాత తొలిసారిగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ అభివృద్ధికి అనుమతి ఇవ్వనున్నారు.

ప్రైవేట్ కంపెనీలకు ఉద్యోగుల సంఖ్యపై ఎలాంటి పరిమితి లేకుండా అధికారం ఇవ్వబోతున్నారు. ఇది మూలధనం ఉన్నవారికి వ్యాపారాలను ప్రారంభించేందుకు లేదా విస్తరించేందుకు అవకాశాలను కల్పిస్తుంది. క్యూబన్లు ఒకటి కంటే ఎక్కువ వ్యాపారాలను సొంతం చేసుకోవడానికి, బహుళ సంస్థలలో ఈక్విటీ వాటాలను కలిగి ఉండటానికి కూడా అనుమతిస్తారు. జాయింట్–స్టాక్ కంపెనీలతో సహా కొత్త కార్పొరేట్ నిర్మాణాలకు అనుమతిస్తారు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలో సాధారణంగా కనిపించే ఈ ఏర్పాట్లు, చారిత్రకంగా క్యూబాలో లేవు. ఎందుకంటే షేర్ల కొనుగోలు, అమ్మకం మూలధన కేంద్రీకరణ సంపద అసమానతలకు దారితీసే అవకాశం ఉంది.

కార్మిక రంగంలో ప్రైవేట్ యజమానులు ఇకపై స్వేచ్ఛగా నియామకాలు చేపట్టనున్నారు. విధిగా ప్రభుత్వ మధ్యవర్తులు లేకుండానే ప్రత్యక్ష దిగుమతి, ఎగుమతులకు అనుమతి ఉంటుంది. క్యూబన్, విదేశీ పెట్టుబడిదారులు ఇద్దరూ గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంపెనీలలో వాటాలను కొనుగోలు చేసే అవకాశం ఉండేది. ప్రధానమంత్రి మారెరో చట్ట సభ సభ్యులకు వివరించినట్లుగా ఈ చర్యలు మార్కెట్‌ను 'సమర్థవంతంగా వనరుల కేటాయింపునకు ఒక సాధనంగా' అధికారికంగా గుర్తిస్తాయి.

ఈ సంస్కరణల నేపథ్యం సుస్పష్టమైనది. 2020 నుండి క్యూబా జిడిపి కనీసం 15 శాతంమేర క్షీణించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన లాటిన్ అమెరికా, కరేబియన్ ఆర్థిక కమిషన్ (ECLAC) 2026 చివరి నాటికి మరో 6.5 శాతం క్షీణతను అంచనా వేసింది. దీంతో క్యూబా వరుసగా రెండవ సంవత్సరం కూడా ఈ ప్రాంతంలో అత్యంత పేలవమైన పనితీరు కనబరిచిన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుంది. 30గంటలకు పైగా కొనసాగే విద్యుత్ కోతలు సర్వసాధారణమై పోయాయి. దీర్ఘకాలంగా ఆహారం, ఇంధనం, మందులు, త్రాగునీటి కొరత నెలకొని ఉంది. వైద్యులకు ప్రాథమిక వైద్య సామాగ్రి అందుబాటులో లేకపోవడంతో 'పిల్లలు చనిపోతున్నారు' అని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ హెచ్చరించారు.

ఈ తక్షణ సంక్షోభానికి కారణం ట్రంప్ పరిపాలన విధించిన చమురు దిగ్బంధనం. ఇందుకు తోడు సాధారణంగా 66 ఏళ్లుగా కొనసాగుతున్న అమెరికా ఆర్థిక దిగ్బంధనం కూడా ఒక కారణం. 2026 జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా అపహరించిన తరువాత, ట్రంప్ పాలనా యంత్రాంగం క్యూబాకు వెనిజులా చేసే చమురు ఎగుమతులను ఆపేసింది. ఈ సరఫరా క్యూబా ఇంధన అవసరాలలో 50 శాతం వరకు తీర్చేది.

ఆ తర్వాత, క్యూబాకు చమురు రవాణా చేసే ఏ దేశంపైనైనా సుంకాలు విధిస్తామని హెచ్చరిస్తూ ట్రంప్ ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. తద్వారా ఈ దిగ్బంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించారు. జనవరి నెలాఖరు నుండి కేవలం ఒక్క రష్యన్ చమురు ట్యాంకర్ మాత్రమే క్యూబాకు చేరుకుంది. ప్రభుత్వం క్యూబా జాతీయ చమురు సంస్థపైనా, అలాగే క్యూబా ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగానికి సంబంధాలున్న సైనిక అనుబంధ సంస్థ అయిన గేసా (GAESA)పైనా ఆంక్షలు విధించింది. అంతేకాకుండా, అంతర్జాతీయ పర్యాటక ఆదాయాన్ని అడ్డుకోవడానికి క్యూబాలో చెల్లింపు సేవలను నిలిపివేయాలని వీసా, మాస్టర్ కార్డ్‌పైనా ఒత్తిడి తెచ్చింది.

నేషనల్ అసెంబ్లీలో ఓటింగ్‌కు కొద్దిసేపటి ముందు అధ్యక్షుడు మిగెల్ డియాజ్‌కానెల్ మాట్లాడుతూ క్యూబా ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి స్పష్టంగా చెప్పారు. 'ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశం నుండి చరిత్రలోనే సుదీర్ఘమైన దిగ్బంధనానికి గురైన సామ్యవాద నిర్మాణ ప్రక్రియను ఎలా కొనసాగించాలనే సందిగ్ధత గురించే ఇక్కడ చర్చ సాగుతోంది.' అయినప్పటికీ, ఈ సంస్కరణలు కేవలం లొంగిపోవడం కాదని డియాజ్‌కానెల్ నొక్కి చెప్పారు. 'మేము అమెరికా ఒత్తిడి కారణంగా ఇలా చేయడం లేదు,' అని ఆయన చట్ట సభ సభ్యులతో అన్నారు. క్యూబా సార్వభౌమాధికారంతో' వ్యవహరిస్తోందని ఆయన గట్టిగా చెప్పారు.

ఈ ప్రతిపాదనలలో చాలా వాటిపై, కనీసం 2011 కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ నుండి సంవత్సరాలుగా అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని, ప్రభుత్వం 'ప్రస్తుతం అత్యవసరమని భావిస్తున్న నిర్ణయాలను 15 సంవత్సరాలకు పైగా వాయిదా వేస్తూ వస్తోందని' ఆయన తెలియజేశారు. 'మనం వర్తమానంలో జీవిస్తున్నామా లేదా అనే దాంతో సంబంధం లేకుండా, ఇది ఎలాగైనా చేయాల్సిందేనని నేను విశ్వసిస్తున్నాను,' అని అధ్యక్షుడు అన్నారు.




దాదాపు 1984 నాటి డెంగ్ జియావో పింగ్‌ను తలపిస్తూ, డియాజ్‌కానెల్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాల్సిన అవసరాన్ని, క్యూబా ప్రజల భౌతిక జీవన ప్రమాణాలు వేగంగా మెరుగుపడాల్సిన అవసరాన్ని, సోషలిజం తన సూత్రాలను క్షుణ్ణంగా, కొత్తగా సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని పదేపదే నొక్కి చెప్పారు. 'సంపద లేకపోతే, పంచడానికి ఏమీ ఉండదు,' అని ఆయన అన్నారు. సామాజిక న్యాయానికి అర్థం ఉండాలంటే, ముందుగా భౌతిక సంపదను సృష్టించడం అవసరమని ఆయన నొక్కి చెప్పారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం, చైనా మార్కెట్ సంస్కరణల ప్రారంభ దశలో ఉన్నప్పుడు, డెంగ్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. సాధారణ పేదరికం అంటే సోషలిజంతో సమానం కాదని ఆయన అన్నారు.

'ఈ పరిస్థితులలో ఉత్పత్తి చేయడం, సంపదను సృష్టించడం, ఆపై సమానత్వంతో కాకుండా సామాజిక న్యాయం, నిష్పక్షపాతంతో పంపిణీ చేయడమే అసలైన సవాలు,' అని డియాజ్ కానెల్ అన్నారు. క్యూబా ఆర్థిక వ్యవస్థ తన ఏకరీతి వేతన విధానాన్ని వదిలించుకోవాలని ఆయన ప్రకటించారు.

విభిన్న అర్హతలు, బాధ్యతలు గల కార్మికుల మధ్య అతి స్వల్ప వేతన వ్యత్యాసాలు మాత్రమే ఉండటంతో, ప్రజలు మరింత కృషి చేసేందుకు లేదా తమను తాము గానీ, తమ కార్యాలయాలను గానీ అభివృద్ధి చేసుకునేందుకు ప్రోత్సహించేలా తగినంత భౌతిక ప్రోత్సాహం లేదని అధ్యక్షుడు అన్నారు. కష్టపడి పనిచేసినా ప్రతిఫలం లభించలేదని, ప్రజలను దీర్ఘకాలం పాటు ప్రేరేపించడానికి కేవలం నైతిక ప్రోత్సాహకాలు మాత్రమే సరిపోవని ఆయన సందేశం ఇచ్చారు. కార్మికులకు స్థిరమైన వేతనాలు చెల్లించి, వాటికి రేషన్లు, సబ్సిడీలు జోడించడం అనేది స్వతహాగా ఒక చెడ్డ పద్ధతేనని అంగీకరిస్తూ, ఇవి సోషలిజం వక్రీకరణలని, క్యూబా ఎదుర్కొంటున్న బయటి ఒత్తిళ్లతో సంబంధం లేకుండా వీటిని మార్చవలసిందేనని డియాజ్ కానెల్ అన్నారు.

**ఈ సంస్కరణలు మన సోషలిస్ట్ పథకం నుండి వైదొలగడం కావు. తద్భిన్నంగా, అవి దాని అభివృద్ధికి ప్రతిస్పందిస్తాయి, దానిని మెరుగు పరచేందుకు ప్రయత్నిస్తాయని మారెరో పునరుద్ఘాటించారు. క్యూబా ఆర్థిక – సామాజిక నమూనాను నవీకరించడానికి మాజీ అధ్యక్షుడు రాల్ కాస్ట్రో చేసిన ప్రయత్నాలను ఆయన ప్రస్తావించారు. 'మూర్ఖంగా లేదా కఠినంగా ఉండకూడదని, సోషలిజం, సమానత్వం మధ్య ఉన్న యాంత్రిక సంబంధాన్ని తొలగించాలని, సోషలిస్ట్ ప్రణాళిక మార్కెట్ నియమాలను మినహాయించకుండా, వాటిని చేర్చుకుని, నియంత్రించాలని గుర్తించాలని' ఆయన పేర్కొన్నారు.**

1996లో 'బ్రదర్స్ టు ది రెస్క్యూ' విమానాన్ని కూల్చివేసినందుకు అమెరికా క్రిమినల్ అభియోగాన్ని ఎదుర్కొంటున్న కాస్ట్రో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతేకాకుండా, ఈ చర్యలు 'ప్రయోజనకరమైనవి' అని పేర్కొంటూ, వాటిని వేగంగా అమలు చేయాలని కోరుతూ కమ్యూనిస్ట్ పార్టీ పొలిట్‌బ్యూరోకు, నేషనల్ అసెంబ్లీకి ఒక లిఖితపూర్వక లేఖను పంపారు.

ఈ ప్యాకేజీని 'ఆలస్యమైన చైనా సంస్కరణలు' అని అభివర్ణించిన క్యూబన్ ప్రతిపక్ష నాయకుడు మాన్యుయెల్ క్యూస్టా మోరువాతో సహా కొంత మంది వ్యాఖ్యాతలు, ఈ మార్పులను 1978 తర్వాత చైనా 'సోషలిస్ట్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ'తో లేదా 1980ల నాటి వియత్నాం డోయ్‌మోయ్ (రినొవేషన్)తో పోల్చారు. ఆ పోలికలలో కొంత పైపైన ఆమోదించవచ్చు. ప్రతి సందర్భంలోనూ కమ్యూనిస్ట్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజకీయ నియంత్రణను కొనసాగిస్తూ, ప్రభుత్వ వ్యవహారాలలో పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తూనే, మార్కెట్ యంత్రాంగాలను, మూలధనంపై ప్రైవేట్ యాజమాన్యాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రవేశపెట్టింది.

కానీ, దీనికి మరింత సముచితమైన చారిత్రక సమాంతరంగా 1921లో సోవియట్ రష్యాలో లెనిన్ ప్రారంభించిన నూతన ఆర్థిక విధానం (ఎన్ఇపి) కావచ్చు. ఇప్పటి మాదిరిగానే అప్పట్లో కూడా అతి తక్కువ అభివృద్ధి చెందిన పారిశ్రామిక పునాది కలిగిన రష్యా, దాని గొంతు నులమటానికి చురుకుగా పనిచేస్తున్న శత్రు శక్తులచే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుండి వేరుచేయబడింది. నూతన ఆర్థిక విధానం (నెప్) ప్రైవేట్ వాణిజ్యం, విదేశీయులకు రాయితీలు, మార్కెట్ యంత్రాంగాలను అనుమతించే 'ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం' లోకి తిరోగమనమని లెనిన్ స్పష్టంగా చెప్పారు. అయితే పాదార్థిక పునాదిని నిర్మించేందుకు తప్పనిసరి అవసరమని, ఈ పునాది అంతిమంగా సోషలిజం పురోగతికి దారితీస్తుందని ఆయన వక్కాణించారు. ఇక్కడి అత్యంత కీలకమైన తేడా ఏమిటంటే, ఎన్ఇపిని ప్రారంభించేందుకు ముందే లెనిన్ విదేశీ సైనిక దాడులను, దేశీయ ప్రతిఘాతక విప్లవాన్ని (చాలా వరకు) తిప్పికొట్టారు. క్యూబా ఒక క్రూరమైన వెలుపలి దాడిలో ఉన్నప్పుడు ఈ రాయితీలు ఇవ్వవలసి వస్తోంది.

తమ లక్ష్యం ప్రభుత్వ మార్పేనని ట్రంప్ ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. 1996 హెల్మ్స్ – బర్టన్ చట్టం కింద ఆంక్షలను ఎత్తివేసేందుకు క్యూబా సోషలిస్ట్ ప్రభుత్వాన్ని తొలగించడం ఒక ముందస్తు షరతు అని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో బహిరంగంగానే పేర్కొన్నారు. క్యూబా స్థిరమైన స్థితి నుండి ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంతో ప్రయోగాలు చేయడం లేదు. దాని తలపై తుపాకీ పెట్టి ఉండగానే అలా చేస్తోంది. ఇది మొత్తం సంస్కరణల ప్యాకేజీపై నెలకొన్న ప్రధాన అనిశ్చితిని మరింత తీవ్రతరం చేస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అధిక భాగాన్ని అమెరికా నియంత్రిస్తోంది. క్యూబాతో వ్యాపారం చేసే ఏ మూడవ పక్షంపైనైనా ఆంక్షలు విధించడానికి అది సిద్ధంగా ఉంది. చైనా లేదా అమెరికా పెట్టుబడుల విషయం లో ఒక పెద్ద ముందడుగు వేసేందుకు ఆంక్షలను పాక్షికంగానైనా సడలించాల్సి ఉంటుంది. హవానాకు అత్యంత ఆశాజనకమైన విషయం ఏమిటంటే క్యూబా ఆర్థిక వ్యవస్థలోని గణనీయమైన భాగాలైన గనుల తవ్వకం, ఇంధనం, పర్యాటక మౌలిక సదుపాయాలు, వ్యవసాయ రంగాలలో చైనా కంపెనీలు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుంది. క్యూబాతో, కరేబియన్ ప్రాంతంలో తన సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో చైనాకు దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికా ఆంక్షలను అధిగమించడంలో దానికి కొంత అనుభవం కూడా ఉంది.

కానీ ఈ విధానం అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేయదు. ప్రస్తుత వాతావరణంలో క్యూబాతో మరింత లోతైన సంబంధాల కోసం అయ్యే ఆర్థిక, దౌత్యపరమైన వ్యయాలను భరించేందుకు చైనా ప్రభుత్వం ఆసక్తిగా ఉంటుందా లేదా అనేది వేచి చూడాలి. మరో కోణంలో వాషింగ్టన్‌కు ఉన్న పలుకుబడిని బట్టి చూస్తే ఈ రాయితీలు ట్రంప్ తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను రాబట్టుకోవడానికి ఒక సాధనంగా మారవచ్చు. అమెరికా కార్పొరేషన్లు, కంపెనీలను, వనరులు, గనులు, హోటళ్లు, రిసార్ట్‌లు స్వాధీనం చేసుకోవటానికి అనుమతించినందుకు ప్రతిఫలంగా, దిగ్బంధనంలోని కొన్ని భాగాలను ఎత్తివేయడం దీని అర్థం కావచ్చు. కొన్ని సందర్భాల్లో, ఇది 1959 తర్వాత జాతీయం చేయబడిన ఆస్తులను విప్లవానికి పూర్వం ఉన్న యజమానుల వారసులు లేదా వారసత్వ హక్కుదారులు తిరిగి కొనుగోలు చేసేందుకు అనుమతిస్తుంది. దీనిని క్యూబా ప్రభుత్వం సూత్రప్రాయంగా చాలాకాలంగా ప్రతిఘటిస్తోన్నది. అదిప్పుడు దొడ్డిదారిలో అనుమతించబడుతోంది. చాలామంది క్యూబన్లు దీనిని విప్లవానికే ద్రోహంగా భావించవచ్చు. ఫ్లోరిడాలోని అనేక అమెరికా కార్పొరేషన్‌లు, సంపన్న క్యూబన్ ప్రవాసు లు నిస్సందేహంగా క్యూబాలో సోవియట్ యూనియన్ తరహా పతనాన్ని ఆశిస్తున్నారు. అంటే, భారీ ప్రైవేటీకరణలు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలతో సహా సోషలిజాన్ని పూర్తిగా కూలదోయాలని వారి ఉద్దేశ్యం. అయితే, క్యూబా ప్రభుత్వ నాయకత్వం, అధికార కమ్యూనిస్ట్ పార్టీ, తాము అలాంటి ఫలితాన్ని కోరుకోవడం లేదని స్పష్టం చేశాయి.

అయినప్పటికీ, ఇంకా ఏదీ కొలిక్కి రాలేదు. సంస్కరణలు అమలులోకి వచ్చి ఫలితాలను ఇచ్చేందుకు సమయం పడుతుంది. చట్టపరమైన ఆమోదానికీ, వాస్తవ ప్రపంచ మార్పుకూ మధ్య ఉన్న అంతరాన్ని అంగీకరిస్తూ, 'ఈ పరివర్తనల ఆమోదం కన్నా వాటిని సక్రమంగా, సకాలంలో అమలు చేయడం అంతకంటే ముఖ్యం' అని డియాజ్‌కానెల్ స్వయంగా హెచ్చరించారు. ఈ 176 చర్యలు ఏ యంత్రాంగాల ద్వారా, లేదా ఏ కార్య ప్రణాళిక (టైమ్‌టేబుల్) ప్రకారం అమల్లోకి వస్తాయనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించలేదు. చివరల్లో ఫిడెల్ కాస్ట్రో ప్రసిద్ధ నినాదం 'సోషలిజం ఒ మ్యూర్తే'(Socialismo o muerte!– సోషలిజం లేదా మరణం!) అంటూ డియాజ్ కానెల్ సమావేశాన్ని ముగించారు. నియంత్రిత మోతాదులో పెట్టుబడిదారీ విధానం సోషలిజాన్ని కాపాడగలదని క్యూబా పందెం కాస్తోంది. ఇదే పందెం వంద సంవత్సరాల క్రితం, చాలా భిన్నమైన పరిస్థితులలో లెనిన్ కూడా వేశారు. వ్యూహాత్మక వెనుకంజను శాశ్వత పరివర్తనగా మార్చగల ఒత్తిళ్లను ప్రతిఘటిస్తూ, ఆ పందెంలోని తీవ్రమైన వైరుధ్యాలను క్యూబా నాయకత్వం అధిగమించగలదా లేదా అన్నదే రాబోయే నెలలకు సంబంధించిన కీలక ప్రశ్న.

*(సౌజన్యం : పీపుల్స్ వరల్డ్)*

# ఇంజనీరింగ్ బి-కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలి

- ఎఐఎస్ఎఫ్ డిమాండ్
- ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ధర్నా
- విద్యార్థి నాయకుల అరెస్టు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో బికేటగిరి (యాజమాన్య కోటా) సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. యాజమాన్య కోటా పేరిట జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టి అర్హులైన నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో యాజమాన్య కోటాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయం (మాసబ్ ట్యాంక్) ఎదుట ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అసిఫ్ నగర్ పోలీస్ స్టేషనుకు తరలించారు.

**సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలి**

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు యజమాన్య కోటా పేరుతో కృత్రిమంగా సీట్ల కొరత సృష్టించి ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయాల దోపిడికి తెగబడుతున్నాతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని రద్దు చేసి కౌన్సిలింగ్ ద్వారానే అన్నిసీట్లను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్టా లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. పలు కళాశాలలు ఫీజు నియంత్రణ కమిటీ నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నాయని, తనిఖీల సమయంలో మాత్రమే అర్హత కలిగిన అధ్యాపకులను చూపించి, అనంతరం నిబంధనలను ఉల్లంఘిస్తూ కళాశాలలను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘురాం నాయక్, గ్యార నరేష్, రెహమాన్, ఎండి అన్వర్, అనిల్, దత్తురెడ్డి, ఆకాష్ నాయక్, శాంతికుమార్, లెనిన్, హరీష్, అశ్వన్, యశ్వంత్, చట్ల సమ్మయ్య, రాహుల్, లోకేష్, వినోద్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి తెలంగాణ బియ్యం

ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు :మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :**తెలంగాణను ప్రపంచ స్థాయి బియ్యం ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ హోటల్‌లో కెసిపి న్యూట్రీ రూపొందించిన మల్టీ విటమిన్ రైస్ ఉత్పత్తులను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం కొత్త విధానాలతో ముందుకు వెళ్తోందన్నారు. రైతులు, రైస్ మిల్లర్లకు అధిక ఆదాయం వచ్చేలా బియ్యానికి విలువ జోడించే ఉత్పత్తులను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు చేపట్టే పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైన అనుమతులను కూడా వేగంగా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ.19,303 కోట్లను నేరుగా జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి రాష్ట్రంలో బియ్యం ఉత్పత్తి 300 లక్షల మెట్రిక్ టన్నులను దాటిందని, రాష్ట్ర వార్షిక వినియోగం కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండటంతో తెలంగాణ మిగులు బియ్యం ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ, సాగునీటి విస్తరణ, రైతులకు నిరంతర నీటి లభ్యత కల్పించడం వల్లే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడం, రైస్ మిల్లింగ్ పరిశ్రమ బలోపేతం కావడం, బియ్యం ఎగుమతుల ద్వారా తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలి

- సర్ ప్రక్రియపై కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎఇఆర్‌ఓలు, ఇఆర్‌ఓలు విస్తృతంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి, బిఎల్‌ఓలకు అవసరమైన సూచనలు అందించి ప్రజలతో అనుసంధానం పెంచాలని, ఓటరు హెల్ప్‌లైన్ 1950, హెల్ప్‌డెస్క్ నంబర్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ప్రక్రియపై సోమవారం బిఆర్‌కె భవన్‌లో జిల్లా కలెక్టర్లతో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం నాలుగు రోజులలోనే దాదాపు 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంపై బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల అధికారుల పనితీరు పట్ల సిఇఒ అభినందించారు. నిర్ణీత గడువులోగా 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు బిఎల్‌ఓలను ప్రోత్సహించాలని సూచించారు. బిఎల్‌ఓలు తమ విధులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. డిఇఓలు, ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలను సమీక్షిస్తూ, సామాజిక మాధ్యమాల్లో క్రమం తప్పకుండా వివరాలను ప్రచురించాలని, అధికారుల క్షేత్ర పర్యటనలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంలో ఓటర్లకు సహాయపడే ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా బిఎల్‌ఓలకు మరో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి, నోడల్ అధికారులు, పిఎం (ఐటి), సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- మంత్రులు భట్టి, తుమ్మల



**ప్రజాపక్షం/చింతకాని :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరుణ దేవుడు కూడా ముందే ఆశీర్వదించాడని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం చింతకాని మండలం జగన్నాధపురంలో ఈ నెల 30న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభా వేదికలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భట్టి మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఈ కారణంతో రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుడదన్న ఉద్దేశ్యంతో సభా నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని రైతు భరోసా పంపిణీ పూర్తయిన పిదప మరింత ఉత్సాహంగా రైతు ఆశీర్వాద సభ పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని భట్టి స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ నాటి పదేళ్ల పాలనలో కేవలం ఉప ఎన్నికల సమయంలోనే రైతు బంధు విడుదల చేస్తే కాంగ్రెస్ రెండున్నరేళ్లలో 36వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిందని, కేసిఆర్ అవలంభించిన రైతు వ్యతిరేక విధాలనాలతో వారి ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపారని మంత్రి తుమ్మల అన్నారు. మంగళవారం శిల్పరామం లలిత కళాతోరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు ఈ వానాకాలం రూ.9వేల కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నిధుల విడుదల తర్వాత రైతు ఆశీర్వాద సభ చరిత్రలో నిలిచిపోయేలా జగన్నాధపురంలో జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టియస్, సీపీ సునిల్ దత్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, హస్త కళల చైర్మన్ నాయుడు సత్యం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఖమ్మం, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు హనుమంత రావు, అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, తుపాకుల యలగొండ స్వామి మత్కేపల్లి , జగన్నాధపురం సర్పంచ్‌లు కంచం ద్రౌపది, తాళ్ళూరి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- రాబోయే మున్సిపల్ ఎన్నికలు సెమీఫైనల్ : కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి నిలదీయాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానములో జరిగిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం హైదరాబాద్ తరువాత అత్యధికంగా నిధులిచ్చింది వరంగల్ కార్పొరేషన్‌కేనని చెప్పారు. అయినా ఆ నిధులన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు దోచుకుతిన్నారని మండిపడ్డారు. స్మార్ట్ సిటీ నిధులన్నీ నాటి బీఆర్ఎస్ నేతలు స్వాహా చేశారన్నారు. అందుకే చినుకు పడితే వరంగల్ మునిగిపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఎవరు గెలిచారు? బిజెపి. ఇవాళ గల్లీగల్లీలో కాషాయ కార్యకర్త గల్లా ఎగరేసుకుని తిరుగుతున్నారని, ఇప్పుడు వరంగల్‌కు ఆ అవకాశం వచ్చిందన్నారు. 10 ఏళ్లు బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ వరంగల్‌కు ఏం చేసింది? అని ప్రశ్నించారు. నరేంద్రమోదీ పెద్ద ఎత్తున నిధులిస్తే ఆ పైసలు ఏం చేశారు? స్మార్ట్‌సిటీ పైసలిస్తే ఏం చేశారు? కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పైసలతో అభివృద్ధి జరిగిందని, మరి వరంగల్‌కు కూడా ఇచ్చినా ఎందుకు అభివృద్ధి చేయడం లేదని, చిన్నపాటి వర్షానికే వరంగల్ మునిగే అవకాశం వచ్చిందని, మరి మోదీ పైసలన్నీ యాడ పోయినయన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలొస్తే ఇచ్చిన హామీలు ఏమయ్యాయని గల్లా పట్టి నిలదీయండన్నారు. తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి చెందిందంటే మోదీ ఇస్తున్న నిధులే కారణమని, 12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయలు ఇచ్చామని, కేంద్ర నిధులపై చర్చకు రావాలంటూ కిషన్ రెడ్డి సవాల్ చేస్తే తోకముడిచారన్నారు. మొత్తంగా వరంగల్‌పై కాషాయ జెండా ఎగరేసి తీరుతామన్నారు. ఈ సభలో రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, ఎంపి ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, జిల్లాల అధ్యక్షులు గంటా రవి కుమార్, కె.సంతోష్ రెడ్డి, జాతీయ, రాష్ట్ర నాయకులు గరికపాటి మోహన్ రావు, డాక్టర్ టి.రాజేశ్వరరావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మార్తినేని ధర్మారావు, రావు పద్మా రెడ్డి, కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ లు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఒక లేఖ రాశారు. మంగళవారం నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో రైతులు సాగు చేసే మెట్ట పంటలన్నింటికీ మద్దతు ధరలు ఇచ్చి ఆదుకుంటామని అధికారికంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఇంకా వానలు పడకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని లేఖలో పేర్కొన్నారు. వానలు ఆలస్యం కావడం వల్ల, పడిన కొద్దిపాటి వర్షాలకే వేసిన పత్తి విత్తనాలలో దాదాపు 30 శాతం వరకు మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటివరకు కనీసం ఒక శాతం కూడా వరి నాట్లు పడలేదని, రాష్ట్రంలోని 17 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని వివరించారు. రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖరీఫ్ పంటలకు రైతు భరోసా ప్రకటించనుండటం హర్షనీయమని, అయితే 2024, 2025 సంవత్సరాల రబీ పంటల రైతు భరోసాను ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేసి రైతులను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి, వర్షాలు లేక అల్లాడుతున్న రైతులను మరింతగా ఆదుకోవడానికి ప్రభుత్వం త్వరితగతిన స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోటు వర్షపాతం నమోదైతే ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా యుద్ధప్రాతిపదికన తెలియజేయడంతో పాటు మెట్ట పంటలకు అవసరమయ్యే ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుతుండటంతో రాబోయే రోజుల్లో తాగు నీటి సంక్షోభం తలెత్తకుండా పరిస్థితులను ముందస్తుగా సమీక్షించాలని వారు కోరారు.

## అన్నదాతలకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు

- తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏరువాక పున్నమి సందర్భంగా తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'పొలం దున్నే నాగలికి, నాగలి పట్టే చేతులకు నా వందనం. ఏరువాక పున్నమి సందర్భంగా తెలంగాణ రైతన్నలందరికీ నా మనసారా శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. మట్టిని నమ్ముకున్న రైతులకు అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించామని చెప్పారు. అలాగే రైతు భరోసా సాయాన్ని ఎకరానికి రూ.6,000కు పెంచామని, ప్రస్తుత పంట కాలానికి సంబంధించిన నిధులు త్వరలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని వెల్లడించారు. చివరగా, 'పైర్లు పచ్చగా పెరగాలి.. కళ్లాలు నిండుగా ఉండాలి.. రైతన్న నవ్వు తెలంగాణ గడ్డపై ఎల్లప్పుడూ వెలగాలి' అంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతాంగానికి ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్‌టిసి బస్సు ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వనపర్తి డిపోకు చెందిన టిజిఎస్ ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం ఉదయం కర్నూలు నుంచి వనపర్తికి వస్తుండగా రంగాపూర్ సమీపంలోని జాతీయ రహదారి44పై ప్రమాదానికి గురైంది. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులందరికీ మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌టిసి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం అందిందని, వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అధికారులను సూచించారు. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించిన మంత్రి, గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**వనపర్తి బస్సు ప్రమాదం బాధాకరం: టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

వనపర్తి సమీపంలోని రంగాపూర్ వద్ద జాతీయ రహదారి44పై ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాదానికి గురైన ఘటన పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనలో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం అందిందని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్‌టిసి అధికారులు, పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం అభినందనీయమన్నారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

హైదరాబాద్ మహానగరపాలక సంస్థ

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- | --- |
| 19 | రాజేంద్రనగర్ జోన్, రాజేంద్రనగర్ సర్కిల్-19 పరిధిలో రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా సి.సి. రోడ్ల నిర్వహణకు సంబంధించిన 10 పనులకు, అలాగే సి.సి. రోడ్డు నిర్మాణం మరియు ప్యాచ్ వర్క్ (బోనాల పనులతో సహా) నిర్వహణకు. | రూ. 64.82 లక్షలు | తేది: 02.07.2026 సా.4.30 గం.లకు | తేది: 05.07.2026 సా.4.40 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec11.aghmc2@gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 5124-PP/CL/ADVT/2026-27, Date: 29-06-2026

GHMC

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ బయోడైవర్సిటీ వింగ్

| Sl. No. | నోటిఫికేషన్ నెంబర్ | పని పేరు | దరఖాస్తుల విక్రయం తేది & సమయం | దరఖాస్తుల సమర్పణకు ఆఖరి తేది & సమయం | దరఖాస్తుల సమర్పణ & విక్రయం ప్రదేశం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| 1 | 685/DUB/GHMC/2026 | జిహెచ్ఎంసి, పట్టణ జీవవైవిధ్య విభాగంలో మొక్కల పెంపకం, సాఫ్ట్ ల్యాండ్ స్కేపింగ్, ఉద్యానవనం మరియు ఇతర రకరకాల పనుల అమలు కోసం కాంట్రాక్టర్ల పునరుద్ధరణ మరియు కొత్త ఎంప్యానెల్‌మెంట్. | 30.06.2026 నుండి 17.07.2026 ఉ.11.00 గం.ల నుండి సా.04.00 గం.ల మధ్య | 17.07.2026 సా.05.00 గం.ల వరకు | O/o. డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ, జిహెచ్ఎంసి, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్ | డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ, జిహెచ్ఎంసి, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్. సెల్ నెం. 8712013177 |

సం/- డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 5144-PP/CL/ADVT/2026-27, Date: 29-06-2026

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం :: భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. సెల్ నం. 9949551039, 9515545354.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి నం. ఎ5/1392/2019 — ది.19.06.2026

ది.16.07.2026 నుండి ది.15.07.2027 వరకు 1 సం.ర కాలంనకు భక్తులచే సమర్పించబడు అన్ని రకముల వస్త్రములు ప్రోగుచేసుకొని విక్రయించుకొను లైసెన్సు హక్కు కేటాయించుటకుగాను, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ షెడ్యూల్ తేది. 25.06.2026 మధ్యాహ్నం గం.12:30ని.ల నుండి. ఇ-టెండర్లు దాఖలుచేయు చివరి తేది.10.07.2026 మధ్యాహ్నం గం.12:30ని.ల వరకు, టెక్నికల్ బిడ్ తెరచు తేది. 10.07.2026న మధ్యాహ్నం గం.12:45 ని.లకు, ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది.10.07.2026న మధ్యాహ్నం గం.1.00లకు. అదే రోజున మధ్యాహ్నం గం.11:00ల నుండి కార్యనిర్వహణాధికారి వారిచే తానీషా కళ్యాణమండపం నందు బహిరంగ వేలం జరుపబడును. పాటలో పాల్గొనువారు రూ. 5,00,000/-లు ప్రథమ ధరావత్తు సొమ్మును డి.డి. ద్వారా చెల్లించి మరియు పోస్ట్ డేటెడ్ చెక్స్-3 నం.లు సమర్పించి పాటలో పాల్గొనవలెను. పాట ముగిసిన తదుపరి ఇ-టెండర్లు తెరువబడును. ఇ-టెండర్లు / బహిరంగవేలం పాటలలో వచ్చిన హెచ్చు మొత్తము పరిగణన లోనికి తీసుకొనబడును.

ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

సం/- కె. దామోదర్ రావు

కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 5073-PP/CL/ADVT/2026-27, Date: 29-06-2026


# 15 ఏళ్లు అయినా... ట్రయల్ ప్రారంభం కానీ 20 కేసులు

- జగన్‌పై సిబిఐ-ఇడి కేసులు ఎందుకు ముందుకు కదలడం లేదు?
- సుప్రీంకోర్టు ఆదేశాలకు నోచుకోని ప్రజాప్రతినిధుల కేసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పదిహేను ఏండ్లు.. 20 కేసులు.. ఆరుగురు జడ్జీలు.. వేల పేజీల చార్జిషీట్లు.. అనేక డిస్చార్జ్ పిటిషన్లు.. అయినా ట్రయల్ ప్రారంభం కాలేదు. ఇది కేవలం జగన్ కేసుల కథ మాత్రమే కాదు. దేశంలో ప్రముఖులపై నమోదయ్యే అవినీతి కేసులు ఎందుకు దశాబ్దాల పాటు న్యాయవ్యవస్థలోనే చిక్కుకు పోతాయన్నది ప్రశ్న ఉదాహరణకు 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నమోదైన 11 సిబిఐ, 9 ఇడి అవినీతి, అక్రమాస్తుల కేసులు దాదాపు పదిహేను ఏండ్లకు పైగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటికీ ఈ కేసుల్లో చాలా వరకు పూర్తి స్థాయి ట్రయల్ ప్రారంభం కాకపోవడం న్యాయ వ్యవస్థ పనితీరు, విచారణా ప్రక్రియలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు రాజకీయ ఆరోపణలు, మరోవైపు న్యాయపరమైన ప్రక్రియలు, వరుస పిటిషన్లు, జడ్జీల మార్పులు కలిసి కేసుల పురోగతిని మందగింపజేశాయని న్యాయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**అసలు కేసులు ఎప్పుడు నమోదయ్యాయి?**

2011లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ జగన్‌కు చెందిన అక్రమాస్తుల వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించింది. అనంతరం పలు చార్జిషీట్లు దాఖలు చేసింది. అదే కేసులకు అనుబంధంగా డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మనీలాండరింగ్ కోణంలో తొమ్మిది కేసులు నమోదు చేసింది. 2012లో జగన్ అరెస్టై దాదాపు 16 నెలలు జైలులో గడిపిన తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

**ట్రయల్ ఎందుకు ప్రారంభం కాలేదు?**

న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేసుల ఆలస్యానికి ప్రధాన కారణం 'డిస్చార్జ్ పిటిషన్లు'. అంటే, 'ఈ కేసులో నాపై సరైన ఆధారాలు లేవు, ట్రయల్ నుంచి నన్ను మినహాయించండి' అని నిందితులు కోర్టును కోరే ప్రక్రియ. జగన్ తరపున, అలాగే ఇతర సహ నిందితుల తరపున దాఖలైన అనేక డిస్చార్జ్ పిటిషన్లు, వాటిపై విచారణ, హైకోర్టు, సుప్రీంకోర్టుల వరకు వెళ్లిన అప్పీలు కారణంగా ప్రధాన విచారణ ప్రారంభం కాలేదని న్యాయవర్గాలు చెబుతున్నాయి.

**జడ్జీల మార్పు కూడా ఆలస్యానికి కారణమా?**

ఈ కేసులను విచారించిన ప్రత్యేక సిబిఐ కోర్టులో గత పదేళ్లలో పలువురు న్యాయమూర్తులు మారారు. కొందరు పదోన్నతులు, మరికొందరు బదిలీలు, ఇంకొందరు పదవీ విరమణ కారణంగా తప్పుకున్నారు. వాదనలు దాదాపు పూర్తయ్యే దశలో జడ్జీలు మారిపోవడంతో కొత్తగా వచ్చిన న్యాయమూర్తులు మళ్లీ కేసు రికార్డులను అధ్యయనం చేసి వాదనలు వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒకే అంశంపై పలుమార్లు వాదనలు జరిగినప్పటికీ తుది నిర్ణయం ఆలస్యమవుతూ వచ్చింది.

**సుప్రీంకోర్టు ఆదేశాలున్నా ఎందుకు వేగం పెరగలేదు?**

ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులను ఏడాదిలోపే విచారించాలని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో సూచించింది. ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించింది. అయితే భారీ సంఖ్యలో సాక్షులు, వేల పేజీల చార్జిషీట్లు, అనుబంధ పిటిషన్లు, వివిధ స్థాయిల్లో న్యాయపరమైన సవాళ్లు కేసుల పురోగతిని ప్రభావితం చేస్తున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

**రాజకీయ విమర్శలు వైసిపి**

వైసిపి నేతలు మాత్రం ఈ కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగంగా నమోదయ్యాయని, కోర్టుల్లో నిజానిజాలు తేలుతాయని చెబుతున్నారు. తాము చట్ట ప్రక్రియను అనుసరిస్తున్నామని, డిస్చార్జ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రతి నిందితుడికి చట్టబద్ధమైన హక్కేనని పేర్కొంటున్నారు. ఇక ప్రతిపక్ష పార్టీలు మాత్రం వరుస పిటిషన్లు, వాయిదాలు, న్యాయ ప్రక్రియలను ఉపయోగించుకోవడం వల్లే కేసులు ట్రయల్ దశకు చేరలేదని ఆరోపిస్తున్నాయి.

**ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి..**

ప్రముఖ వ్యక్తులపై నమోదైన కేసులు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉండటం న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని దెబ్బతీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ వ్యక్తుల కేసులు వేగంగా సాగుతుంటే, ప్రముఖుల కేసులు మాత్రం అంతులేని న్యాయ ప్రక్రియలో చిక్కుకుపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**కీలక ప్రశ్నలు**

- 20 కేసులు నమోదై పదిహేను ఏండ్లు దాటినా పూర్తి స్థాయి ట్రయల్ ఎందుకు మొదలుకాలేదు?
- డిస్చార్జ్ పిటిషన్లపై నిర్ణయాలకు ఎందుకు ఇంత సమయం పట్టింది?
- జడ్జీల తరచూ మార్పు విచారణను ఎంతవరకు ప్రభావితం చేసింది?
- ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతమైన విచారణపై సుప్రీంకోర్టు ఆదేశాలు ఎందుకు పూర్తిగా అమలు కాలేదు?
- న్యాయ ప్రక్రియలో జాప్యానికి బాధ్యత ఎవరిది?

## యంగ్ ఇండియా స్కూల్

# 'కొత్తగూడెం'కు కీర్తి పతాక

- విద్యా హబ్‌గా మారనున్న జిల్లా కేంద్రం
- రూ 200 కోట్లతో అత్యాధునిక హంగులతో యంగ్ ఇండియా స్కూల్
- శరవేగంగా 25 ఎకరాల భారీ విస్తీర్ణంలో నిర్మాణాలు
- కొత్తగూడెం శాసన సభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని, ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్‌గా మారబోతోందని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్‌లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్‌లో రూ 200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25,475 ఎకరాల భారీ విస్తీర్ణంలో 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్‌లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ సరి కొత్త స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ సెంటర్లు, సైన్స్ ట్యాబ్‌లు, 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక , మానసిక వికాసం కోసం 200 మీటర్ల, రన్నింగ్ ట్రాక్, క్రికెట్ గ్రౌండ్, వాలీ బాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, సౌర, పవన్ విద్యుత్ వ్యవస్థలను, నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని, ఇప్పటికే రోడ్లు, బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు, ఓవర్ బ్రిడ్జీలు, ఔటర్ రింగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరి కొన్నింటికీ మంజూరు లభించిందని తెలిపారు. అన్ని కులాల వారికి 17 కమ్యూనిటీహాలు మంజూరు చేయడం జరిగిందని, ఎయిర్పోర్టు, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, క్రీడామైదానాలు, జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలేకర సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు హేమచంద్రరావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహా, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సోమవారం మమత ఆసుపత్రి రోడ్డులోని పసుమర్తి ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో పదవ తరగతిలో అన్ని మండలాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతా చందర్‌రావు, ప్రధాన కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించిన నిర్వహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో చారుగుండ్ల నర్సింహమూర్తి, గుర్రం సీత, కొండా శ్రీధర్, పసుమర్తి రాంచందర్‌రావు, ప్రవీణ్, ఉపాధ్యక్షులు వేమిశెట్టి మోహన్‌దాస్, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, వెచ్చా రామకృష్ణ, దాచేపల్లి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి చేయూత



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సహకార సంఘం ద్వారా రైతు సంక్షేమానికి చేయూతనందిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వ ద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార జెం డాను ఛైర్మన్ రావూరి సైదుబాబు ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపా రు. రైతులకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పంటల రుణాలతో పాటు ఇతర రుణాలను కూడా అందిస్తున్నామన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలతో పాటు, బంగారు రుణాలు, సేవింగ్స్ ఖాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్లు జోగు అనిత, గోపగాని ముత్తి లింగయ్య, సుగుణ, సొసైటీ కార్యదర్శి అయితగాని తిరుపతిరావు, సిబ్బంది, రైతులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా రాంబాబు, జగన్





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రాంబాబు, బానోత్ జగన్ లు ఎన్నికయ్యారు. గిరిజన సమాఖ్య ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వీరి ఎన్నిక జరిగింది. ఏన్కూరు మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన రాంబాబు గిరిజన సమాఖ్యలో భారత కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన వివిధ ప్రజా సంఘాల్లో పనిచేశారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన జగన్ గత దశాబ్ద కాలంగా గిరిజన సమాఖ్యలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారం కోసం గిరిజన సమాఖ్య నేతృత్వంలో కృషి చేయనున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండలానికి చెందిన బానోత్ నాగేశ్వరరావును జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు.

## సైన్స్ మ్యూజియంను సందర్శించిన డిఇఒ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా సైన్స్ మ్యూజియంను ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి సదానందం సందర్శించారు. సోమవారం సైన్స్ మ్యూజియంను డిఈవో సదానందం సందర్శించి మ్యూజియం పరిసరాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మ్యూజియంకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లు మ్యూజియం సందర్శించే విద్యార్థులకు సైన్స్ నమూనాలు వివరిస్తారని డిఈవో తెలిపారు. అనంతరం డిఈవో మాట్లాడుతూ సైన్స్ మ్యూజియం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తెరిచి ఉంచాలని తెలిపారు. భోజన విరామ సమయం మధ్యాహ్నం 1 గంట నుంచి రెండు గంటల వరకు మాత్రమేనన్నారు. మ్యూజియంకు వచ్చే విద్యార్థులకు ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి వివరాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వత్స శ్రీనివాస్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ప్రభాకర్, నూతన ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## 12న 'సైరా ది వార్ ఆఫ్ డ్యాన్స్' పోటీలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** కళ్యాణ్ సుమిత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో జూలై 12న, కొత్తగూడెం సిఆర్ క్లబ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ది వార్ ఆఫ్ డాన్స్ నృత్య పోటీలను నిర్వహిస్తున్నామని శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్. సురేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం నృత్య పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నృత్య కళను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పోటీలను నిర్వహిస్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాలలో గల కళాకారులు తమ నృత్య ప్రదర్శనలో ప్రతిభను చాటుకొనే గొప్ప వేదికగా నిలుస్తుందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీలలో పాల్గొనే కళాకారులు తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకొనేందుకు 7702395571కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు: కలెక్టర్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రత్యే ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటిని తప్పని సరిగా సందర్శించి అర్హులందరికీ ఫారాలు అందేలా చూడాలని సూచించారు. ఓటర్ల సందేహాలు నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ఎవ్వరూ మిస్ కాకూడదని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ములకలపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ సేవలు, మందుల నిల్వలు, ల్యాబ్, ఫార్మసీ, పరిశుభ్రతను పరిశీలించారు. అవసరమైన మందులు, పరీక్షా కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాన్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో తక్షణమే అమలు చేయాలి



ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి

**ప్రజాపక్షం/ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకరకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మహిళలకు పలు హామీలు ఇచ్చిదని కేవలం ఉచిత బస్సు మినహా మిగిలిన ఏ హామీని నేరవేర్చలేదని నీరజ, లతాదేవి లు తెలిపారు. ఆత్మీయ భరోసా పథకం కింద రూ. 12 వేలు ఆర్థిక సాయం, తులం బంగారం, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.2,500, రూ. 500కే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, విద్యార్థులకు స్కూటీలు పంపిణీ పథకంతో పాటు మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని సంక్షేమ హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకులు పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వంద శాతం హాజరే లక్ష్యం



జిల్లా విద్యాధికారి వాసంతి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతానికి చేరేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి సూచించారు. సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫేస్ రికగ్నిషన్(ఎస్ఆర్ఎస్)యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించిన ఆమె, నలుగురు ఉపాధ్యాయులు గైర్హాజరైనట్లు గుర్తించి, మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కొత్త అడ్మిషన్లు పెంచడంతో పాటు ఎన్‌రోల్‌మెంట్ మెరుగుపరచాలని సూచించారు. వంట గది, ఆహార నిల్వలు, మరుగుదొడ్లు, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించిన ఆమె, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్ర వాతావరణాన్ని కొనసాగించాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈఓ వాసంతి, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి డిజిటల్ విద్యా వేదికలను వినియోగించుకుని విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. వారం రోజుల్లో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులందరూ క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా హక్కుల సాధనకు ఉద్యమించాలి

మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మీ కుమారి




**ప్రజాపక్షం/మణుగూరు:** మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరు మండలం సాంబాయిగూడెం గ్రామంలో బోలగని సమ్మక్క కోడిమెల సుజాత, అధ్యక్షు వర్గంగా మహాసభ జరిగింది. ఈ మహా సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్న లక్ష్మి కుమారి మాట్లాడుతూ జూన్ 4 1954లో కలకత్తా నగరంలో భారత జాతీయ మహిళా సంఘం ఏర్పడిందని, నాటి నుండి నేటి వరకు మహిళలపై జరుగుతున్న దాడులను బాల్య వివాహాల అరికట్టడంలో సతీసహ గమన విధానానికి వ్యతిరేకంగా, అంటరానితనం నిర్మూలనకు, ఇట్టి చాకిరి విముక్తి కొరకు ప్రత్యేక భాషా సంయుక్త రాష్ట్రాల కోసం మహిళలు నడుం బిగించి అనేక పోరాటాలు కొనసాగించి తమ హక్కుల కోసం నినదించారన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళా బిల్లు ను సాకుగా చూపి కేంద్రం రాష్ట్ర ఎన్నికల పునర్విభజన బిల్లు పాస్ చేయించుకోవాలని కుట్ర చేసిందని అందుకే బిల్లును ఆడుకున్నారని, దీనిపై ప్రభుత్వం రాద్ధాంతం చేస్తుందని, ప్రతి పక్షాలపై బూచి చూపించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళ ల పై ఏదో ఒక విధంగా దాడులు సాగుతున్నాయన్నారు.వీటిపై ప్రభుత్వం చట్టాలను కఠినంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమైక్య నాయకురాలు విసం చెట్టి,పద్మజ, మామిడాల ధన లక్ష్మి రత్నకుమారి, ఎస్కే షాహిని, సర్పంచ్ చిడం ఉషారాణి, వార్డు మెంబర్లు జక్కుల స్రవంతి, నిరోష, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, ఉప సర్పంచ్ పులిగల రమేష్ ,గడ్డం వెంకటేశ్వర్లు ఎస్కే సర్వర్, తోట రమేష్, రేగల పద్మ సాధనబోయిన శ్రీలత, ఆగమ్మ, బద్రి కళావతి రేణుక, అనుష తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహిళా సమైక్య జెండాను జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి ఎగరవేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు బుల్లోజు అయోధ్య కి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం 19 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

## బిల్లు ఇవ్వలేదని బడికి తాళం

**ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులతో గుత్తేదారు ఆందోళన**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాల భవనాలకు మరమ్మతు లు చేస్తే చెల్లింపులు జరపలేదని గుత్తేదారు పాఠ శాల గేటుకు తాళం వేశారు. అంతేకాకుండా తనకు బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ బాటిల్‌తో ఆందోళనకు దిగాడు.వివరాల్లోకి వెళితే... గత ప్రభుత్వ హాయాంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా దానవాయిగూడెం ప్రభుత్వ పాఠశాలకు రూ. 26 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టానని ఇంకా రూ. 13 లక్షల బిల్లులు రావాల్సి ఉందని గుత్తేదారు అయోధ్య తెలిపారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో పాఠశాల గేటుకు తాళం వేయాల్సి వచ్చిందన్నారు. గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బయట ఉండిపోయారు. గుత్తేదారు అయోధ్య కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ బాటిల్ పట్టుకుని నిరసనకు దిగారు. తనకు వెంటనే బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించారు. విషయం తెలిసిన అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మి పోలీస్ సహాయంతో పాఠశాల వద్దకు వెళ్లారు. గుత్తేదారుతో మాట్లాడి తాళం తీయించి యధావిధిగా తరగతులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. బిల్లుల చెల్లింపు విషయమై శైలజ లక్ష్మి ని ప్రశ్నించగా మన ఊరు మన బడి పథకం క్రింద రూ.16 లక్షల పనులను గుత్తేదారు చేశాడని ఇందులో రూ. 10లక్షలు చెల్లించామని మరో ఆరు లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు.

## కౌలు రైతుల యూరియా తిప్పలు!

- యాప్‌తో రైతులకు తీవ్ర ఇబ్బందులు
- ఒక బుకింగ్‌కు 2 బస్తాల నిబంధనలతో ఇక్కట్లు
- ప్రభుత్వం స్పందించాలని రైతన్నల వేడుకోలు




**–ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాల ప్రభుత్వ పథకాలు అందక సతమతమవుతున్న వీరిపై ఇప్పుడు యూరియా పిడుగు పడింది. ప్రభుత్వ నిబంధనలు, సాంకేతిక సమస్యల కారణంగా కౌలు రైతులు బ్లాక్ మార్కెట్ నుంచి యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. పట్టాదారు పాస్‌బుక్ ఉంటేనే యూరియా ఇస్తామని అధికారులు స్పష్టం చేయడంతో బయటి నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. విచ్చలవిడి యూరియా వినియోగాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నూతన నిబంధనలు సాధారణ రైతులతో పాటు కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కేంద్ర ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫార్మర్స్ రిజిస్ట్రీలో కౌలు రైతులను విస్మరించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌లోనూ పట్టా రైతు మొబైల్ లింక్ వచ్చే ఓటీపీని కంపల్సరీ చేశారు. అంతేకాకుండా ఒక బస్తా తీసుకున్నాక మరొక బస్తా ఇవ్వాలంటే కనీస కాల వ్యవధి 15 రోజులు అనే నిబంధన పెట్టారు. దీంతో కౌలు రైతులు ఓటీపీ కోసం పట్టాదారు రైతులను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు బస్తాల సీలింగ్ ప్రకారమే రైతులకు వచ్చే కోటా యూరియాను సీజన్ మొత్తానికి ఒకే సారి బుకింగ్ చేసుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. యూరియా యాప్‌ని రద్దు చేసి గతంలో లాగ యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అవసరమైన మేర అందించాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు ఇచ్చే రైతు భరోసాను అందించాలని, కౌలు రైతులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులను ఇచ్చి, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**రైతులకు పాత పద్ధతిలో పంపిణీ చేయాలి: సిపిఐ మండల కార్యదర్శి తోగటి కుమార్**

రైతులకు పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ అన్నారు. స్మార్ట్ ఫోన్‌లతో రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని, రైతులందరూ స్మార్ట్ ఫోన్లు వాడరని , వారు బుకింగ్ చేసుకోలేరని తెలిపారు. పాత పద్ధతిలోనే పిఎసిఎస్ సొసైటీలు, ఎరువుల దుకాణాల ద్వారా యధావిధిగా యూరియాను సరఫరా చేయాలని, ప్రభుత్వం సీజన్‌కు కావాల్సిన యూరియాను ముందే స్టాక్ పెట్టుకోవాలన్నారు. యూరియా సరఫరాను పాత పద్ధతిలో యధావిధిగా అందించాలని, లేదంటే ఆందోళనలు తప్పవని డిమాండ్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బోనకల్ మండలం ఆళ్లపాడుకు చెందిన ఎం.శ్రీను గతంలో తనకు దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌కు చెందిన ఎస్‌కె నాజియా తన కుమార్తెకు తలసేమియా వ్యాధి ఉందని సదరం సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం హిమామ్ నగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణను తొలగించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం కేశావాపురంకు చెందిన చాగంటి శ్రీదేవి సర్వే నెం. 591/1/2లో రెండు ఎకరాల భూమి ఉందని దానిని సాగు చేసుకోనివ్వకుండా అక్రమంగా అడ్డుకోవడం జరుగుతుందని ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని దానిని పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు.


## నూతన పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులు పరిశీలించిన ఎస్‌పి

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ నవభారత్ సమీపంలో నిర్మాణంలో గల నూతన పోలీస్ కార్యాలయ భవన నిర్మాణ పనులను జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాటు అధికారుల కు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, బి. శ్రీనివాస్, రోడ్లు, భవ నాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాపక్షం/ధర్మ సాగర్ : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాల అమలు జరుగాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి సంబంధించిన 26మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 26లక్షల 03వేల 016రూపాయల విలువగల చెక్కులను అలాగే 39మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 14లక్షల 25వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు పంపిణీ చేశారు.ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన భూక్య వసంత అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 2లక్షల 50వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే ముప్పారం గ్రామంలో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి మంజూరు పత్రాన్ని స్థానిక సర్పంచ్ కి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి పథకం ఒక గొప్ప పథకం అని అన్నారు. పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం కొంత ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇంట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలి అంటే తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక లక్ష 116 రూపాయలు ఎంతో భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు సంక్షేమానికి, మహిళా సంక్షేమం పైన ప్రత్యేకించి పేద వర్గాల సంక్షేమం పైన దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతీ ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా పేద వర్గాలకు సన్నబియ్యాన్ని పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి



సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పైన అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేద వర్గాల సంక్షేమనికి, సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు పెళ్లి జరిగిన వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న 3 నెలలలో ప్రాసెస్ పూర్తి అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గాని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల విషయంలో గాని, సీఎంఆర్ఎఫ్ విషయంలో గానీ, ఇతర ప్రభుత్వ పథకాల విషయంలో గాని ఎవరు కూడా ఒక్క రూపాయి వేరే వారికి ఇవ్వవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. మీకు రావలసిన ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే వస్తాయని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిజాయితీగా పని చేయాలని సూచించారు. నిజాయితీగా లేని అధికారులను నేను సహించనని హెచ్చరించారు. ఏ ప్రభుత్వ పథకం అయిన ప్రభుత్వ పథకం అయిన అర్హులైన నిరుపేద ప్రజలకే అందాలని ఆ దిశగా మన తీరు ఉండాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దు

పులి జాడ కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి

గూడూరు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు



ప్రజాపక్షం/గూడూరు: వరంగల్ జిల్లా నర్సంపేట అటవీ డివిజన్ పరిధిలోని ఖానాపురం ప్రాంతంలో పులి సంచారం ఉన్నట్లు సమాచారం అందుకొని ఆనుకొని ఉన్న మహబూబాబాద్ జిల్లా గూడూరు రేంజ్ పరిధిలోని అటవీ శాఖ అప్రమత్తమైంది. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని గూడూరు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పులి సమాచారం వాస్తు తెలిసిన వెంటనే గూడూరు రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.రెండు ప్రత్యేక అటవీ సిబ్బంది బృందాలు గ్రామాల పరిసర ప్రాంతాలు అటవీ మార్గాల్లో నిరంతరం గస్తీనిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు.అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా ఉదయం సాయంత్రం వేళల్లో ఒంటరిగా అడవిలోకి వెళ్లరాదని సూచించారు.పశువులను మేపేదుకు వెళ్లే వారు గుంపులుగా వెళ్లాలని చీకటి పడకముందే ఇంటికి తిరిగి చేరుకోవాలని కోరారు.ఎక్కడైనా పులి అడుగుజాడలు గాండ్రింపు శబ్దాలు లేదా అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే సమీప అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పులికి ఎలాంటి హాని తల పెట్టరాదని ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు. గూడూరు పాఖాల కొత్తగూడ పరిసర అటవీ గ్రామాల ప్రజలు చిన్నారులను ఒంటరిగా అటవి అంచులకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసర పరిస్థితుల్లో వెవటనే అటవీ శాఖను సంప్రదించాలని రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు పిలుపునిచ్చారు.ప్రజల సహకారంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి: కలెక్టర్



ప్రజాపక్షం/భూపాలపల్లి : వన మహోత్సవంలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యం మేర మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వన మహోత్సవంపై అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం జిల్లాలో నిర్వహించనున్న వన మహోత్సవంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శాఖల వారిగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 25.269 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, వివరాలను అటవీశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు వీలుగా మున్సిపల్ మరియు గ్రామ పంచాయతీల వారీగా ఖాళీ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, జెన్కో, ఏఎంఆర్ సంస్థలు కూడా ఈ వన మహోత్సవ కార్యక్రమాల్లో భాగస్వామ్యమై మొక్కలు నాటాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ పరిస్థితులపై అవగాహన ఉన్న వారినే పరిగణనలోకి తీసుకోండి



ప్రజాపక్షం/వరంగల్ : తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎస్.సురేందర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌తో భేటీ అయ్యారు.హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల విషయంలో కేవలం తెలంగాణ ప్రాంతానికి చెందిన, తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ప్రాంతీయ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన కలిగిన న్యాయవాదుల పేర్లనే పరిగణనలోకి తీసుకోవాలని సంఘం ఇటీవల ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని గవర్నర్‌కు వివరించారు. సామాజిక న్యాయ సూత్రాలకు అనుగుణంగా, సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయ వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వినతి పత్రం సమర్పించి, తమ సంఘం లేవనెత్తిన న్యాయబద్ధమైన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి,వాటి అమలుకు సంబంధిత యంత్రాంగంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా హైకోర్టు న్యాయమూర్తి పదవుల భర్తీలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు స్థానికతను తప్పుగా చూపుతూ అవకాశాలను దక్కించుకుంటున్నారని, దీనివల్ల తెలంగాణకు చెందిన అర్హులైన, ప్రతిభావంతులైన న్యాయవాదులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సంఘం ప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రధాన అంశంపై 15న నిర్వహించిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో సర్వసభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశామని, దానిలో భాగంగానే 17న హైకోర్టు ప్రాంగణంలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించామని వారు గవర్నర్‌కు తెలిపారు. తమ న్యాయబద్ధమైన ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలపాలని, తెలంగాణ న్యాయవాదుల ప్రయోజనాలను పరిరక్షించేలా సంబంధిత రాజ్యాంగ సంస్థలపై తగిన ఒత్తిడి తీసుకురావాలని వారు గవర్నర్‌ను కోరారు.ఈ భేటీలో సంఘ అధ్యక్షులు ఎస్.సురేందర్ రెడ్డి,ఉపాధ్యక్షులు డి.ఎల్.పాండు,కార్యదర్శులు పి.శ్రవణ్ కుమార్ గౌడ్,నిరంజన్ రెడ్డి కె.జాయింట్ సెక్రటరీ కుమారి,పి.కృష్ణ కీర్తన, పాల్గొన్నారు.

## జిడబ్ల్యూఎంసి నూతన కమిషనర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. వెంకన్న సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను హన్మకొండ కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవల అందజేత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై వారు చర్చించారు.అంతకు ముందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యాలయంలో నూతన కమిషనర్ గా వెంకన్న ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు చారిత్రత్మక శ్రీ భద్రకాళీ మాతను దర్శించుకొన్నారు. నూతన కమీషనర్ రాకతో మునిసిపల్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

## భారీ వర్షాలకు ముందస్తు సన్నద్ధత

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు: కలెక్టర్



ప్రజాపక్షం/ములుగు: వర్షాకాలంలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి విపత్తు నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలను ముందుగానే గుర్తించి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లోతట్టు ప్రాతాలు, లో లెవెల్ కల్వర్టులు, గోదావరి పరివాహక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, పారిశుధ్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. డిడిఆర్ఎఫ్ బృందాలను మేడారం, ఏటూరునాగారం ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచడంతో పాటు పడవలు, లైఫ్ జాకెట్లు, నైలాన్ తాళ్లు, తదితర సహాయక సామాగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.

## 'సర్' గ్రడువును మరో 6 నెలలు పొడిగించాలి

కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం జిల్లా కమిటీల డిమాండ్




హనుమకొండ: ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరో 6 నెలలు పొడిగించాలని సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ జిల్లా నాయకుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కూడా ఛైర్మెన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన గడువును పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసారు.జిల్లాలో అనేక మంది ఓటర్లు ఇప్పటికీ తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం పొందలేదని, గ్రామీణ ప్రాంతాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రజలకు తగిన సమాచారం అందకపోవడం, దరఖాస్తుల స్వీకరణలో జాప్యం, సాంకేతిక సమస్యలు, బూత్ స్థాయిలో సమస్యల కారణాల వల్ల అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని, ఎలాంటి అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తొలగిపోకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని, మరో 6 నెలల కాలం పొడిగించి ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేసింది.దేశవ్యాపితంగా జరిగిన ఎస్ఐఆర్ లో బీహార్, బెంగాల్ అర్హులైన ఓటర్లను తొలగించిన విషయం తెలిసిందే. ఆ పరిస్థితిని తెలంగాణాలో రాకుండా చూడాలని వారు కోరారు. ఓటర్ల హక్కులను పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత అని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు. గడువు పొడిగింపుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి బాష్ మియా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా నాయకులు అశోక్ స్టాలిన్, ఎం.చుక్కయ్య,వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు వి.దుర్గయ్య, గౌడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల సమస్యలను భట్టి విక్రమార్కతో మాట్లాడతా




ప్రజాపక్షం/భూపాలపల్లి: సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నెర వేర్చేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. భూపాలపల్లి జిఎం కార్యాల యం ఎదుట సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో సోమవారం ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అధికారుల న్యాయమైన డిమాండ్లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగ తిన పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా, పే అప్గ్రేడేషన్, మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీ ఆర్ పీ) బకాయిల చెల్లింపు, అధికారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి అధికారులు తొలిసారిగా సంస్థ వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సింగరేణి అధి కారులు ఎండీ నజీర్, సమ్మిరెడ్డి, అలీమ్, విక్రమ్, ప్రసాద్, సుస్మిత, మౌనిక, షైనీ, కొమురయ్య, శ్రీనివాస్, శ్రీను, సహదేవ్, పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు ప్రభుత్వమే పంచాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బి.విజయ సారధి

5,6,7 తేదీల్లో తొర్రూర్‌లో సిపిఐ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు



ప్రజాపక్షం/మహబూబాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం నేడు జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబ లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ జూలై 1న నిరుపేదల ఇంటి స్థలాల సాధనకై ఇంటి పట్టాల కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో వేలాదిమంది ఇండ్లు లేని నిరుపేదలు ఇంటికిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని వారికి ఇంటి స్థలాలు ప్రభుత్వమే పంచాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఇటీవల నిరుపేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ మున్సిపల్ పోలీసులు అక్రమంగా తెల్లవారుజామున కూలగొట్టి పేదవారిని నిరాశ్రయులుగా చేశారని, నేతలపై అక్రమంగా కేసులు పెట్టారన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఇల్లు లేని నిరుపేదల కోసం ఉద్యమిస్తుంది ఆయన అన్నారు. ఇటీవల హన్మకొండ గుండ్ల సింగారంలో వేలాదిమంది గుడిసెలు వేసుకుంటే అర్ధరాత్రి వచ్చి కూలగొట్టారని వీటన్నిటిని నిరసిస్తూ జూలై 1న వందలాది మందితో కలెక్టరేట్ ముట్టడి చేస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా కేంద్రంలో వందలాది ఎకరాల భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయని, కొంతమంది పెద్దలు కబ్జా చేస్తుంటే అధికారులు ప్రజాప్రతినిధుల కళ్ళు మూసుకుపోయాయి ఆరోపించారు. పేదలు జానెడు గుడిసెలు వేసుకుంటే కూల్చేస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తొర్రూర్ లో జులై 5 6 7న సిపిఐ మహబూబాబాద్ జిల్లా రాజకీయ సైతాంతిక శిక్షణా తరగతులు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు శిక్షణా తరగతులలో పాల్గొనాలని విజయసారధి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కట్లోజు పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

## సీల్ వేసిన పుస్తకాల గదిని ఎలా ఓపెన్ చేస్తారు?

ఎకశిలా విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/మహబూబాబాద్: అధికారులు సీజ్ చేసిన పుస్తకాల గదిని నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ చేసిన ఏకశిలా విద్యా సంస్థల యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధుల బృందం సోమవారం క్షేత్ర స్థాయి పరిశీలనలు (తనిఖీలు) నిర్వహించింది.అనంతరం ఏకశిల పాఠశాల ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రవణ్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు సీల్ వేసిన పుస్తకాల గదిని ఏకశిలా విద్యా సంస్థల యాజమాన్యం ఎలా ఓపెన్ చేస్తుందని నిలదీశారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు కళ్ళు అప్పగించి ఏం చేస్తున్నారని, వారి నిర్లక్ష్యం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. మరల ఈ రోజు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల గదిని ఎంఇఓతో సీల్ వేయించడం జరిగింది. మహబూబాబాద్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకొని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశాయి. జిల్లా కలెక్టర్ గారు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీని అరికట్టేందుకు ఒక ప్రత్యేక ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్కూళ్లలోనే విచ్చలవిడిగా సాగుతున్న పుస్తకాల, యూనిఫామ్‌ల వ్యాపారాన్ని అరికట్టేందుకు ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై తక్షణమే తనిఖీలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, అధికారులు వేసిన సీళ్లను బేఖాతరు చేసిన ఏకశిల విద్యా సంస్థల లైసెన్సులను రద్దు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వెలుగు శ్రావణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, పట్టణ కార్యదర్శి చెలువురి వికాస్, రాంబాబు, సాయి , చరణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు

ప్రజాపక్షం/పర్వతగిరి : పర్వతగిరి మండలం జమలాపురం గ్రామంలో 20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి, 10లక్షలతో మహిళ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించడంతో చాలా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని... కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నమన్నారు.అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపైలో గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు.ఇంటింటా తిరుగుతూ ఓటర్ల జాబితాను పరిశీలించారు.ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ లు ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచే ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జున్ను కనకయ్య,వరంగల్ జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ అయూబ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు,మాజీ జడ్పీటీసీ సింగులాల్,సీనియర్ నాయకులు అనిల్ రావు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం/జనగామ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమగ్ర అభివృద్ధికి దోహదపడిందని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, కాలేజియేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంలతో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, కాలేజియేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి వివరించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణ ద్వారా ప్రజల సమస్యలను గుర్తించడమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన పది ఇతివృత్తాల (థీమ్స్) మేరకు అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాయని చెప్పారు.ఈ ఆఫీస్ ద్వారా 10,000 ఫైళ్లను పరిష్కరించడం జరిగిందని, ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు, దాదాపు 500కి పైగా హెల్త్ క్యాంపుల నిర్వహణ, ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా యంత్రంగం కృషి చేస్తుందని, ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం, వంద శాతం ఈ ఆఫీస్ నిర్వహణ, అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని వివరణ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత భూపాలపల్లిగా మార్చడమే లక్ష్యం: కలెక్టర్

ప్రజాపక్షం/భూపాలపల్లి : డ్రగ్స్ రహిత భూపాలపల్లిగా మార్చడమే అందరి లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణం నుండి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు నషా ముక్త్ భారత్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటైతే వారి ఉజ్వలమైన జీవితాలు పూర్తిగా నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, శారీరక, మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో విరివిగా పాల్గొనాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం అత్యంత పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మన జిల్లాలోకి మాదక ద్రవ్యాలు రవాణా జరుగకుండా లాటిష్ఠ నియంత్రణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మల్లీశ్వరి, కిరణ్, కొమురయ్య, రాధిక, రాజ సమ్మయ్య, ఎస్సై రబ్బాని, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో భారీ చోరీ..
### కిలో బంగారం అపహరణ

ప్రజాపక్షం/ సిద్దిపేట/ దుబ్బాక : సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఒక ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారాన్ని అపహరించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చింత రాజేశ్‌కుమార్ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు 9 రోజుల క్రితంవెళ్లారు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి కిటికీ ఊచలు పగుల గొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు.పడక గదిలో ఉన్న లాకర్‌ను పగుల గొట్టి అందులో ఉన్న బంగారం ,నగదు ఎత్తుకెళ్లారు. అపహరించిన బంగారం కిలోవరకు ఉంటుందని సమాచారం. సోమవారం ఉదయం ఇంటి ఆవరణలో పరిశుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి మంజుల ఇంటి తాళం పగుల గొట్టడం చూసి యజమానికి సమాచారం అందించింది. దీంతోవారు పోలీసుకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన ఇంటికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీపేరుమాల్ ,ఏసిపి రవీందర్‌రెడ్డి సందర్శించారు. క్లూస్ టీంతో తనిఖీలు చేపట్టారు. దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు. తన సిబ్బందితో అక్కడకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు.పోలీసులు అన్ని కోణాలతో దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకే ‘ గ్రీవెన్స్ డే’



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగిత్యాలజిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ పేర్కొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పిఅశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు.జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా,పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ఉన్నారు.

## అరుణ్‌కుమార్‌పై నమోదైన కేసును ఖండిస్తున్నాం: బిఆర్‌ఎస్ నాయకులు




ప్రజాపక్షం /మెట్‌పల్లి: మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం బిఆర్‌ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం 7వ వార్డులో డ్రైనేజీ సమస్యకు సంబంధించి జరిగిన ఘటనలో ధ్యావరశెట్టి అరుణ్‌కుమార్‌పై పాత కక్షలతో ఉద్దేశపూర్వకంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. వార్డు కౌన్సిలర్ భర్త, మున్సిపల్ చైర్మన్ కుమారుడు, వారి అనుచరులు 13వ వార్డు కౌన్సిలర్‌ను కూడా వెంట తీసుకెళ్లి అక్కడ వివాదం సృష్టించి, అనంతరం అరుణ్‌కుమార్‌పై ఎస్‌సి,ఎస్‌టి చట్టం కింద కేసు నమోదు చేయించారని పేర్కొన్నారు.ఈ చర్యలను బిఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రాజకీయ కక్షసాధింపులో భాగంగా ఇటువంటి కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని అన్నారు. బాధితులకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ బంగారుకళ్ల కిషోర్, పూదారి సుధాకర్ గౌడ్,ఎండిజావిద్, ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థినికి నటరాజ నందీశ్వర అవార్డు




ప్రజాపక్షం /కొత్తపల్లి :విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొని విజయం సాధించే దిశగా ప్రోత్సహించాలని తద్వారా వారికి సమాజంలో త గిన గుర్తింపు వస్తుందని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలో ని ఆల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ అవార్డు రావడం పట్ల సం తోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళల పట్ల నైపు ణ్యం చాలా అవసరమని చెప్పారు. ఇటీవల కా లంలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ అయిన నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ రవీంద్రభారతిలో నిర్వహించిన కా ర్యక్రమంలో పాఠశాలలకు చెందిన జె.అదిత్రిరావు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నందీశ్వర అవార్డును గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదిరెడ్డి భాస్కర్ రావు 35 వర్ధంతి



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరే ణి కాలరీస్ వర్కర్స్ యూనియ న్ ఎఐటియుసి మాజీ ఉప ప్ర ధాన కార్యదర్శి అమర జీవి కా మ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు 35 వర్ధంతి సందర్భంగా జూన్ 30న సాయంత్రం 4 గంటలకు గోదావరిఖని జి.ఎం.ఆర్జీ వన్ ఆఫీస్ జంక్షన్ వద్ద ఉన్న భా స్కర్ రావు వి గ్రహం వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పి ం చి తద నంతరం గోదావరిఖని భాస్కర్ రావు భవ న్‌లో జరిగే స్మారక సభలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు, కార్యకర్త లు, సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటనలో కోరారు.

# మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
### జగిత్యాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంక్షేమ శాఖ మంత్రి, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పి



ప్రజాపక్షం/జగిత్యాల : మత్తు రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు ,ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన నషా ముక్త భారత్ కార్యక్రమాన్ని రాష్ట్ర దివ్యాంగులు,వయోవృద్ధులు ,ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని,వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.జిల్లాలోని విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు.మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సం క్షేమ శాఖ అధికారి భాస్కర్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,కళాశాలల అధ్యాపకులు,విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హెచ్చరిక



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నో ప్రాఫిట్ నో లాస్ అనే విధంగా పాఠ్యపుస్తకాలను విక్రయించాల్సి ఉండగా 20% పెట్టుబడితో 100% లాభాలకు కార్పొరేట్ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు డిస్ట్రిబ్యూటర్స్ తో పర్సంటేజ్ మాట్లాడుకొని కోట్లాది రూపాయలను తల్లిదండ్రుల నుండి దోపిడీ చేస్తున్నారని,నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాంస్ కూడా విక్రయిస్తున్నారని ఆయన అన్నారు. జిఎస్‌టిఅనుమతులు ఉంటే చాలు ఎంతైనా దోచుకోవచ్చనే నెపంతో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన వారే విద్యా వ్యాపారం చేస్తున్నారని, అసలు విద్యార్థులకు ఏం సందేశం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను యూనిఫామ్స్ విక్రయిస్తున్న పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని, స్పందించని విద్యాధికారుల మీద కూడా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఇంకా ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్నకొండ సాయి ఆజాద్,తడిగొప్పుల అనుప్ సాయి,ఆరే జశ్వంత్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు

### ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం / హుస్నాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకోవాలని మీ ఇంటికి వచ్చె అధికారుల జాబితలో మీ ఓటు ఉందోలేదో చూసుకోవాలని అలాగే అధికారులు నూతన ఓటర్ల నమోదుకు తగినన్ని ఫారంలు అందుబాటులో ఉంచాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్‌ఆదేశించారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పోతారం గ్రామంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2002లో ఓటరు సవరణ ప్రక్రీయ మళ్లి ఇప్పుడు జరుగుతుందని అర్హత ఉన్న ప్రతి ఓటు కూడ గల్లంతు కాకుండ ప్రభుత్వ అధికారులు చూసుకునే వారు. నేడు అందుకు భిన్నంగా ఓటరు స్వయంగా తమ ఓటును చూసుకొవాలని ఓటర్లకు సూచించారు.హుస్నాబాద్‌లో 2.50వేల ఓట్లు ఉండగా అందులో 61 వేల ఓట్లు తటస్థంగా ఉన్నాయని పేర్కొన్నారు. మీ ఓటు లో ఏమైన ఓట్లు తేడా ఉంటే మీ సర్పంచ్‌కు గాని సంబంధిత అధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణి, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నరాజు, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బంక చందు, సర్పంచ్‌పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో 10లక్షలతో నిర్మించిన హమాలీ సంఘం నూతన భవనంను ప్రారంభించారు.అలాగే గత మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ కుటుంబాన్ని పరమార్శించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్‌మెన్ దండి లక్ష్మి, వైస్ చెర్మెన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు హమాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఒఎ అధికారుల నిరాహార దీక్షకు మద్దతు

### ఎఐటియుసి నాయకుల ప్రకటన



ప్రజాపక్షం/రామగిరి: సోమవారం ఆర్జీ3 జిఎం ఆఫీస్ వద్ద అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపిన ఎఐటియుసి నాయకులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరి మి.రాజకుమార్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వెంటనే ఉద్యోగులకు రావలసిన పిఆర్పి అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఉద్యోగులకు యూనియన్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలోడిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై వి రావు ,సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచేందర్ , వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి , అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డిటి రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎల్పి పిట్ సెక్రెటరీ గంగాధర్ వైసిపి 2 పిట్ సెక్రటరీ సురేష్ గారు, ఓసిపి 1అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మల్లేష్ ,నక్క రమేష్ , సి హెచ్ పి పిట్ సెక్రెటరీ గంధం శ్రీనివాస్,ఎస్ఎన్ పిసి కొమురయ్య ,సేఫ్టీ కమిటీ మెంబర్ రాజు,మీ డియా ఇన్‌చార్జ్ పరిపూర్ణ చారి, ఆర్గనైజ్ సెక్రటరీ రంజిత్ పాల్గొని వారి రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు.


## దళారులను నివారించడానికే యూరియా యాప్



ప్రజాపక్షం / గంగాధర : తెలంగాణ రాష్ట్రంలో దళారీ వ్యవస్థను నివారించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం యూరియా యాప్‌ను తీసుకొచ్చిందని చొప్పదండి నియోజకవర్గంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని గంగాధర మండలం సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్‌లు అన్నారు. సోమవారం గంగాధరలోని ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూరియా యాప్ పని చేయడం లేదని యూరియా స్టాక్ లేదని రైతులు ఇబ్బంది పడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్‌ఎస్ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. వారు వస్తే వారికి యూరియా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 95 శాతం ఇండ్లలో స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని మారుతున్న కాలానికి అనుగుణంగారైతులు కూడా అప్‌డేట్ అవుతున్నారని యాప్‌లో పేర్లను నమోదు చేసుకొని సకాలంలో యూరియా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 4 మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మ హేందర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కొమ్మనబోయిన సువిన్ యా దవ్, గోగురి నాగభూషణం రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ముద్దం నగేశ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా కార్యదర్శి బైరి సంపత్, రాచమల్ల భాస్కర్, మాజీ జెడ్‌పిటిసి సత్తు కనుకయ్య, గుజ్జుల బాపురెడ్డి, గుడి ప్రవీణ్ రెడ్డి, మేర్జ కొ ండయ్య, నక్క అనిల్ మల్లయ్య, ఆదిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధికి సర్పంచ్‌లు తోడ్పడాలి

### జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



ప్రజాపక్షం/రాయికల్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సోమవారంరాయికల్ మండల వడ్డే లింగాపూర్ సర్పంచ్ బండారి మానస సాయి, రామారావు పల్లె సర్పంచ్ కోటే రాజేందర్,కుర్మపల్లి సర్పంచ్ మ్యాకల మల్లేష్,వడ్డెర కాలని సర్పంచ్ బోదాసు చంద్ర శేఖర్ లు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అత్యధిక వరి మొక్కజొన్న కొనుగోలు చేసి రైతుల పక్షాన అండగా నిలిచిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.శాంతి యుతంగా కలిసి ఉండి,ప్రజా సేవే లక్ష్యం గా అందరం కలసి పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరడం రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న పనులను నిదర్శనం అన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేయటం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అని అన్నారు.జగిత్యాలకు అత్యధిక 14పల్లె దవాఖాన లు మంజూరయ్యాయన్నారు.రాయికల్ మండలం లో నూతనంగా మంజూరైన అంగన్వాడీ భవనాలు త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికఆహారం ,యూనిఫామ్, నాణ్యమైన బోధన అందిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మెన్ దినేష్,టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,రవీందర్ రావు,ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,సమిండ్ల శ్రీనివాస్,సర్పంచ్ ప్రసాద్,బాల ముకుందం,నక్కల రవీందర్ రెడ్డి,ముకేష్,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## 100 శాతం పల్స్ పోలియో పూర్తి



ప్రజాపక్షం/కరీంనగర్: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసి, నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని, చుక్కలు తప్పిపోయిన వారిని రెండు రోజుల్లో గుర్తించి చుక్కల మందు వేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు.చిగురు మామిడి మండల కేంద్రంలో ఐదేళ్ల లోపు వయసు గల పిల్లలు ఉన్న ఓ ఇంటిని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సందర్శించారు.ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియోలో పోలియో చుక్కలు వేయించారా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ, ఎఎన్ఎంలతో పల్స్ పోలియో గురించి ఆరా తీశారు. గ్రామంలో ఐదేళ్ల లోపు ఉన్న పిల్లల సంఖ్య, పోలియో చుక్కలు వేసుకున్న వారి శాతం తదితర వివరాలు అడిగారు. సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటిని సందర్శించి పోలియో చుక్కలు వేయని పిల్లలను గుర్తించాలని, వారికి తప్పక చుక్కల మందు వేయాలని ఆదేశించారు. నూరు శాతం ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చుక్కల మందు తీసుకొని వారు ఒక్కరు కూడా ఉండరాదని అన్నారు.

### ఎస్ఐఆర్ వేగవంతంగా పూర్తి చేయాలి..

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో బిఎల్ఒలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ఓ లకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎంతమంది ఓటర్లను మ్యాపింగ్ చేశారని, ఆన్‌లైన్ ప్రక్రియ ఎలా సాగుతోందని ఆరా తీశారు. ఎస్ఐఆర్ పై ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ ముందుకు సాగితే ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఓటర్లతోనూ మాట్లాడారు. ఓటర్లు బిఎల్ఓ కు సహకరించాలని కోరారు. సూపర్వైజర్లు, బిఎల్ఓ లు సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట సర్పంచ్ భవాని, ఎఎన్ఎం లక్ష్మి , గ్రామ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

## ప్రతీ ఒక్కరు ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేయాలి

### కలెక్టర్ హైమావతి




ప్రజాపక్షం/ సిద్దిపేట : ఓటరు జాబితాలో పేరు ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేసి అధికారులకు అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ప్రతి ఇఆర్ఓ ఎఇఆర్ఓ క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యాటిస్తూ పనులను పర్యావేక్షించి ప్రతీ ఎన్యూమరేషన్ ఫారంపై సంబంధిత ఓటర్ల సంతకం ఉండే లా బూత్ స్థాయి అధికారులు నిర్ధారించేలా చర్య లు తీసుకోవటం జరుగుతుందన్నారు. సోమవార ం వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కలెక్టర్ మాట్లాడారు. విధుల సమయంలో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలన్నారు. కొత్తగా నియామితులైన బూత్ స్థాయి అ ధికారులకు సంబంధిత ఇఆర్ఓలు వెంటనే గు ర్తింపు కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్. జిలా రెవెన్యూ అధికారి నాగరాజ మ్మ,డిప్యూటికలెక్టర్లు,ఇఆర్ఒలు (ఆర్‌డిఒలు) ఎఇఆర్ఒలఎన్నికల విభాగం అధికారులు,పాల్గొన్నారు .

## 24 గంటల్లో హత్య కేసు చేధింపు



ప్రజాపక్షం /జమ్మికుంట: రెండు రోజుల క్రితం సంచలనంగా మారిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లో చేధించారు. నిందితుడిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్, రక్తపు మరకలున్న దుస్తులు, సెల్‌ఫోన్, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. హుజురాబాద్ఏసిపి మాధవి జమ్మికుంట ఎస్సై సి.రామకృష్ణ గౌడ్‌తో కలిసి నిందితున్ని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. సోమవారం పోలీసులు మడిపెల్లి గ్రామంలో నిందితుడైన గంగారపు మహేశ్‌ను తన ఇంటివద్ద అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరం ఒప్పుకొన్నట్లు ఆమె తెలిపారు. తన వ్యవసాయ భూమి సమీపంలో కౌలుకు వ్యవసాయం చేస్తున్న ఓ వివాహిత మహిళతో తనకు సన్నిహిత పరిచయం ఏర్పడిందని ఇదే సమయంలో మృతుడు పైతరి మొగిలి ఆ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడగా తాను ఆమెకు అండగా నిలిచి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. ఆ కేసులో మృతుడు జైలుకు వెళ్లి విడుదలైన అనంతరం తనను తరచూ అవమానిస్తూ దూషిస్తూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించేవాడని తెలిపినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ ఘటనలతో తన కుటుంబంలోనూ ఆ మహిళ కుటుంబంలోనూ తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయని ఈ కుటుంబ సమస్యలన్నింటికీ మృతుడే కారణమని భావించి అతనిపై కక్ష పెంచుకొని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడని ఇదే క్రమంలో 27న పీర్ల పండగ సందర్భంగా మడిపల్లి గ్రామానికి వచ్చిన మృతుడిని గమనించిన నిందితుడు ముందస్తుగా యూట్యూబ్లో హత్యలకు సంబంధించిన వీడియోలు, ఆయుధాల తయారీ విధానాలు తదితర అంశాలపై శోధించాడు. అనంతరం ఇంటి నుంచి ఒక ఇనుప రాడ్ తీసుకొని తన వ్యవసాయ భూమి వద్ద అంకుషాపూర్ వెళ్లే దారిలో ఉన్న మోరిపై కూర్చొని మద్యం సేవించాడు. రాత్రి సుమారు 11.45 గంటలకు మడిపల్లి గ్రామ శివారులో అంకుశాపూర్ వెళ్లే రోడ్డుపై సైకిల్‌పై వెళ్తున్న మృతుడిపై వెనుక నుంచి ఇనుప రాడ్‌తో తల వెనుక భాగంలో బలంగా దాడి చేయగా మృతుడు కిందపడిపోయాడు. అనంతరం అతని తల, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేసి మృతుడు చనిపోయినట్లు నిర్ధారించుకున్నాడు. తరువాత హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను మడిపల్లి గ్రామ శివారులోని ల్యాదోట తాళ్లలో ఉన్న తన వ్యవసాయ బావి పక్కన పడేసి న్నట్లు నిందితుడు అంగీకరించాడని ఏసిపి మా ధవి వివరించారు. నిందితుడు ధరించిన రక్తపు మ రకలున్న దుస్తులు, సెల్ ఫోన్, టూ వీలర్ స్వా ధీనం చేసుకొని నిందితునిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసిపి పేర్కొన్నారు.

# 8 మంది రాజ్యసభ్యుల ప్రమాణం

- ఎగువ సభలో మరోసారి ప్రతిపక్షనేతగా మల్లికార్జున ఖర్గే గుర్తింపు



న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ అధినేత మల్లికార్జున్ ఖర్గే, బిజెపి నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది సభ్యులతో రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాధాకృష్ణన్ ఛాంబర్‌లో మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఖర్గే, చుగ్ కాకుండా, మిగిలిన ఆరుగురు కొత్త సభ్యులలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. చైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సభానాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు. ఇక ఖర్గే చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణం చేశారు. రాధాకృష్ణన్ ఖర్గేను అభినందించారు. ఆయనకున్న సుదీర్ఘ అనుభవం ఎగువ సభకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కర్ణాటకకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖర్గే, ప్రభుత్వంపై జవాబుదారీతనాన్ని కోరడంతో పాటు, ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలు, గొంతుకను చిత్తశుద్ధి, దృఢ సంకల్పంతో వినిపిస్తూనే ఉంటానని, అది తన బాధ్యత అని అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. తనకు నిరంతరం మద్దతునిస్తున్నందుకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ లకు ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. 'భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సిపిపి చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీలోని నా సహచరులు, ఎంపిలకు, అలాగే నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవా ప్రస్థానంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహాన్ని అందించిన అసంఖ్యాక పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఖర్గే 'ఎక్స్‌లో పేర్కొన్నారు.

**రాజ్యసభలో మరోసారి ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గే**

రాజ్యసభకు తిరిగి ఎన్నికైన నేపథ్యంలో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం నాడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించారు. ఖర్గే జూన్ 25 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయన తిరిగి ఎన్నికైన తర్వాత, రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆయనను 26 నుండి ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించారు. ఈనెల 25వ తేదీన రాజ్యసభ సభ్యుడిగా ఆయన పదవీకాలం ముగియడంతో, మల్లికార్జున ఖర్గే 26 నుండి రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగలేదు. 'రాజ్యసభకు తిరిగి ఎన్నికైనందున, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుల జీతభత్యాల చట్టం, 1977 లోని సెక్షన్ 2 నిబంధనల ప్రకారం, ఆ చట్టం అన్ని ప్రయోజనాల కోసం, రాజ్యసభలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి) సభ్యుడు, నాయకుడైన మల్లికార్జున ఖర్గేను 26వ తేదీ నుంచి ప్రతిపక్ష నాయకుడిగా రాజ్యసభ చైర్మన్ గుర్తించినట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి. మోదీ ఒక ప్రకటనలో తెలిపారు.

## నిందితుల తరపున వాదిస్తే
# రూ. 5 లక్షలు జరిమానా

### అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం..

**అయోధ్య:** అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది. మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లోపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. అయితే ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సిబిఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.



## భారత సమాఖ్య వ్యవస్థపై మరో దాడి

విబి– జి రామ్ జి' వ్యయ విధానంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** కేంద్రం, రాష్ట్రాలు అనుసరించాల్సిన 'విబి– జి రామ్ జి' వ్యయ విధానంపై కాంగ్రెస్ సోమవారం తీవ్ర విమర్శలు చేసింది. సామర్థ్య ఆధారిత సూత్రం ద్వారా సమానత్వాన్ని సాధించాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన ఈ విధానం, ఇప్పటికే బలహీనంగా ఉన్న భారత సమాఖ్య వ్యవస్థ (ఫెడరలిజం)పై మరో 'దాడి' అని ఆ పార్టీ పేర్కొంది. ఎంజి నరేగా కేంద్ర ప్రభుత్వం కల్పించిన, డిమాండ్ ఆధారిత, హక్కుల ప్రాతిపదికన సాగే హామీ పథకం అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అదే 'విబి–జి రామ్ జి' కేటాయింపుల ఆధారిత పథకమని ఎద్దేవా చేశారు. అందులో 60 శాతం వ్యయాన్ని కేంద్రం, 40 శాతం వ్యయాన్ని రాష్ట్రాలు భరించాలని, రాష్ట్రాల మధ్య పన్నుల ఆదాయాన్ని పంపిణీ చేయడానికి 16వ ఆర్థిక సంఘం అనుసరించిన 'ప్రామాణిక కేటాయింపు సూత్రం' నే దీనికి కూడా వాడుతున్నారని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆర్థిక సంఘం సూత్రం అనేది ఆదాయాల పంపిణీకి ఉద్దేశించినదే తప్ప, వ్యయాలను భరించడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. 'ఆ బాధ్యత గ్రాంట్లది; కానీ వాటిలో చాలా వరకు 16వ ఆర్థిక సంఘం రద్దు చేసింది. సామర్థ్య సూత్రం ద్వారా సమానత్వాన్ని సాధించాలనుకోవడం మన సమాఖ్య వ్యవస్థ ఇప్పటికే బలహీనమైన నిర్మాణానికి మరో ముప్పు' రమేష్ అన్నారు. ఎంజి నరేగా స్థానంలో ప్రవేశపెట్టిన 'విబి– జి రామ్ జి' చట్టంపై అనేక రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయని పేర్కొన్న కాంగ్రెస్, ఈ కొత్త చట్టం కేవలం అధికార కేంద్రీకరణకు, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి మాత్రమే దారితీస్తుందని ఆదివారం వ్యాఖ్యానించింది.

# టెట్ లీకేజీపై అట్టుడికిన 'మహా' అసెంబ్లీ

- పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్ష సభ్యుల విమర్శ
- రాష్ట్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- ఉభయసభల్లోనూ విపక్షాల ఆందోళన



**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఉభయ సభలు సోమవారం అట్టుడికాయి. ఇటీవల టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్), ఇతర పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తింగా విఫలమైందని విమర్శిస్తూ అటు శాసనమండలిలో, ఇటు శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు విధాన్ భవన్ మెట్లపైకి ఎక్కి ప్రదర్శన చేశారు. ఆ తర్వాత సభ నుండి వాకౌట్ చేయడంతో సభలో నిరసనలు వెల్లువెత్తాయి. నానా పటోలేతో సహా సీనియర్ నాయకులు, టెట్, నీట్ లీకేజీల వెనుక ఉన్నవారికి బిజెపితో సంబంధం ఉందని ఆరోపించారు. పరీక్షల ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. టెట్ పేపర్ లీక్ ఆరోపణలపైనా, మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపిఎస్‌సి) పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్, శివసేన (యుబిటి) నాయకుడు అంబాదాస్ దాన్వే, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు జితేంద్ర అవ్హాద్‌ల నేతృత్వంలో ప్రతిపక్ష శాసనసభ్యులు విధాన భవన్ మెట్లపైకి ఎక్కి ప్రదర్శన చేశారు. పదేపదే జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీశాయని, లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయని కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు విజయ్ వడెట్టివార్ ఆరోపించారు. ఉదయం సభ సమావేశమైన వెంటనే, ప్రశ్నపత్రాల లీకుల అంశంపై చర్చించేందుకు సభా కార్యకలాపాలను నిలిపివేయాలని వడెట్టివార్ డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా లక్షలాది మంది అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నప్పటికీ, ప్రభుత్వం పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందని ఆయన ప్రశ్నించారు. టెట్ ప్రశ్నపత్రాల లీక్‌పై, ప్రశ్నపత్రాల తయారీలో పాలుపంచుకున్న ఏజెన్సీలు, పరీక్షల ప్రక్రియతో సంబంధం ఉన్న కంపెనీలు, ఈ ఆరోపిత రాకెట్ వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌తో సహా సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసినప్పటికీ, ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తులతో వారికి ఉన్న సంబంధాలు ఒక పెద్ద నెట్‌వర్క్‌ను సూచిస్తున్నాయని, దానిని తప్పక బయటపెట్టాలని ఆయన అన్నారు. 2018 టెట్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ, నిందితులలో ఒకరైన అభిషేక్ సవారికర్‌ను ఆ తర్వాత బిజెపిలో చేర్చుకున్నారని వడెట్టివార్ ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై వివరణాత్మక ప్రకటన చేస్తుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే తెలిపారు. అనంతరం, ఈ విషయంపై సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, తగినంత చర్చకు అవకాశం కల్పించలేదని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. సభా కార్యక్రమాలకు ముందు, ప్రతిపక్ష శాసనసభ్యులు విధాన భవన్ మెట్లపైకి ఎక్కి, పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే, ఆయన మాలేగావ్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని పరోక్షంగా ఉద్దేశిస్తూ నినాదాలు చేశారు.

**శాసనమండలిలోనూ తీవ్ర నిరసన**

మరోవైపు పేపర్ లీకేజీల అంశంపై శాసనమండలిలో కూడా ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ వ్యవహారంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలన్నారు. ప్రతిపక్షాల ఆందోళన కారణంగా సభను 30 నిమిషాల పాటు వాయిదా వేశారు. మండలిలో మాట్లాడిన భూసే, ఈ విషయంపై సభలో త్వరలోనే సమగ్ర ప్రకటన చేస్తామని తెలిపారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని, నాలుగుకు పైగా బృందాలు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నాయని ఆయన చెప్పారు. సభలో ఈ అంశాన్ని లేవనెత్తిన శివసేన (యుబిటి) సభ్యుడు అంబాదాస్ దాన్వే, ఇటీవల నీట్‌యుజి ప్రశ్నపత్రం లీక్ అయిన ఉదంతం కళ్లముందే ఉన్నప్పటికీ, టెట్ ఇతర పరీక్షల విషయంలో ప్రభుత్వం ఎందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రశ్నించారు. కోట్లాది రూపాయల అవకతవకలు జరుగుతున్నాయని, ప్రశ్నపత్రాల లీకేజీలు తరచుగా చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించలేనప్పుడు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాని దాన్వే అన్నారు. లోపాలు లేకుండా పరీక్షలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని కాంగ్రెస్ సభ్యుడు సతేజ్ పాటిల్ అన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు రాష్ట్రంలో కఠినమైన చట్టాలు లేకపోవడం వల్లే అవి సర్వసాధారణంగా మారాయని ఎన్‌సిపి (ఎస్‌పి) సభ్యుడు అరుణ్ లాడ్ విమర్శించారు.

## ప్రస్తుత టెన్త్ బ్యాచ్‌కు
# 'త్రిభాష' నుంచి మినహాయింపు

9వ తరగతి విద్యార్థులు రెండు విదేశీ భాషలను అభ్యసించవచ్చు: సిబిఎస్ఇ

**న్యూఢిల్లీ :** త్రిభాషా విధానం అమలుకు సంబంధించి సిబిఎస్ఇ సోమవారం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రస్తుత 10వ తరగతి విద్యార్థులకు మూడు భాషల అధ్యయనం నుండి మినహాయింపు ఇచ్చింది. 9వ తరగతి విద్యార్థులకు ఒకేసారి సడలింపుగా, ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులు మూడు భాషలను తప్పనిసరిగా చదవాలని, అయితే వారు రెండు విదేశీ భాషలు, ఒక భారతీయ భాషను అభ్యసించవచ్చని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) స్పష్టం చేసింది. జూలై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు కనీసం రెండు భారతీయ మాతృభాషలతో సహా మూడు భాషలను చదవడం తప్పనిసరి అని సిబిఎస్ఇ ప్రకటించిన నెల రోజుల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిబిఎస్ఇ ఉత్తర్వుకు వ్యతిరేకంగా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. 'ప్రస్తుత 10వ తరగతి బ్యాచ్ త్రిభాషా విధానాన్ని పాటించాల్సిన అవసరం లేదు. 7–9 తరగతుల ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులు 10వ తరగతికి వెళ్లినప్పుడు మూడవ భాషలో బోర్డు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు' అని సిబిఎస్ఇ అకడమిక్స్ డైరెక్టర్ ప్రజ్ఞా ఎం సింగ్ తెలిపారు. తాత్కాలిక సడలింపుగా, 2026–27 విద్యా సంవత్సరంలో ఇప్పటికే 9వ తరగతిలో ఉన్న విద్యార్థులు రెండు విదేశీ భాషలను కొనసాగించవచ్చని, మూడవ భాషగా ఒక భారతీయ భాషను చేర్చుకోవలసి ఉంటుందని ఆమె తెలిపారు. ఏప్రిల్‌లో సిబిఎస్ఇ 6వ తరగతి నుండి త్రిభాషా సూత్రాన్ని దశలవారీగా అమలు చేయనున్నట్లు, 2026–27 విద్యా సంవత్సరం నుండి 9వ తరగతికి గణితం, సైన్స్‌లో రెండుస్థాయిల విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం గణితం, సైన్స్‌లో రెండు స్థాయిలు.. తప్పనిసరి స్టాండర్డ్, ఐచ్ఛిక అడ్వాన్స్‌డ కోర్సులు ఉంటాయి. విద్యార్థులందరూ 80 మార్కులకు ఒకే ఉమ్మడి పరీక్షకు హాజరవుతారు, అయితే ఉన్నత నైపుణ్యాన్ని కోరుకునే వారు లోతైన భావనాత్మక అవగాహన, ఉన్నతస్థాయి ఆలోచనా నైపుణ్యాలను పరీక్షించే అదనపు అడ్వాన్స్‌డ్ స్థాయి పేపర్‌ను తీసుకోవచ్చని సిబిఎస్ఇ తెలిపింది. కొత్త రెండుస్థాయిల విధానం (స్టాండర్డ్, అడ్వాన్స్‌డ్ కింద మొదటి 10వ తరగతి బోర్డు పరీక్షను 2026–27 9వ తరగతి విద్యార్థుల కోసం 2028లో నిర్వహిస్తామని సిబిఎస్ఇ తెలిపింది. అయితే, మే 15న, విదేశీ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు స్థానిక భారతీయ భాషలను అభ్యసించిన తర్వాత మూడవ భాషగా లేదా అదనపు నాల్గవ భాషగా మాత్రమే దానిని ఎంచుకోవచ్చని బోర్డు ప్రకటించింది.

## ఆ చర్చలను
# పరిగణనలోకి తీసుకోం

కొందరు వ్యక్తిగత హోదాలో పాల్గొనడం పట్ల ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు : మిస్రీ



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ సంబంధాలపై విదేశాల్లో జరిగే చర్చల్లో పదవీ విరమణ చేసిన దౌత్యవేత్తలు, సైనిక అధికారులు తమ వ్యక్తిగత హోదాలో పాల్గొనడం పట్ల ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం స్పష్టం చేశారు. అటువంటి చర్చలను ప్రభుత్వం పరిగణనలోకి కూడా తీసుకోదన్నారు. గత వారం కొలంబోలో జరిగిన ప్రాంతీయ భద్రతా సదస్సు సందర్భంగా, భారత్, పాకిస్థాన్‌లకు చెందిన మాజీ సైనికాధికారులు, దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులతో కూడిన నిపుణులు 'ట్రాక్2' (అనధికారిక) చర్చల్లో పాల్గొన్నారన్న వార్తల నేపథ్యంలో సీషెల్స్‌లోని విక్టోరియాలో మీడియాతో మాట్లాడుతూ మిస్రీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వివిధ అంశాలపై ఇలాంటి కార్యక్రమాలు డజన్ల కొద్దీ జరుగుతుంటాయి. వీటిలో కొత్తదనం గానీ, ప్రత్యేకత గానీ ఏమీ లేదు' అని విదేశాంగ కార్యదర్శి అన్నారు. అవి ప్రైవేట్ వర్గాలు నిర్వహించే ప్రైవేట్ కార్యక్రమాలని, వాటిలో అధికారికమైన అంశం ఏదీ లేదన్నారు. మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ కార్యదర్శి ఈ విధంగా స్పందించారు. 'పాకిస్థాన్ ప్రభుత్వం తరపున నేను మాట్లాడలేను, కానీ భారత ప్రభుత్వం విషయానికొస్తే, ఈ పర్యటనలలో ఎటువంటి అధికారిక భాగస్వామ్యం, మద్దతు లేదా ప్రమేయం లేదు. కాబట్టి, ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భారతీయులు— వారు పదవీ విరమణ చేసిన దౌత్యవేత్తలు కావచ్చు, మాజీ సైనికాధికారులు కావచ్చు లేదా పౌర సమాజ సభ్యులు కావచ్చు— ఎవరైనా సరే, వారు తమ సొంత అభిప్రాయాలనే వ్యక్తం చేస్తారని స్పష్టంగా అర్థం చేసుకోవాలి' అని మిస్రీ అన్నారు.
భారతదేశం ఈ కార్యక్రమాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోదని విదేశాంగ కార్యదర్శి పేర్కొన్నారు. వారు ఏ విధంగానూ భారత ప్రభుత్వ అభిప్రాయాన్ని ప్రతిబింబించరని, ప్రతిబింబించలేరు కూడా అన్నారు.

## ఎన్నికల పారదర్శకతలో
# ప్రధాన ప్రజాస్వామ్య దేశాలకు భారత్ నాయకత్వం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్



**శ్రీనగర్ :** భారత ఎన్నికల విధానంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ చాలా గొప్పగా చెప్పుకున్నారు. ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆడిట్ చేసే పారదర్శక విధానంతో భారతదేశం ప్రపంచంలోని ప్రధాన ప్రజాస్వామ్య దేశాలకు నాయకత్వం వహిస్తోందన్నారు. 'ప్రపంచంలోనే అత్యంత పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియలోని అంశాలైన ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్, ఓట్ల లెక్కింపు గురించి మేము చర్చించాము. వీటిని అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఏకకాలంలో ఆడిట్ చేస్తారు' అని మూడు రోజుల కశ్మీర్ పర్యటనలో ఉన్న కుమార్ సోమవారం శ్రీనగర్‌లో విలేకరులకు వెల్లడించారు. అంతకుముందు, శ్రీనగర్‌కు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుద్గాం జిల్లాలో బూత్ స్థాయి అధికారుల (బిఎల్‌ఓ) సమావేశంలో కుమార్ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా సుస్థిర ప్రజాస్వామ్యానికి మద్దతు ఇచ్చే అంతరప్రభుత్వ సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఇంటర్నేషనల్ ఐడియా)కు భారతదేశం ప్రస్తుతం అధ్యక్షత వహిస్తోందని ఆయన అన్నారు. భారత ఎన్నికల ప్రక్రియను చూస్తే, 2026 నాటికి భారతదేశం ప్రపంచంలోని అన్ని పెద్ద ప్రజాస్వామ్య దేశాలకు నాయకత్వం వహిస్తూ, ఇంటర్నేషనల్ ఐడియాకు కూడా అధ్యక్షత వహిస్తోందని ఆయన అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ బిఎల్‌ఓలను ప్రజాస్వామ్య స్తంభాలుగా అభివర్ణించారు.

## మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం..
# 65 ఏళ్ల వృద్ధుడికి మరణశిక్ష



**పుణె :** మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన 65 ఏళ్ల వృద్ధుడికి కోర్టు మరణశిక్ష విధించింది. ఈ నేరం అత్యంత క్రూరమైనదని న్యాయమూర్తి అభివర్ణించారు. అందుకే అత్యంత అరుదైన తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 1న నస్రాపూర్ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. కాగా, 65 ఏళ్ల భీమ్‌రావ్ కాంబ్లే తినుబండారాల ఆశ చూపించి ఆ చిన్నారిని తీసుకెళ్లడం సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించింది. పసి దూడను చూపిస్తానని చెప్పిన వృద్ధుడు ఆ బాలికను పశువుల పాక సమీపంలోని షెడ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలిక నోరు మూసి, ఛాతిపై గాయం చేసి ఆమెను హత్య చేశాడు. చిన్నారి కోసం వెతకగా మృతదేహం అక్కడ లభించింది. మరోవైపు సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల సహాయంతో నిందితుడు భీమ్‌రావ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారిపై హత్యాచారం కేసు దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు పగలతో పాటు రాత్రులు కూడా పని చేశారు. 15 రోజుల్లో కీలక ఆధారాలు సేకరించారు. 55 మంది సాక్షుల వాంగ్మూలాలు రికార్డ్ చేశారు. 1,200 పేజీల వివరణాత్మక ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, పుణె జిల్లా, సెషన్స్ కోర్టులో ఈ కేసుపై రోజువారీ విచారణ జరిగింది. మూడేళ్ల బాలిక కిడ్నాప్, లైంగిక వేధింపులు, అత్యాచారం, హత్య ఆరోపణల్లో నిందితుడు భీమ్‌రావ్ కాంబ్లేను దోషిగా కోర్టు నిర్ధారించింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్న నిందితుడి తరపు న్యాయవాది అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఎలాంటి దయ లేదా ఉదారత చూపాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. మరోవైపు సుప్రీంకోర్టు నిర్వచించిన 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన' వర్గంలోకి ఈ నేరం వస్తుందని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాదులు కోర్టులో వాదించారు. మరణశిక్షపై సుప్రీంకోర్టు ఇచ్చిన 12 కీలక తీర్పులను ప్రస్తావించారు. దీంతో ప్రాసిక్యూషన్ వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ నేరంలోని క్రూరత్వానికి ఎలాంటి కనికారం చూపే ఆస్కారం లేదని న్యాయమూర్తి ఎస్.ఆర్. సలుంఖే వ్యాఖ్యానించారు. 'ఈ నేరం అత్యంత క్రూరమైనది. అరుదైన వాటిలో అత్యంత అరుదైనది. ఇది సమాజ అంతరాత్మనే కలచివేసేలా ఉన్నది. పసి బాలికపై తన కామ వాంఛ తీర్చుకునేందుకు నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడు' అని న్యాయమూర్తి అన్నారు. నేరం జరిగిన రెండు నెలల్లోపే దోషికి ఉరిశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

# 'సర్' కు వ్యతిరేకం కాదు

కాంగ్రెస్ అభ్యంతరాలకు సమాధానమివ్వండి
కర్నాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే



**బెంగళూరు :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే సరైన చట్టపరమైన ప్రక్రియ లేకుండా ఓటర్ల పేర్లను తొలగించకూడదని కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ లేవనెత్తిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం ముందుగా స్పందించాలని రాష్ట్ర హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే సోమవారం కోరారు. కర్నాటకలో మంగళవారం నుంచి 'సర్' ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగించే ముందు 'తార్కిక వ్యత్యాసాలు' చట్టపరమైన నోటీసులు, వివరణాత్మక ఉత్తర్వులు, ట్రిబ్యునళ్లను ఆశ్రయించే అవకాశం వంటి అంశాలపై స్పష్టత కోరుతూ రాష్ట్ర మంత్రివర్గం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఎనిమిది అభ్యంతరాలను సమర్పించిందని మంత్రి తెలిపారు.
సర్ చేపట్టవద్దని తాము లేదని, ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి, అది ఎన్నికల సంఘం హక్కు అని, అంతకంటే ముఖ్యంగా, స్వచ్ఛమైన, కచ్చితమైన ఓటర్ల జాబితాను అందించడం వారి బాధ్యత అని ప్రియాంక ఖర్గే విలేకరులతో అన్నారు.
కాంగ్రెస్ పార్టీ తన అభ్యంతరాలను కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారికి కూడా సమర్పించిందని, అయితే ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని ఆయన చెప్పారు. కేవలం అక్షర తప్పు కారణంగా ఒక వ్యక్తిని వారి ఓటు హక్కును దూరం చేయలేరు అని ఆయన అన్నారు. ఈ ప్రక్రియను ప్రారంభించే ముందు ఎన్నికల సంఘం తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పార్టీ కోరుకుంటోందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ తన ప్రజా చైతన్య కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే, చట్టపరమైన మార్గాలను కూడా పరిశీలిస్తుందని ఖర్గే చెప్పారు. సవరణ ప్రక్రియలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన, ఆ సాఫ్ట్‌వేర్‌ను ఎవరు ఆడిట్ చేశారని, అది ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో సుమారు 89 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభావితమైన ఓటర్లకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించే అవకాశం కల్పించలేదని ఆయన ఆరోపించారు.
బెంగళూరు సమీపంలోని బిదాడిలో ఎఐ టౌన్‌షిప్ కోసం ప్రతిపాదించిన భూసేకరణపై స్పందిస్తూ, ఏ రైతునూ తమ భూమిని వదులుకునేలా బలవంతం చేయలేమని ఖర్గే స్పష్టం చేశారు. 'రైతులు తమ భూమిని అమ్మేలా ఎవరూ బలవంతం చేయలేరు. మేము ఎప్పుడూ అలా చేయడానికి ప్రయత్నించలేదు, ఇకపై కూడా చేయము' అని ఆయన అన్నారు. చట్టం ప్రకారం భూ యజమానుల సమ్మతితో మాత్రమే భూమిని సేకరిస్తామని మంత్రి తెలిపారు.

08 ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
30-06-2026
www.prajapaksham.in


# గాజాలో మారణహోమానికి 1000 రోజులు పూర్తి

### మళ్ళీ యుద్ధానికి సిద్ధపడుతున్న హమాస్!

**టెల్అవీవ్:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి 1000 రోజులు పూర్తయ్యాయి. ఐనాగానీ గాజాలో ఐడి.ఎఫ్(ఇజ్రాయెల్ డిఫెన్స్‌ఫోర్స్) కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడుతూనే ఉంది. తాజాగా సోమవారం చేసిన గగనతల దాడులలో ఒక పసిబిడ్డ సహా ముగ్గురు మరణించారు. హమాస్ ఉగ్రవాదిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి చేసినట్లు ఐడిఎఫ్ పేర్కొంది.డైర్–అల్–బలాహ్ పొరుగున గుడార కేంద్రాలపై ఈ దాడులు జరిగాయని అల్–అక్సా అమరవీరుల ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ దాడి తర్వాత గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం ప్రారంభమైంది. గాజాలో ఇజ్రాయెల్ సాగించిన దమనకాండలో ఇప్పటివరకూ మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 75,200కు చేరిందని లీడింగ్ మెడికల్ జర్నల్స్ స్వతంత్ర దర్యాప్తులో వెల్లడైంది. గాయపడినవారి సంఖ్య 1.70 లక్షలుగా నమోదైంది. 2025 అక్టోబరులో ఇజ్రాయెల్–గాజా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న ఉల్లంఘన దాడుల్లో మరో 1,045 మంది మరణించారు. గాజా మోర్టాలిటీ సర్వే వివరాలను లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్ ప్రకటించింది.

గాజాలో వైద్య వ్యవస్థను ఇజ్రాయెల్ ఒక పథకం ప్రకారం కుప్పకూల్చింది. ప్రధానంగా ఆసుపత్రులను, ఔషధ వ్యవస్థలను నేలమట్టం చేసింది. అరకొరగా ఇక్కడ ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. రోగులకు మందులు దొరకడంలేదు. డాక్టర్లు, నర్సులను అరెస్టులు చేశారు. గర్భిణీస్త్రీలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. వారికి ఔషధాలు అందకుండా చేశారు. గుండెవ్యాధిగ్రస్తులు సహాయంకోసం ఎదురుచూస్తున్నారు. డయాబెటిక్ రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో లేవు. దాదాపు 18,000 మంది పాలస్తీనియన్లు తక్షణ వైద్యసహాయంకోసం ఎదురుచూస్తున్నారు.


పాలస్తినా ప్రజల అణచివేత, దురాక్రమణకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ మిత్రదేశం అమెరికా సహా అనేక దేశాలలో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. నెతన్యాహూ సారథ్యంలో ఇజ్రాయెల్ దుశ్చర్యలు, గత చరిత్ర,పాలస్తీనియన్లకు జరిగిన అన్యాయం. సామ్రాజ్యవాదుల మద్దతు, పశ్చిమాసియా లో వారి స్వప్రయోజనాలు వంటివన్నీ ఈ నేపథ్య ంలో మరో సారి తెరమీదకు వచ్చి కొత్త తరాల దృ ష్టిని ఈ సమస్య ఆకర్షించింది. దీని కొనసాగింపు గా ఇరాన్‌లో మొదలైన యుద్ధం కూడా సమకాలీ న సమాజ అధ్యయనానికి యువతరాన్ని పురిగొల్పింది. అనేక దేశాలలో ప్రజలు ఈ యుద్ధాలను, వివక్షపూరిత కాంక్షలను నిరసనల ద్వారా వ్యతిరేకించారు.



గాజాలో యుద్ధం మొదలై 1000 రోజులు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇజ్రాయెల్ రక్షణ దళాల ప్రధానాధిపతి లెఫ్టినెంట్ జనరల్ అయాల్ జమీర్ సోమవారం ఒక సమావేశంలో మాట్లాడుతూ, ఐ.డి.ఎఫ్ దళాలు యుద్ధంలో ఇప్పటికీ ఒక సంధి దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.దేశ రక్షణకోసం సైనిక దళాలు ఏకకాలంలో బహుముఖ పోరాటం చేస్తున్నాయన్నారు. బహుముఖ కార్యాచరణకు నిఘా,పర్యవేక్షణపై సమీక్ష చేస్తున్నట్లు చెప్పారు. రాబోయేకాలంలో ఎదురయ్యే సవాళ్ళను ప్రతిఘటించేందుకు ఇజ్రాయెల్ సైన్యం సన్నద్ధమవుతోందని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా హమాస్ సంస్థ సైనిక విభాగం మళ్ళీ భారీగా బలం పుంజుకుని ఇజ్రాయెల్‌తో యుద్ధానికి సన్నద్ధమవుతోందని ఇజ్రాయెల్ గూఢచారి విభాగం జమీర్‌కు గతవారం ఒక హెచ్చరిక జారీ చేసింది. హమాస్ సైనిక విభాగం భారీగా పేలుడు పదార్థాలు, ట్యాంక్ విధ్వంసక క్షిపణులను తయారు చేస్తోందని గూఢచారి వర్గాలు పేర్కొన్నట్లు కాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ పేర్కొంది.

# హెజ్బొల్లా రహస్య స్థావరాలపై ఐడిఎఫ్ దాడులు

### సొరంగంతోపాటు వందల ఆయుధాలు ధ్వంసం
### అమెరికాకు చెప్పే దాడి చేశాం: నెతన్యాహూ, కట్జ్



**బీరూట్:** దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ మళ్ళీ దాడులు చేసింది. ఇరాన్ పెంచిపోషిస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యం ఏర్పాటు చేసుకున్న రహస్య స్థావరాలను కనుగొన్నామని, 200 మీటర్ల నిడివి గల సొరంగ మార్గాన్ని ధ్వంసం చేశామని, అందులో దాచిపెట్టి ఉంచిన వందల ఆయుధాలను కూడా ధ్వంసం చేశామని ఐ.డి.ఎఫ్ సోమవారం ప్రకటించింది. ఈ ఆయుధాలన్నీ ఇరాన్‌లో తయారు చేసినవేనని, వీటిల్లో మానవ రహిత గగనతల వాహనాలు కూడా ఉన్నాయని, అమెరికాకు ముందుగానే సమాచారాన్ని తెలియజేసి ఆ తర్వాతే దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ, రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఒక సంయుక్త ప్రకటనలో చెప్పారు. అదేసమయంలో హెజ్బొల్లా కూడా స్పందిస్తూ, తమకు ఆత్మరక్షణ చేసుకుని తమను తాము కాపాడుకునే హక్కు ఉందని ప్రకటించింది. ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని విమర్శించింది. తాము ఒప్పందాన్ని ఎంతో గౌరవిస్తామని కట్జ్ మరోవైపు ప్రకటించారు. హెజ్బొల్లాను నిరాయుధులను చేస్తేనే ఈ ప్రాంతంలో శాంతి–సుస్థిరత సాధ్యమని ఆయన అన్నారు. అమెరికా మధ్యవర్తిగా మూడు రోజుల క్రితం ఇజ్రాయెల్–లెబనాన్ రాయబారుల మధ్య 14 అంశాలతో కూడిన ఎంఓయుపై సంతకాలు జరిగాయి. హెజ్బొల్లాను నిరాయుధులను చేసి నిర్మూలించడమే లక్ష్యంగా ఈ ఎంఓయు జరిగింది. ఫిబ్రవరి నెలాఖరురోజున ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైన మరునాడు ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ దాడులు చేయడంతో మార్చి రెండో తేదీన లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించి ఐడిఎఫ్ దళాలు ఆ దేశంలోకి ప్రవేశించాయి. అప్పటి నుండీ ఈనాటి వరకూ లెబనాన్‌లో 4,247 మంది మరణించారు. లక్షలమంది లెబనీయులు నిరాశ్రయులయ్యారు.

# శిథిలాల్లో సజీవులపై సన్నగిల్లిన ఆశలు

### వెనెజులాలో సహాయబృందాలు రక్షించింది 33 మందినే ఇంకా 69 వేలమంది శిథిలాల్లోనే...
### నిరాశానిస్పృహ మధ్య ప్రభుత్వంపై ప్రజాగ్రహం
### 189 భవనాలు పూర్తిగా నేలమట్టం, మరో 774 బాగా దెబ్బతిన్నాయి

**కారకస్:** వెనెజులాలో భూకంపం సంభవించిన తర్వాత శిథిలాల్లో చిక్కుకున్న సజీవులను కాపాడేందుకు ఉన్న సహజసిద్ధమైన నిర్దేశిత గడువు ముగిసిపోవడంతో బంధువులలో ఆశలు సన్నగిల్లిపోతున్నాయి. భూకంపం సంభవించి ఐదురోజులు గడచింది. కానీ సజీవులను సకాలంలో వెలికితీయలేకపోయిన పరిస్థితులవల్ల వారు ప్రాణాలతో ఉండే అవకాశాలు కూడా స్నగిల్లిపోయాయి. గడచిన 120 గంటల్లో అధికారిక లెక్కల ప్రకారం కేవలం 33 మంది సజీవులను మాత్రమే శిథిలాల నుండి వెలికితీశారు. ఇంకా 69,000 వేలమంది నివాసితులు శిథిలాల్లోనే ఉండిపోయారు. అమెరికా భూగర్భ పరిశోధన,సర్వే విభాగం సమాచారం ప్రకారం లక్షమంది వరకూ శిథిలాలలో చిక్కుకునే అవకాశం ఉందని తొలుత అంచనావేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 69 వేల మంది జాడ ఇంకా తెలియరావడంలేదు. జంట భూకంపాలవల్ల కారకస్ సమీపంలోలి లా గువైరా రాష్ట్రంలో మహా విలయం సంభవించింది. 189 అతిఎత్తైన,బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 774 భవానాలు బాగా దెబ్బతిని నివాసయోగ్యం కాకుండాపోయాయి.మృతులసంఖ్య ప్రస్తుతం 1450గా తేలింది. ఇంకా మరిన్ని సహాయ బృందాలు విదేశాల నుండి తరలి వచ్చాయి. గతంలో పలు దేశాలలో సంభవించిన భూకంపాలలో ఎదురైన అనుభవాల ప్రకారం 40 రోజుల తర్వాత కూడా బాగా నీరసించిపోయిన స్థితిలో ఒక వ్యక్తిని కాపాడిన అద్భుత ఘటనలు చోటుచేసుకున్నాయి. ఐతే ఇవన్నీ కేవలం అరుదైన ఘటనలే.

గడచిన ఐదు రోజులుగా బాధితులు వేలాదిమంది వీధుల్లోనూ, రహదారులమీదే జీవిస్తున్నారు. పారిశుధ్య లోపం, కనీస అవసరాల సరఫరా లేకపోవడం,తమ ప్రియతములైన బంధువుల ఆర్తనాదాలు వినవస్తున్నాగానీ, వారిని వెలికితీసే శక్తిసామర్థ్యాలు లేకపోవడం వంటి పరిణామాలు ప్రజల్లో ప్రభుత్వంపట్ల క్రమంగా తీవ్ర ఆగ్రహాన్ని రగిలింపజేసింది. మెల్లిగా వాస్తవ పరిస్థితులకు అలవాటు పడుతున్న ప్రజలు కోలుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితికి వస్తున్నారు.

మరోవైపు భయంకరమైన భూకంపాన్ని ప్రత్యక్షంగా చూసి మరణాన్ని తప్పించుకుని బయటపడినవారు ప్రాణాంతకమైన తమ అనుభవాలను ఇతరులతో పంచుకుంటున్నారు. శిథిలాల్లోంచి బయటపడిన బాధితులు జీవితంపై కొత్త ఆశలకు తెరతీస్తున్నారు.

# సరిహద్దుల్లో అఫ్గానిస్థాన్ గ్రామాలపై పాక్ దాడులు

### 36 మంది పౌరులు మృతి: 163 మందికి గాయాలు
### 29 మంది ఉగ్రవాదుల్ని హతమార్చామని పాక్ ప్రకటన

**కాబూల్:** సరిహద్దుల్లో అఫ్గానిస్థాన్ గ్రామాలపై పాకిస్థాన్ వైమానిక దళం సోమవారం తెల్లవారకముందు చేసిన దాడులలో 36 మంది ప్రజలు మరణించారు. మరో 163 మంది గాయపడ్డారు. ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ అఫ్గానిస్థాన్ డిప్యూటీ అధికార ప్రతినిధి హమ్దుల్లా ఫిట్రాత్ ఈ విషయం చెప్పారు. మృతుల్లో పిల్లలు,మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. పాకిస్థాన్ దాడులను ఖండించారు. తూర్పు అఫ్గానిస్థాన్‌లో సరిహద్దు ప్రాంతాలైన పక్తికా,పక్తియా,మనార్ రాష్ట్రాలలో మూడు జిల్లాలపై దాడులు చేసి 29 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్థాన్ సమాచారశాఖామంత్రి అత్తావుల్లా తారర్ మీడియాకు చెప్పారు. గూఢచారి వర్గాల సమాచారం మేరకు జమాత్–ఉల్–అహ్రార్(జెయుఎ) ఉగ్రవాద సంస్థ రహస్యస్థావరాలపై భద్రతాదళాలు పక్కా ప్రణాళికతో ఈ దాడులు చేశామని చెప్పారు. నిరపరాధులపై చేసిన దాడులకు ప్రతీకారంగా ఉగ్రవాదులను హతమార్చామని చెప్పారు. సరిహద్దుల్లో నిల్వ చేసి ఉంచిన ఆయుధాలు, ఆయుధ సామాగ్రిని ధ్వంసం చేశామని చెప్పారు. ఉగ్రవాదులపై మాత్రమే గురిపెట్టి ఈ దాడులు చేశామన్నారు. సరిహద్దుల్లో టిటిపి ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని చాలాకాలంగా పాకిస్థాన్ ఆరోపిస్తోంది. గత ఏడాది అక్టోబరులో కూడా ఇదే విషయంపై ఇరు దేశాలమధ్యా సరిహద్దు ప్రాంతాలలో వారాల తరబడి యుద్ధ దాడులు జరిగాయి. ఆ తర్వాత ఒక ఒప్పందం ద్వారా కాల్పుల విరమణ పాటించాయి.

కరాచీలోని సింధ్ రేంజర్స్ కాంపౌండ్‌లో ఉన్న సైనిక స్థావరంపై ఉగ్రవాదులు శనివారం రాత్రి (జూన్ 27) చేసిన దాడిలో నలుగురు పారామిలిటరీ రేంజర్లు మరణించారు. ఈ దాడికి తామే కారణమని టిటిపి నుండి చీలిపోయిన ఉగ్రవాద సంస్థ జమాత్–ఉల్–అహ్రార్ ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి గతంలోనే టిటిపి,జమాత్–అల్–అహ్రార్ సంస్థలను నిషేధించింది. 2024 అక్టోబరు తర్వాత కరాచీనగరంలో మళ్ళీ ఉగ్రవాదులు చేసిన అతిపెద్ద దాడి ఇదే. ఆ ఆత్మాహుతి దాడిలో ముగ్గురు ఉగ్రవాదులు కూడా మరణించారు. మరో ఉగ్రవాదిని అరెస్టు చేశారు. అతడు ఆఫ్గాన్ జాతీయుడే. ఈ దాడిలో భారత్ ప్రమేయం ఉందని, పాకిస్థాన్‌లో శాంతి, సుస్థిరతలను దెబ్బతీసేందుకు ఉగ్రవాదులను ఏజంట్లుగా వాడుకుంటోందని ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఇతరులపై వేలెత్తి చూపించే ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని,ఎవరు ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్నారో, ఉగ్రవాదులకు ఎవరు స్థావరాలు ఇచ్చి ఇతరులపైకి ఎగదోస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎం ఇఎ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ హెచ్చరించారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవని తిరస్కరించారు. ఆ తర్వాత కొద్ది గంటలకే ఆ ఫ్గానిస్థాన్ సరిహద్దు గ్రామాలపై పాకిస్థాన్ గగనతల దాడులు చేసింది.

పక్తియా రాష్ట్రం చమ్కానీ జిల్లా మండోఖైన్ గ్రామంలో పాకిస్థాన్ గగనతల దాడులతో విధ్వంసం సృష్టించిందని,తొలి దాడుల్లో ఒక నివాస గృహం ధ్వంసం కాగా అందులో ఉన్న ఒక వృద్ధుడు,చిన్నారి, ఇతర కుటుంబ సభ్యులు మరణించారని చెప్పారు. ఈ నివాసంలో ఉన్న బాధితులను కాపాడేందుకు చుట్టుపక్కల ప్రాంతాలవారు గుమిగూడిన సమయంలో రెండోసారి మళ్ళీ గగనతల దాడి జరిగిందని, ఈ దాడిలో 28 మంది మరణించగా, మరో 158 మంది గాయపడ్డారని చెప్పారు. మరణించినవారిలో ఎక్కువమంది పిల్లలు, మహిళలు, వృద్ధులే ఉన్నారు. అదేవిధంగా ఆ పొరుగున పక్తికా రాష్ట్రం గియాన్ జిల్లాలోని పలుస్ట్ గ్రామంలో మరో నివాసంపై పాకిస్థాన్ చేసిన




బాంబుదాడిలో ఆరుగురు పౌరులు మరణించారు. వీరిలో కూడా ఎక్కువమంది పిల్లలు,మహిళలే ఉన్నారు.కునార్ రాష్ట్రం మనోగై జిల్లా బరోలో గ్రామంలో కూడా మరో నివాసగృహంపై గగనతల దాడి జరిగింది. ఈ ఇల్లు ధ్వంసమైనప్పటికీ ఎవరూ గాయపడలేదు. ఇటీవల సరిహద్దుల్లో అడపాదడపా ఇరుదేశాల మధ్యా జరుగుతున్న దాడుల్లో అనేకమంది ప్రజలు మరణిస్తున్నారు.గడచిన ఫిబ్రవరిలో, ఆ తర్వాత మార్చినెలలో కాబూల్‌లోని ఒక మాదక ద్రవ్యాల పునరావాస కేంద్రంపై పాకిస్థాన్ చేసిన దాడులలో వందలమంది మరణించారు. జూన్‌నెల ప్రారంభంలో పాకిస్థాన్ చేసిన గగనతల దాడుల్లో 26 మంది ఉగ్రవాదులు మరణించగా, 13 మంది పిల్లలు మరణించారని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది.

# ‘గుప్పెడు గుండెకు... సింగరేణి గట్టి భరోసా’

### గోదావరిఖనిలో తొలి క్యాథ్ ల్యాబ్‌తో కోల్ బెల్ట్ ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు
### రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో ఏడాదిలోనే ఏర్పాటైన క్యాథ్ ల్యాబ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశానికి వెలుగులు పంచే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ దిశగా సింగరేణి సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థకు గుండెకాయగా ఉన్న కార్మికుల హృదయాలకు గట్టి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సంస్థ అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను రామగుండం1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. త్వరలో లాంఛనంగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సింగరేణి కార్మికులకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో సింగరేణి ఉద్యోగులు ఎక్కువగా నివసించే గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి సంస్థ తొలి క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం. దీంతో పెద్దపల్లి, మంచిర్యాల, కొమురమ్ భీమ్ ఆసిఫాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ భూపాల పల్లి జిల్లాల్లో నివసిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణి ఉద్యోగులతో పాటు సమీప గ్రామాల ప్రజల హృదయాలకు సింగరేణి గట్టి భరోసాను ఇచ్చినట్లు అయింది.

**గోదావరిఖని క్యాథ్ ల్యాబ్‌లో వైద్యసేవలు**


రక్తనాళాల పరీక్షలు, గుండె నరాల్లో బ్లాక్లను గుర్తించే పరీక్షలు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ అమరిక, ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో నిరంతర సేవలు.

**కార్మికుడి ఆరోగ్యమే సంస్థ సంపద**

కార్మికుల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల రెఫరల్స్ కోసమే అధిక మొత్తం నిధులను కేటాయిస్తోంది. గత ఏడాది మాత్రమే హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సుమారు 3,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి, బెల్లంపల్లి, రామగుండం, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. అయితే గుండె జబ్బుల విషయంలో ప్రతీ నిమిషం విలువైనదే కావడంతో లక్షల రూపాయలు వెచ్చించడం కంటే సకాలంలో అత్యాధునిక చికిత్స అందించడం ద్వారానే ప్రాణాలను కాపాడవచ్చనే దృఢ సంకల్పంతో సింగరేణి యాజమాన్యం గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మరో మారు కార్మిక సంక్షేమంలో సింగరేణి దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఈ ముందడుగు ద్వారా మరోసారి నిరూపించింది.

**ఉత్తర తెలంగాణకు లభించిన వరం**

గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొత్తం 7890 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగరేణి కార్డియాలజీ విభాగం ఏర్పాటు చేశారు. ఇందులో 5 పడకల సామర్థ్యం గల ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్, 10 పడకల సామర్థ్యం తో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ప్రత్యేక గదులతో ఔట్ పేషెంట్ బ్లాక్ ఉన్నాయి. గోదావరిఖని,



రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, పెద్దపల్లి, భూపాలపల్లి, మంథని తదితర పరిసర ప్రాంతాలతో పాటు మొత్తం కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలకు ఈ క్యాథ్ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుంది. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ కోసం ఏడేళ్లలో సింగరేణి సంస్థ దాదాపు రూ.50 కోట్ల ఖర్చును భరించనుంది. కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీమ్ టారిఫ్ల మేరకు అతి తక్కువ ఖర్చుతో స్థానికులకు కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించే సౌకర్యాన్ని కల్పించింది. ప్రతీ నెల దాదాపు 3 వేల మందికి పైగా ఈ సేవలను వినియోగించుకుంటారని అంచనా. అయితే ఇక్కడ క్యాథ్ ల్యాబ్ ఉన్న పడకల సామర్థ్యంలో 50 శాతం సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణీయులకు రిజర్వు చేసినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. స్థానికంగానే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడం ద్వారా విలువైన ప్రాణాలకు భరోసా కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ క్యాథ్ ల్యాబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ వివరించారు. ఇక సుదూర ప్రాంతాలకు తరలించకుండా, ఇకపై గోల్డెన్ అవర్లోనే అత్యవసర చికిత్స అందించడం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడే కేంద్రంగా గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రాణాలను కాపాడే ‘గోల్డెన్ అవర్’ వైద్యం

సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కంపెనీ ఆధ్వర్యంలో అనేక ఆధునిక వైద్య సౌకర్యాలు గల ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ అందులో కార్డియాక్ సంబంధిత సేవలు పరిమిత స్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి సుదూర నగరాలకు తరలించాల్సి వచ్చేది. ఆ సుదీర్ఘ ప్రయాణంలో అమూల్యమైన ‘గోల్డెన్ అవర్‘ (రక్షించదగిన తొలి గంట) వృథా అవుతుండేవి. గుండెపోటు వచ్చిన తొలి గంట సమయంలో యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ అత్యవసర సేవల ప్రాధాన్యతను గుర్తించిన సింగరేణి యాజమాన్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అత్యాధునిక సాంకేతికతతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను గోదావరిఖనిలో ఏర్పాటు చేసింది. బొగ్గు బెల్ట్ ప్రజలకు సకాలంలో, తక్కువ వ్యవధిలోనే అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## నేడు రైతు భరోసా
(మొదటి పేజీ తరువాయి)

రైతు మేళాను కూడా వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా వేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు విత్తనాలు వేసే కీలక సమయంలో పెట్టుబడి సాయం అందించాలనే లక్ష్యంతో ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే రైతు భరోసా నిధులను నేడు విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి సుమారు 2,500 మంది రైతులు పాల్గొంటారని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు తమ తమ జిల్లాల్లోని రైతు వేదికలకు చేరుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను దశలవారీగా జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతులకు రూ.2,482.02 కోట్లను జమ చేయనున్నట్లు వెల్లడించారు.ఇందులో ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతులకు రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72 లక్షల మంది రైతులకు రూ.1,603.08 కోట్లు విడుదల చేయనున్నట్లు వివరించారు. మిగిలిన రైతులకు కూడా దశలవారీగా నిధులు జమ చేస్తామని తెలిపారు.కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు జూలై 5లోపు సమీప వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పిస్తే రైతు భరోసా పథకం ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని మంత్రి సూచించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు సమీప రైతు వేదికలకు చేరుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎదుట నిరసనలు
(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా జూలై 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద వేలాది మందితో మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇళ్లు, ఇంటి స్థలాల పట్టాలు కావాల్సిన అర్హులంతా తమ దరఖాస్తులతో మహాధర్నాకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం వామపక్ష ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అర్హుల దరఖాస్తులతో కూడిన జాబితాతో పాటు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పేదల ఇంటి స్థలాల కోసం విద్యుత్ ఉద్యమం తరహాలో రాష్ట్రవ్యాప్తంగా మరో మహోద్యమాన్ని నిర్మిస్తామని కూనంనేని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యచరణ ఉంటుందని కూనంనేని వెల్లడించారు.

సిగాచి పేలుడు బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలి :

సిగాచి ఇండస్ట్రీస్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయి పరిహారం అందకపోవడం దురదృష్టకరమని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం చట్టపరంగా లభించే ఈఎస్‌ఐ, పిఎఫ్, బీమా మొత్తాలను కలిపినా ప్రకటించిన పరిహారంలో సగం కూడా అందలేదని విమర్శించారు. యాజమాన్యం రూ.1 కోటి పరిహారం చెల్లించాలన్న డిమాండ్‌ను పట్టించుకోకపోవడమే కాకుండా, హైకోర్టు ఆదేశాలను కూడా అమలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రయోజనాలకు అదనంగా యాజమాన్యం నుంచి ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, గాయపడిన కార్మికులకు తగిన పరిహారంతో పాటు పూర్తి వైద్య ఖర్చులు కూడా భరింపజేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఈ ఘటనలో కంపెనీ యాజమాన్యంతో పాటు కార్మిక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడ్డ నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్ట్యా లేబర్ కోడ్‌ల అమలుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

## మహానగరానికి కొత్త రూపు
(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోయడమే కాకుండా పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను ఆధునిక జీవన కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో పేదలకు అన్యాయం జరగకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. భూ సేకరణలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టు కారణంగా ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన కార్యాచరణను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. అలాగే భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, సముచిత పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## రంగం సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ బూత్‌ల వివరాలు, బూత్ ఇంచార్జ్‌ల జాబితాను ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికే ఎన్నికల అధికారికి అందజేసినట్లు సమాచారం. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా మరో రెండు, మూడు రోజుల్లో తొలి నోటీసు విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నోటీసుతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆర్‌టిసి యాజమాన్యం ఎన్నికల అధికారితో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోంది. దీంతో టిజిఎస్ ఆర్‌టిసి యూనియన్ ఎన్నికలపై ఉద్యోగుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# 12 మంది ఐపిఎస్‌ల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 12 మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో నంబర్ 931 విడుదల చేశారు. బదిలీలు, అదనపు బాధ్యతలు పొందిన అధికారుల వివరాలు కింది విధంగా ఉన్నాయి. సన్‌ప్రీత్ సింగ్ వరంగల్ పోలీస్ కమిషనర్ పదవి నుండి బదిలీ అయి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. దీనితో పాటు రాజన్న (జోన్3) డిఐజిగా పూర్తి అదనపు బాధ్యతలను వీరు నిర్వహించనున్నారు. ఎన్. శ్వేత హైదరాబాద్ సిటీ నార్త్ రేంజ్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్ పదవి నుండి బదిలీ అయి, వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. వీరు భద్రాద్రి (జోన్4) డిఐజిగా అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు. సింధు శర్మ యాంటీ కరప్షన్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ పదవి నుండి బదిలీ అయి, హైదరాబాద్ ఇంటెలిజెన్స్ సిఐ సెల్ ఎస్‌పిగా నియమితులయ్యారు. అలాగే ఎస్ఐబి ఎస్‌పిగా వీరు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

వై. సాయి శేఖర్ ఎస్ఐబి ఎస్‌పి పదవి నుండి బదిలీ అయి, సికింద్రాబాద్ రైల్వే పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. చెన్నూరి రూపేష్ హైదరాబాద్ సిటీ ఐటి డిసిపి పదవి నుండి బదిలీ అయి, సిఐడి ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ప్రవీణ్ కుమార్, ఎసిబి జాయింట్ డైరెక్టర్ పదవి నుండి బదిలీ అయి, సిఐడి ఎస్‌పిగా నియమితులయ్యారు.

ఆర్. వెంకటేశ్వర్లు పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్న వీరికి హైదరాబాద్ సిటీ సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ డిసిపిగా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో వీరిని సిఐడి ఎస్‌పిగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు దీనితో రద్దయ్యాయి. రాజేష్ మీనా వనపర్తి అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) పదవి నుండి బదిలీ అయి, వికారాబాద్ అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) గా నియమితులయ్యారు. బి. రాములు నాయక్ వికారాబాద్ అడిషనల్ ఎస్‌పి పదవి నుండి బదిలీ అయిన వీరు హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

**పూర్తి అదనపు బాధ్యతలు పొందిన ఇతర అధికారులు..**

అంబర్ కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతూనే, కాళేశ్వరం (జోన్1) డిఐజి గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. డి. జోయల్ డేవిస్ హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతూనే, యాదాద్రి (జోన్5) డిఐజిగా పూర్తి అదనపు బాధ్యతలు చూసుకోనున్నారు. ఆర్. భాస్కరన్ ఇంటెలిజెన్స్ సిఐ సెల్ డిఐజిగా కొనసాగుతూనే, బాసర (జోన్2) డిఐజిగా అదనపు బాధ్యతలు స్వీకరిస్తారు. ఎస్.ఎం. విజయ్ కుమార్ హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, హైదరాబాద్ నార్త్ రేంజ్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

బదిలీ అయిన అధికారులు వెంటనే తమ కొత్త పోస్టింగులలో బాధ్యతలు స్వీకరించాల్సిందిగా ఉత్తర్వులో పేర్కొన్నారు.

# ఒలింపిక్స్ బరిలో టీమిండియా

## ఆసియా నుంచి ఏకైక జట్టుగా రికార్డు



మహిళల పొట్టి ప్రపంచకప్ 2026 నుంచి లీగ్ దశలోనే నిష్క్రమించిన భారత జట్టుకు ఓ తీపికబురు. మెగా టోర్నీలో సెమీస్ చేరలేకపోయిన టీమిండియా 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. లాస్ ఏంజెల్స్‌లో జరుగనున్న విశ్వ క్రీడల్లో భారత్ బెర్తు దక్కించుకుందని సోమవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది. ఆసియా జట్లలో ఒకటైన భారత్ టి–20 వరల్డ్ కప్‌లో అత్యధిక పాయింట్లతో ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిందని ఐసిసి తెలిపింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ అనే పదం వినిపించి వందల ఏళ్లు గడిచిపోయాయి. 128 ఏళ్ల విరామం తర్వాత లాస్‌ఏంజెల్స్‌లో మళ్లీ క్రికెట్ పోటీలకు తెరలేవనుంది. మెగా టోర్నీకి మరో రెండేళ్లే ఉండడంలో జట్ల ఎంపికపై దృష్టి సారించింది ఐసిసి. ఈ క్రమంలోనే ఒక్కో ఖండం నుంచి ఒక్కో జట్టును విశ్వ క్రీడలకు తీసుకుంటోంది. మహిళల టి–20 వరల్డ్ కప్ సెమీస్ బెర్తు చేజార్చుకున్నప్పటికీ.. ఆసియా నుంచి అత్యధిక పాయింట్లతో భారత జట్టు ఎంపికైంది.

**ఎంపిక ప్రక్రియ ఇలా...** ఆసియా ఖండం నుంచి టీమిండియా క్వాలిఫై కాగా.. ఓసియన్ నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండం నుంచి దక్షిణాఫ్రికా, యూరప్ నుంచి ఇంగ్లండ్ ఒలింపిక్స్ బెర్తు సొంతం చేసుకున్నాయి. తద్వారా లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మొదటి నాలుగు మహిళల జట్లుగా నిలిచాయి. 2028 విశ్వక్రీడలకు ఆతిథ్యమిస్తున్న అమెరికా ఐసిసి మహిళల టి–20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఐదో జట్టుగా ఎంపికయ్యే అవకాశముంది.

**షరతు ఏంటంటే..** ఈ ఏడాది జూన్ 30 నుంచి డిసెంబర్ 31 మధ్య యుఎస్‌ఎ టాప్15లో ఉండాలి. ఒకవేళ అమెరికా విఫలమైతే.. 2027 మార్చి 1 నాటికి ఐసిసి మహిళల టి–20 ర్యాంకింగ్స్‌లో ఉండని జట్టు.. ఐదో స్థానం దక్కించుకుంది. చివరి బెర్తును ఐసిసి ఒలింపిక్ క్వాలిఫయర్ 2027 ద్వారా నిర్ణయించనున్నారు.

## టీమిండియా ఓటమిని నమ్మలేకపోతున్నా



ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో భారత్ 2–0 తేడాతో అనూహ్యంగా వైట్‌వాష్‌కు గురవడాన్ని నమ్మలేకపోతున్నట్లు టీమ్ ఇండియా సహాయ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే అన్నారు. మ్యాచ్ అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండుసార్లు వరుసగా ప్రపంచ ఛాంపియన్స్‌గా నిలిచిన ఇండియా సామర్థ్యాన్ని ఒక్క సిరీస్‌తో తక్కువ అంచనా వేయలేమన్నారు. టీమిండియా పిచ్ కండీషన్స్ అర్థం చేసుకోవడంలో విఫలమైందని అంగీకరించారు. ఐర్లాండ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడి విజయం సాధించిందని, ఈ ఓటమిని జీర్ణించుకోవడం కష్టంగా ఉందన్నారు. ఐపిఎల్ తరహా ఫ్లాట్ పిచ్ల నుండి పెద్ద బౌండరీలున్న బెల్ఫాస్ట్లోని'స్ట్రీసీ' ట్రాక్లకు మారడంలో భారత బ్యాటింగ్ లైనప్ కొంత ఇబ్బంది పడిందని అంగీకరించారు. ఇదే సమయంలో ఐర్లాండ్ స్థానిక పరిస్థితులను చక్కగా అర్థం చేసుకొని ఇండియాను తెలివిగా ఓడించిందని ప్రశంసించారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. రెండో టి–20 మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తేడాతో నాటకీయంగా ఓడిపోవడంతో టి–20లలో భారత్ కొనసాగించిన 16 సిరీస్‌ల అజేయ పరంపరకు బ్రేక్ పడింది. కాగా, అంతర్జాతీయ క్రికెట్లో ఇంకా పసికూనగానే చలామణి అవుతున్న ఐర్లాండ్ అద్భుతమే చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ ఎడిషన్లలో మేటి జట్లను కంగుతినిపించి ట్రోఫీలు గెలిచిన భారత జట్టుకు దిమ్మతిరిగే షాకిస్తూ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ ఎడిషన్లలో మేటి జట్లను కంగుతినిపించిన భారత జట్టుకు ఆదివారం రసవత్తరంగా సాగిన పోరులో ఐరిష్ జట్టు.. ఒక్క పరుగు తేడాతో టీమిండియాను చిత్తుచేసి సిరీస్‌ను కైవసం చేసుకుంది.

## యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్‌కు శ్రీకాంత్



భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లోకి ప్రవేశించాడు. ఫుల్లర్టన్‌లో ఆదివారం రసవత్తరంగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో శ్రీకాంత్.. 22–20, 15–21, 21–19తో ప్రపంచ 33వ ర్యాకర్ యుడాయ్ ఒకిమొటొ (జపాన్)ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఇక టోర్నీ ఆసాంతం రాణించిన రౌనక్ చౌహాన్‌తో పాటు మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ సెమీస్‌లో పరాజయం పాలయ్యారు.

## యువతరంగం

# యుపిఎస్‌సికి సిద్ధమవుతున్నారా?



యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష (సిఎస్ఇ) కోసం సిద్ధమవడం అనేది దీర్ఘకాలికమైన, కఠినమైన ప్రక్రియ. ఇందులో తెలివైన వ్యూహం, నిరంతర శ్రమ, భావోద్వేగ స్థైర్యం అవసరం. ఇది కేవలం జ్ఞానం సేకరించడం మాత్రమే కాదు; ఒక సివిల్ సర్వెంట్‌గా ఆలోచించే మనస్తత్వాన్ని అభివృద్ధి చేయడం. ఈ క్రమంలోనే యుపిఎస్‌సి అభ్యర్థులు గమనించాల్సిన ముఖ్యాంశాలు:

### 1. ప్రాథమిక అంశాల అవగాహన

సిలబస్‌పై పూర్తి అవగాహన: సిలబస్ మార్గదర్శక దీపంలాంటిది. ప్రతి అంశాన్ని విశ్లేషించి పూర్తిగా కవర్ చేయాలి. ప్రశ్నలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సిలబస్‌కు సంబంధించినవే ఉంటాయి.

**పరీక్షా విధానం, దశలు :** మూడు దశలు ఉంటాయి – ప్రిలిమ్స్ (ఆబ్జెక్టివ్/క్వాలిఫైయింగ్), మెయిన్స్ (వివరణాత్మక/మెరిట్ ఆధారితం), ఇంటర్వ్యూ (వ్యక్తిత్వ పరీక్ష).

**ఎన్‌సిఇఆర్‌టి పునాది :** చరిత్ర, భూగోళశాస్త్రం, రాజ్యాంగం, ఆర్థిక శాస్త్రం వంటి ప్రధాన విషయాలకు 6–12 తరగతుల ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలతో బలమైన పునాది నిర్మించాలి.

### 2. అధ్యయన వ్యూహం

అందుబాటులో ఉండాల్సిన వనరులను పరిమితం చేసి, పునశ్చరణను గరిష్టం చేయాలి. ఎక్కువ మెటీరియల్ చూసి గందరగోళానికి లోనవకూడదు. ప్రతి సబ్జెక్టుకు ఒక ప్రామాణిక పుస్తకం తీసుకుని 10–15 సార్లు పునశ్చరణ చేయాలి.

**రోజువారీ కరెంట్ అఫైర్స్ :** ప్రతిరోజూ విశ్వసనీయ పత్రిక చదవాలి. స్థిరమైన అంశాలను సమకాలీన పరిణామాలతో అనుసంధానించాలి.

**సంక్షిప్త నోట్స్ తయారీ :** కీలక పదాల ఆధారంగా చిన్న నోట్స్ తయారు చేయాలి. కరెంట్ అఫైర్స్‌ను స్టాటిక్ సబ్జెక్టులతో కలపడం ముఖ్యం.

**ఐచ్ఛిక విషయం ఎంపిక :** మీ ఆసక్తి, విద్యాపరమైన నేపథ్యం, మార్గదర్శకత్వం లభ్యత ఆధారంగా ఐచ్ఛిక సబ్జెక్ట్ ఎంపిక చేయాలి. ఇది మెయిన్స్‌లో 500మార్కులు కలిగి ఉంటుంది.

### 3. సమాధాన రచన, అభ్యాసం

**రోజువారీ సమాధాన రచన (మెయిన్స్) :** ప్రతిరోజూ సమాధానాలు రాయాలి. అందులో పరిచయం, విశ్లేషణ, ముగింపు అనే నిర్మాణాన్ని పాటించాలి. పద పరిమితిని గౌరవించాలి. ఎక్కువ పదాలు వినియోగించడం వల్ల సమగ్రత లోపించడమేగాక, ఎక్కువ తప్పులు దొర్లే ప్రమాదం కూడా ఉంటుంది.

**గత ప్రశ్నపత్రాల విశ్లేషణ :** గత 10–15 సంవత్సరాల ప్రశ్నలను విశ్లేషించి ధోరణి, క్లిష్టత స్థాయి, ముఖ్య అంశాలను గుర్తించాలి.

**మాక్ టెస్ట్ సిరీస్ :** ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికీ మాక్ టెస్టులు (మాదిరి పరీక్షలు) రాయాలి. సమయ నిర్వహణ, వేగం, బలహీన ప్రాంతాల గుర్తింపుకు ఇవి సహాయపడతాయి.

**7–5–3 నియమం (మెయిన్స్) :** ప్రధాన భాగంలో 7 పాయింట్లు, 5 పేరాల నిర్మాణం, 3 కోణాలు (సామాజిక, రాజకీయ, ఆర్థిక) కవర్ చేయడం వంటి క్రమబద్ధమైన విధానం అనుసరించాలి.

### 4. దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలు

**సిఎస్‌ఎటి (ప్రిలిమ్స్ పేపర్ II) :** ఇది క్వాలిఫైయింగ్ అయినప్పటికీ క్లిష్టత పెరుగుతోంది. గణితం, తర్కశక్తి, పాఠ్య అవగాహనపై సాధన అవసరం.

**ఎథిక్స్ మరియు ఎస్సే (మెయిన్స్) :** నైతిక విలువలపై బలమైన అవగాహన కలిగి ఉండాలి. వ్యాసం (ఎస్సే)లో సమతుల్య, విశ్లేషణాత్మక దృక్పథంతో విభిన్న కోణాలు చూపాలి.

**మ్యాప్ ఆధారిత ప్రశ్నలు :** భారతదేశం మరియు ప్రపంచ భూగోళంపై మ్యాపింగ్ సాధన చేయాలి.

### 5. మనస్తత్వం..నిర్వహణ

**ప్రేరణ కంటే క్రమశిక్షణ ముఖ్యము :** ప్రేరణ తాత్కాలికం; క్రమశిక్షణ శాశ్వతం. ప్రతిరోజూ ఒక స్థిరమైన అధ్యయన పట్టిక ఉండాలి.

**శారీరక, మానసిక ఆరోగ్యం :** బర్నౌట్ నివారించేందుకు విరామాలు తీసుకోవాలి. వ్యాయామం, సరైన ఆహారం అవసరం.

**ఎప్పటికీ వదులుకోని ధోరణి :** ఈ ప్రక్రియలో విజయాపజయాలు సహజం. తప్పిదాల నుంచి నేర్చుకుని లక్ష్యంపై దృష్టి నిలుపుకోవాలి.

**సమయ నిర్వహణ :** రోజువారీ, వారాంత, నెలవారీ లక్ష్యాలతో ప్రణాళిక రూపొందించాలి.

### 6.ఇంటర్వ్యూ (వ్యక్తిత్వ పరీక్ష)

**డిఎఎఫ్ అధ్యయనం :** మీ విద్య, జన్మస్థలం, హాబీలు, ఉద్యోగ అనుభవం వంటి వివరాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి.

**నిజాయితీ :** తెలియని ప్రశ్నకు అబద్ధం చెప్పకూడదు. తెలియదని అంగీకరించడం ఉత్తమం.

ఈ విధానలను అనుసరించడం అనేది ప్రధానంగా యుపిఎస్‌సి సిద్ధతను పరీక్షా సన్నాహంగా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియగా చూడాలని సూచిస్తుంది. సిలబస్ కేంద్రబిందువు. వనరుల పరిమిత వినియోగం, పునశ్చరణ ఎక్కువసార్లు చేయడం విజయానికి కీలకం. మెయిన్స్‌లో రచనా నైపుణ్యం, ఇంటర్వ్యూలో నిజాయితీ, మొత్తం ప్రయాణంలో క్రమశిక్షణ అనే ఈ మూడు స్థంభాలు ముఖ్యమైనవి.

## ఉపాధి అవకాశాలపై దృష్టి



యువతకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నాయి. సంప్రదాయ విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను అందించేందుకు ప్రత్యేక శిక్షణ పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో కర్ణాటక ప్రభుత్వం 'నిపుణ కర్ణాటక' కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా యువతకు కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం యువతను ప్రపంచ స్థాయి ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం. పరిశ్రమలు, విద్యాసంస్థలు, సాంకేతిక సంస్థల భాగస్వామ్యంతో శిక్షణా కోర్సులను రూపొందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శిక్షణ పూర్తిచేసిన వారికి పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య ధ్రువపత్రాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు కర్నాటక చేస్తున్న ప్రయత్నం మిగతా రాష్ట్రాలకు మార్గదర్శకం కావాలి. ఎందుకంటే, ఇలాంటి స్కిల్లింగ్ కార్యక్రమాలు యువతలో ఉద్యోగయోగ్యతను పెంచడమే కాకుండా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతిక రంగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా భారత యువత అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్లో పోటీ పడే సామర్థ్యాన్ని సొంతం చేసుకునే అవకాశం కలుగుతుంది. దీంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ ఉపాధికి బలమైన పునాదిగా మారుతున్నాయి.

## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగంపై

# బిజెపి నేతల మౌనమెందుకు?

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగంపై బిజెపి నేతల మౌనమెందుకని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. అయోధ్య రామాలయంలో దొంగతనం జరిగినా, దీనిపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో దేశంలోని నలుమూలల నుండి ప్రజలు శ్రీరాముడి గుడికి ఇచ్చిన విరాళాలు దొంగతనం అవుతున్నా, ఆలయానికి రక్షణ ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను ఎలా కాపాడుతుందని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వానికి చిత్తం శ్రీరాముడి మీద, భక్తి అదానీ, అంబానీ మీద ఉందని ఎద్దేవా చేశారు. దేశంలోని సహజ సంపదలను అదానీకి అప్పజెప్పడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. యోగి ప్రభుత్వం అయోధ్య శ్రీరాముడి గుడిలో జరిగిన దొంగతనాలను అణచివేయకుండా, దేశ సంపదను దోచుకోవడానికి అదానీకి మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. అబద్ధపు మాటలు, మాయమాటలతో శ్రీరాముడి పేరు చెప్పుకోవడం తప్ప బిజెపి ప్రజలకు చేసింది ఏమీ లేదని, శ్రీరాముని జపం చేసే వారు ఆలయానికి రక్షణ ఇవ్వలేనటువంటి అసమర్థులని విమర్శించారు. ప్రజల నుంచి విరాళాలుగా సేకరించిన విరాళాలకు సరైన రశీదులు, లెక్కలు లేవని విమర్శించారు. బిజెపి నాయకులు అయోధ్య రామాలయం నిధుల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సామాన్య భక్తులు దేవుడిపై భక్తితో విరాళాలుగా ఇస్తే, కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టడం, ఇంటి దొంగలే వాటితో విలాసవంతమైన జీవితాలు గడపడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లివ్వాలి

### 1న కలెక్టరేట్‌ల ముట్టడిని విజయవంతం చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ పెద్దపల్లి మండల సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోనీ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలకు స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అలాగే ఎలాంటి స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలకు ఇండ్లు మంజూరు చేస్తామని చెబుతూనే మరోవైపు వరంగల్‌లో ఇండ్లులేని పేదల గుడిసెలు వేసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తొలగించడం దుర్మార్గమైన చర్య అని, దీనిపైన రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో జూలై 1న కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని, జిల్లాలోని ప్రజలందరూ కలెక్టరేట్ ముట్టడికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొందరు బిజెపి నాయకులు బెంగాల్ తరహాలోనే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడతామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, తెలంగాణలో ఒక్క ఓటు కూడా పోకుండా ఎస్ఐఆర్ నిర్వహించాలని అధికారులను డిమాండ్ చేశారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వంపై మతోన్మాదానికి వ్యతిరేకంగా సిపిఐ వామపక్షాలు కలిసి పోరాటం చేస్తాయని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పెద్దపెల్లి మండల అధ్యక్షుడు రమేష్ వినతి పత్రం అందించగా ఈ విషయమై మంత్రులకు వినతి పత్రాలు అందజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, సిపిఐ కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, పెద్దపల్లి మండల పట్టణ కార్యదర్శులు రమేష్, నవీన్, కల్లేపల్లి రవి, జింక విటల్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బాలసాని లెనిన్, జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



### సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### అధికారుల దీక్షలకు సంఘీభావం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతుంటుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిలభారత బొగ్గు గనుల సంఘం (ఐఎంఒసి) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సంగరేణి ప్రధాన కార్యాలయం ముందు అధికారులు సోమవారం నిరసన దీక్షలు మొదలు పెట్టారు. దీక్షా శిబిరాన్ని కూనంనేని సందర్శించిన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. అధికారుల పే రివిజన్, అలవెన్సులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాటా, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవచూపాలని, లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, నగర మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె.గట్టయ్య, క్రిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యావిధానం రద్దుకు ఉద్యమం

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సురేష్ మాట్లాడుతూ దేశంలో నూతన విద్యా విధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేయనుందన్నారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాలతో ఆరెసెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న వారినే యూనివర్సిటీలలో నియమాకాలు చేస్తుందన్నారు. కేంద్రబడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యా విధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు, జిల్లా నిర్మాణ బాధ్యులు రావి శివ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. సంక్షేమ గురుకులాల్లో సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్ని సంక్షేమ గురుకులాల్లో కనీస వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా 27వ మహాసభలు ఆగస్టు 20, 21 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, షేక్ నాగులమీరా, మనోజ్, సాయి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనుల హక్కుల రక్షణకు రాజీలేని పోరాటాలకు సిద్ధం



### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/భువనగిరి :** గిరిజన హక్కుల రక్షణకు రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం గిరిజన సమాఖ్య యాదాద్రి జిల్లా కౌన్సిల్ సమావేశానికి అంజయ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల భూ హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గిరిజనుల భూములను రక్షిస్తూ, అక్రమ ఆక్రమణలను అరికట్టి, తండాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గిరిజన యువతకు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలు విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ కార్పొరేషన్లను బలోపేతం చేయాలని కోరారు. తండా గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల న్యాయమైన హక్కుల సాధన కోసం జరిగే ప్రతి ఉద్యమానికి పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ధీరవత్ విట్టల్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, గిరిజన సమాఖ్య నాయకులు స్వరూప, లక్ష్మణ్ నాయక్, శుక్రునాయక్, గంగారాం నాయక్, సుశీల నాయక్, రామచంద్ర, రఘుపతి నాయక్, లక్ష్పతి నాయక్, అన్నెమైన వెంకటేష్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళ చైతన్యమే లక్ష్యంగా...

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మహిళలను సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా సంస్కృతిక చైతన్యమే లక్ష్యంగా తెలంగాణ మహిళ సమాఖ్య ముందుకు సాగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. సోమవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో తెలంగాణ మహిళ సమాఖ్య మండల మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. దేశంలో మహిళలకు ఒక సంఘం ఉండాలని ఆలోచన ఏర్పాటు చేసి ఏర్పాటు చేసిన మొట్టమొదటి సంఘం భారత జాతీయ మహిళ సమాఖ్య అన్నారు. అందులో ఎందరో స్వతంత్ర్య సమరయోధులు భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన మహిళలు ఉన్నారని తెలిపారు. మహిళ బిల్లులో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, స్థానిక సంస్థల్లో మహిళ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు స్వచ్ఛగా పరిపాలన కొనసాగించాలన్నారు. మహాసభకు ఏ.లక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రావిరాల భ్రమరాంబ, కోటమ్మ, మంగ, నారాయణమ్మ, పల్లవి పాల్గొన్నారు.

## ఎఐటియుసి నియోజకవర్గ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ ఏఐటీయూసీ కమిటీని ఆదివారం జరిగిన 11 వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బంటు వెంకటేశ్వర్లు. వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల యాదగిరి, అధ్యక్షులుగా జిల్లా యాదగిరి, ఉపాధ్యక్షులు బంటు బాలకృష్ణ, కార్యదర్శిగా బంటు రాజేశ్వరి, సహాయ కార్యదర్శిగా మూడవత్ రాము, కోశాధికారి కే.బిక్షంతో పాటు 12 మందిని సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ 44 చట్టాలను రద్దుచేసి కార్మికుల హక్కులను హరించి వేస్తుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా. కార్మిక వ్యతిరేక విధానాలపై బలమైన ఉద్యమాలు జరపాలని పిలుపునిచ్చారు. ఐక్యమత్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధింపబడతాయన్నారు. జులై 19వ తేదీన మర్రిగూడలో ఏఐటియుసి జిల్లా మహాసభ జరుగుతుందని, ఆ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలన్నీటిపైన ఏకగ్రీవంగా తీర్మానం చేసి కార్మికులను ప్రజలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక చట్టాల మీద పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని వారన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 69అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 31, జిల్లా గ్రామీణాభివృది 7, సర్వే ల్యాండ్ 6, మున్సిపాలిటీ 6, వ్యవసాయ 4, సంక్షేమ శాఖ 3, ,ఆర్టీసీ 2, జిల్లా పరిషత్ 2, చేనేత, కోపరేట్యివ్, సమాచార శాఖ, విద్య, బి.సి వెల్ఫర్, హౌసింగ్, వైద్య ఆరోగ్య, పంచాయతీ, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఈ ఓ జెడ్పి సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డి. ఆర్.ఓ జయమ్మ, పిడి హౌసింగ్ అలివేలు, ఆర్డీవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కళాకారుల సమస్యల కోసం కలెక్టర్ ను కలవడం జరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళాకారుల గుర్తింపు కార్డు మీ సేవలో అప్లికేషన్ అప్లై చేసి కలెక్టరేట్లో సంతకాల గురించి పెండింగ్లో ఉన్నాయి. ఇవి వెంటనే సంతకాలు పెట్టి కళాకారులకు గుర్తింపు కార్డులు వచ్చేటట్టు ప్రభుత్వం కళాకారుల పైన శ్రద్ధ చూపాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్ తెలంగాణ ప్రజానాట్యమండాలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ కళాకారులతో కలిసి కలెక్టర్కు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కే శ్రీనివాస్, చెక్కా వెంకటేష్ మాట్లాడుతూ నెలలుగా అవుతుంది కళాకారులు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు కళాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అదేవిధంగా గుర్తింపు కార్డు ఇవ్వాలని కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని ఇందిరమ్మ ఇల్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేణుక, సంతోష్, నరసమ్మ, భాగ్య లక్ష్మి , సుధా కోలాట కళాకారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అత్యంత ప్రాధాన్యం

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ వానాకాలం వన మహోత్సవమునకు శాఖల వారీగా టార్గెట్స్ పూర్తి చేయాలని ప్రతి శాఖల అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు ప్రత్యేక దృష్టితో శాఖల వారీగా అధికారులు పూర్తి చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకంపై అవగాహన కల్పించడంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ బాగా కృషి చేశారని వారిని అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో 98 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యకమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజు, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, జడ్పి సిఈఓ శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ, సిపిఓ కిషన్ నాయక్, డిఇఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

# హ్యామ్ రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయ్

### రోడ్లు అభివృద్ధికి సూచికలు
### బిఆర్ఎస్ హయాంలో రోడ్ల అభివృద్ధిని విస్మరించారు
### బహిరంగ సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** హ్యామ్ రోడ్లుతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని ప్రకాశం బజార్ లో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘువీర్ రెడ్డికి విషెస్ తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు అభివృద్ధి చెందితే పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని, పరిశ్రమలు ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యే హం ప్రాజెక్టుకు నల్లగొండ జిల్లాలోని కనగల్ మండల కేంద్రంలో పైలాన్ ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.మంత్రిగా తాను రెండు సంవత్సరాల కాలంలోనే రూ. 7,110 కోట్ల ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేయించుకుని రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా సిఆర్ఐ కింద జంక్షన్లు, సీసీ రోడ్లకు రూ.1900 వందల కోట్లను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కలిసి మంజూరు చేయించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రెండు రోజులలో మరోసారి ఢిల్లీకి వెళ్లి రోడ్ల కోసం మరో రూ.1000 కోట్లను మంజూరు చేయించుకోవడం జరుగుతుందని వెల్లడించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో రోడ్ల అభివృద్ధికి రూ.2,500 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. విజయవాడహైదరాబాద్ ఫోర్ లైన్ కోసం టెండర్లు పిలిచామని పేర్కొన్నారు.
జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాలలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం అయిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సభ విజయవంతం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ప్రజలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.ఊహించని రీతిలో బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారని పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడుకుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్గొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌పాల్గొన్నారు.

## సంపద సృష్టించే కార్మికులే చరిత్ర నిర్దేశకులు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సంపదను సృష్టించే కార్మికులే రేపటి చరిత్ర నిర్దేశకులు అవుతారని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కార్యాలయం ధర్మభిక్షం భవన్‌లో ఏఐటియుసి జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించి మతోన్మాద బిజెపి ఎన్‌డిఏ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలకులపై పోరాడాలని ఆయన కార్మికుల లోకానికి పిలుపునిచ్చారు. హమాలీలకు సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ పెట్టుకునే హక్కును ప్రతి కార్మికుడికి ఇవ్వాలని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా అప్పజెప్పే కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న 42 రకాల కార్మికుల హక్కులను తీసివేసి నాలుగు కోడ్‌లుగా విభజించడం భావ్యం కాదన్నారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానం అవలంభిస్తున్న బిజెపి ఏన్‌డిఏ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె లతీఫ్, శ్యాంసుందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, కోశాధికారి ఎస్. రాఘవరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివ్వెంల మండల కార్యదర్శి రాము, ఏఐటియుసి నాయకులు వీరభద్రాచారి, హమాలీ యూనియన్ నాయకులు సైదులు గౌడ్, ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## దేవాలయాలను కాపాడితేనే చరిత్ర పదిలం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** దేవాలయాలను కాపాడితేనే చరిత్ర నిలుస్తుందని రాష్ట్ర మాజీ ఆర్టీఐ కమిషనర్, సీనియర్ పత్రికా సంపాదకులు, విద్యావేత్త కట్టా శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగులపహాడ్ ప్రాచీన శివాలయాలను ఆయన సందర్శించి ఆలయాల దుస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపూర్వమైన శిల్పకళ, అద్భుతమైన నిర్మాణశైలి, ప్రతి రాతిలో చరిత్రను చెక్కిన ఈ ఆలయాలు నేడు నిర్లక్ష్యానికి గురవడం అత్యంత బాధాకరమన్నారు. కాకతీయుల కళావైభవానికి నిదర్శనమైన వరంగల్ వెయ్యి స్థంబాల గుడి నిర్మాణానికి నాగులపహాడ్ ఆలయాలే స్ఫూర్తిగా నిలిచాయని, అలాంటి చారిత్రక కట్టడాలు మరుగున పడిపోవడం దురదృష్టకరమన్నారు. నాగులపహాడ్ శివాలయాల శిల్ప వైభవం రాష్ట్రంలోనే అత్యంత అరుదైనదని, ఇటువంటి కళాసంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ప్రభుత్వం, పురావస్తు శాఖ తక్షణమే స్పందించి ఈ ఆలయాలను పరిరక్షించాలని, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే నాగులపహాడ్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే చారిత్రక వారసత్వ క్షేత్రంగా అవతరిస్తుందని అభిప్రాయపడ్డారు. చరిత్రను నిర్లక్ష్యం చేయడం అంటే మన మూలాలను కోల్పోవడమేనన్నారు. అందుకే నాగులపహాడ్ శివాలయాల పరిరక్షణలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, పురావస్తు శాఖతో పాటు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన త్రికుటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న వీరభద్రస్వామి ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి 1112వ శతాబ్ధాలకు చెందిన ఈ చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్(కేతపల్లి) :**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కేతపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు వద్ద ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ఎడమ, కుడి కాల్వల ద్వారా సాగునీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగులో ఇబ్బందులు పడకుండా సమయానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మూసీ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటితో వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.గత పదేళ్లలో పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు అందకుండా అన్యాయం జరిగిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలుతీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ళ వెంకట్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,గాదగోని కొండయ్య,కోట మల్లికార్జున్,కంపసాటి శ్రీనివాస్, ఎడ్ల ప్రవీణ్ ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 3న ఎఐటియుసి నియోజకవర్గ 5వ మహాసభ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**ఏఐటీయూసీ నల్లగొండ నియోజకవర్గ 5వ మహాసభను జులై 3వ తేదీన నల్లగొండ పట్టణంలోని ముగ్దూమ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు కెఎస్ రెడ్డి,కార్యదర్శి వి.లెనిన్ తెలిపారు. మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు.దేశంలో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.జులై 3న జరిగే మహాసభకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి హాజరవుతారని తెలిపారు.నియోజకవర్గంలోని ఏఐటీయూసీ సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ నాయకులు గుండె రవి,రేవల్లి యాదయ్య,మిట్టపల్లి నందం,జి.నరేందర్,సీహెచ్ సీతారాములు,ఎస్. వీరయ్య,రాములు తదితరులు పాల్గొన్నారు.

## బూతు పురాణాలతో సిఎం హోదాను దిగజార్చుతున్న రేవంత్‌రెడ్డి

### మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బూతు పురాణాలతో సిఎం రేవంత్ రెడ్డి తన హోదాను దిగజార్చుకుంటున్నాడని మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. నల్లగొండ సభలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా రూపురేఖలు మార్చిన ఘనత మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిదేనని అన్నారు. కెసిఆర్ హయాంలో పదేండ్లు మంత్రి హోదాలో ఆయన చేసిన అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. ఉమ్మడి జిల్లాలో రెండుసార్లు పర్యటించిన రేవంత్ రెడ్డి ఏమి వరాలు ఇచ్చాడో చెప్పాలన్నారు. కాంగ్రెస్ వాళ్లు చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్కటన్న ఉందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు వై. వెంకటేశ్వర్లు, ఉప్పల ఆనంద్, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, సూర్యాపేట మాజీ జడ్పిటిసి జీడి బిక్షం పాల్గొన్నారు.


## మోగిన చేనేత సహకార సంఘాల ఎన్నికల నగారా

### 9 ఏళ్ల నిరీక్షణకు తెర
### పోచంపల్లి సహకార సంఘం సభ్యులు 920
### ఓటు హక్కుకు అర్హులు 644 మంది, 10న ఎన్నికలు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల 9 ఏళ్ల నిరీక్షణకు జూలై 10న తెరపడనుంది.దాదాపు దశాబ్ద కాలంగా నిలిచిపోయిన చేనేత సహకార సంఘ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ఎట్టకేలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు, ఓటరు కార్మికులకు తీపి కబురు అందింది. పోచంపల్లి చేనేత సహకార సంఘంలో మొత్తం 920 చేనేత కార్మికులకు సభ్యత్వాలు ఉన్నాయి. కొన్ని సహేతుక కారణాలు లేకపోవడంతో 644 మంది మాత్రమే ఓటు హక్కు కలిగి ఉన్నారు. 9 మంది పాలక వర్గ సభ్యులలో ఒకటి మహిళా రిజర్వేషన్. చైర్మన్ వైస్ చైర్మన్ తో పాటు మిగిలిన ఏడుగురు డైరెక్టర్లకు ఎన్నిక జరగనుంది. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నిక జరిగిన రోజే ఫలితాలు వెల్లడి కానున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా నందు 37చేనేత/ సిల్క్ సహకార సంఘాలు, 4 మరమగ్గ సహకార సంఘాలకు , మొత్తం 41చేనేత , మరమగ్గ సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ఎన్నికల అథారిటీ యాదాద్రి జిల్లా, మేడ్చల్ మల్కాజిగిరి రంగారెడ్డి జిల్లా సహకార శాఖలలో, వివిధ హోదాలలో పని చేసే అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించడం జరిగిందనీ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం జూలై 02 నుండి 04 వరకు సభ్యుల నుండి నామినేషన్ల స్వీకరణ.జూలై 05న నామినేషన్ల పరిశీలన.06ననామినేషన్ల ఉపసంహరణ. 10న ఉదయం గం 8 ల నుండి మ గం.2ల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు చేనేత జౌళి శాఖ యాదాద్రి జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు.అనంతరం ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి వెంటనే సంబంధిత చేనేత సహకార సంఘాల మేనేజింగ్ కమిటీలు ఎన్నిక చేయబడతాయనీ నోటిఫికేషన్‌లో వెల్లడించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

## 48 బస్తాల ఆచూకీ ఎక్కడ?




**ప్రజాపక్ష/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన ఏనుగు దామోదర్ రెడ్డి,మరి కొందరు రైతులు తాము సాగు చేసిన రబీ వరి ధాన్యాన్ని తమ గ్రామం ఎన్నారంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోసి, తమ వంతు వచ్చాక ధాన్యం కాంటా వేయిస్తే 953 బస్తాలు (ఒక్కోటి 42) గా ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు లెక్కించి లారీ లోడు చేయించారు. లారీ హనుమకొండ జిల్లాలోని ఒక మిల్లుకు పంపగా, అక్కడి మిల్లు యజమాని రైతు ఈ రైతులకు సంబంధించి కేవలం 905 ధాన్యం బస్తాలు మాత్రమే ముట్టినట్టుగా ట్రక్ షీట్ లో లెక్క చూపారు. తూకం 37870 కేజీలుగా మిల్లు యజమాని చూపించినాడు. దీంతో మిగిలిన 48 బస్తాల ఆచూకీ తెలియక పోవడం ఆందోళనకు గురిచేసింది. మిల్లు యజమాని చెప్పిన తూకం లెక్క ప్రకారం ధాన్యం బస్తాల లెక్క సరిపోలడం లేదు. రవాణా సమయంలో బస్తాలు ఎక్కడ మాయమయ్యాయనే విషయంపై స్పష్టత లేకపోవడంతో సంబంధిత రికార్డులు, రవాణా వివరాలను పరిశీలించాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టి,మాయమైన బస్తాల ఆచూకీ గుర్తించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామంలోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.మరి ఈ కొనుగోళ్ళ గోల్‌మాల్ మాయాజాలంలో తప్పు ఎవరిది? ఎవరి వాటా ఎంత? 953 బస్తాలుగా ఆ రైతులకు లెక్క చూపించిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులదా?లారీ డ్రైవరుదా?ధాన్యం అన్లోడ్ చేయించుకున్న మిల్లు యజమానిదా? ఒకరిద్దరు రైతుల దగ్గరనే ఇన్ని బస్తాల లెక్క మాయం అయితే,ఇలా ఎందరు రైతుల నుండి ఎన్ని బస్తాలు లెక్క మాయం చేసి రైతులను దోచుకుంటున్నారో?ఇందులో ఎవరి పాపం ఎంతెంత ఉందో? లెక్క తేలాలని రైతులు కోరుతున్నారు.తాము ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని, తమ శ్రమను,తమ చెమట రక్తాన్ని ఇలా దోచుకోవడం ఎంతవరకు సబబు అని రైతులు వాపోతున్నారు.దీని గురించి సంబందిత ఏ అధికారిని అడిగినా సమాధానం శూన్యం.దీనిపై ఉన్నత స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని,దీనికి కారకులపై తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




## జిల్లాలో వసతులు లేకున్నా అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు

### జిల్లాలో స్టేడియాన్ని నిర్మించాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో క్రీడాకారులకు వసతులు లేకున్నా ఆయా క్రీడారంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపిక్ రన్‌ను నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద క్రీడా జెండా ఊపి ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఒలంపిక్స్ అంటే కేవలం క్రీడలు మాత్రమే కాదని ప్రపంచ దేశాల మధ్య స్నేహం, శాంతి బాధ్యతకు ప్రతీకలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ అంకితభావం జట్టు భావన క్రీడలతో అలవడతాయన్నారు. జిల్లాలో సరైన సౌకర్యాలు లేవని రాష్ట్ర ప్రభుత్వంస్పందించి స్టేడియం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ చొరవ తీసుకుని స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జల్లా నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు గుగులోత్ సౌమ్య, యెండల సౌందర్య, హుసాముద్దీన్ తదితరులు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, మేయర్ కూరగాయల ఉమారాణి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు భక్తవత్సలం, బొబ్బిలి నర్సయ్య, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు, బీజేపీ కార్పోరేటర్లు, నాగోల్ల లక్ష్మీ నారాయణ, బట్టు రాఘవేందర్, మల్కాయి మహేందర్, జ్యోతి, మురళి పాల్గొన్నారు.

## పిడుగు పడి ఒకరి మృతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** పిడుగు పడి రైతు మృతి చెందిన ఘటన ధర్పల్లి మండలంలోని కర్నాల్ తండాలో జరిగింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నాల్ తండాకు చెందిన ధరావత్ రుక్కి అనే మహిళ ఆదివారం రాత్రి కురిసిన వర్షంలో తన భర్త ధరావత్ దేవి సింగ్ పొలం వద్దకువర్షంలో వెళ్లగా ప్రమాదవశాత్తు పిడుగు పడి మరణించినాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తోణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారిగా పెండిగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. న్రజల సమస్యలను సంబందిత శఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రయావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్యా వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పించన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు రెవెన్యూ కిషోర్ కుమార్, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్ఓ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఏడుపాయల్లో కాటేజీల నిర్మాణానికి ఏడు కోట్లు నిధులు మంజూరు

### ఎమ్మెల్యే మైనంపల్లి చొరవతో ఆలయానికి మహర్దశ

**ప్రజాపక్షం/పాపన్నపేట :** దశాబ్దాల కల అయిన ఏడుపాయల అభివృద్ధిని గత పాలకుల నిర్లక్ష్యపు నీడ నుండి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దూర దృష్టితో అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. భక్తులు కొంగుబంగారంగా కొలిచే అమ్మవారి ఆలయం నిత్యం భక్తులతో కిటకిటలాడుతోంది.అలాంటి అమ్మవారి ఆలయ పరిసరాల్లో కనీస సౌకర్యాలు లేక భక్తులు అనేక అవస్తలు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆలయ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి ఆలయ అభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంతంలో కాటేజీల నిర్మాణం కోసం 7 కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఆలయం పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఈ విషయం టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ స్వయంగా తెలిపినట్టు తెలిపారు. భవిష్యత్ లో ఆలయ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు ఇప్పుడు అమ్మవారి కరుణతో అభివృద్ధి చూస్తున్నారని, అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్టే అన్నారు. ప్రజల మద్దతుతో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అమ్మవారిని కోరుకుంటున్నామన్నారు.

## మెదక్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై అవగాహన

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ పట్టణంలోని 24వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం ''ఒక వ్యక్తికి ఒకే ఓటు'' అనే నినాదంతో ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరాముడి గుడికి రక్షణ ఇవ్వలేని వారు

# దేశాన్ని ఎలా కాపాడుతారు?




### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** అయోధ్యలో దేశంలోని నలుమూలల నుండి ప్రజలు శ్రీరాముడి గుడికి ఇచ్చిన విరాళాలు దొంగతనం అవుతున్నా, ఆలయానికి రక్షణ ఇవ్వలేని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను ఎలా కాపాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మంచిర్యాలలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల రెండవ రోజు కార్యక్రమం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగం రవి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి చిత్తం శ్రీరాముడి మీద, భక్తి అదానీ, అంబానీ మీద ఉందని ఎద్దేవా చేశారు. దేశంలోని సహజ సంపదలను అదానీకి అప్పజెప్పడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. యోగి ప్రభుత్వం అయోధ్య శ్రీరాముడి గుడిలో జరిగిన దొంగతనాలను అణచివేయకుండా, దేశ సంపదను దోచుకోవడానికి అదానీకి మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. అబద్ధపు మాటలు, మాయ మాటలతో శ్రీరాముడి పేరు చెప్పుకోవడం తప్ప బిజెపి ప్రజలకు చేసింది ఏమీ లేదని, శ్రీరాముని జపం చేసే వారు ఆలయానికి రక్షణ ఇవ్వలేనటువంటి అసమర్థులని విమర్శించారు.

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సర్పంచ్‌లకు ఇవ్వవలసిన పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడంతో ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు చేయించుకున్నారని, ప్రభుత్వాలు మారినా జరిగిన పనులకు బిల్లులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. వెంటనే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులన్నీ కూడా చెల్లించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ముడుపు ప్రభాకర్ రెడ్డి, తాంద్ర సదానందం, మేకల దాసు, బొల్లం పూర్ణ, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, కె వీరభద్రయ్య, ముడుపు నళిని రెడ్డి, కలిందర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.



## ప్రతి అర్హుడి ఓటు నమోదుకు బిఎల్‌ఎలు బాధ్యతగా పనిచేయాలి

### రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడానికి బిఎల్‌ఎలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని భీమా గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ2ల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా ప్రతి ఇంటినీ సందర్శించి, ప్రతి కుటుంబ సభ్యులతో మాట్లాడి అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేయాలని కోరారు. నిర్లక్ష్యం కారణంగా అర్హులైన ఓటర్లు జాబితాకు దూరమైతే, భవిష్యత్తులో తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని మంత్రి సూచించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, కార్యదర్శులు మహంకాళి శ్రీనివాస్, బానేష్, కౌన్సిలర్లు శ్రీనివాస్, మల్లేష్, ప్రభాకర్, పట్టణ ఉపాధ్యక్షుడు పనాస రాజు, మొట్టె సుధాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా పౌర సంబంధాల శాఖ సేవలు ప్రశంసనీయం

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజావాణి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక వివిధ శాఖల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాల విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రామచంద్రరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్ నగేష్ ఇతర జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక విజయవంతంగా జిల్లాలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అత్యంత చేరువు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక మెదక్ జిల్లాలో అధికారులు, ప్రజలు భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలను ఛాయా చిత్రాల రూపంలో ప్రజలు వీక్షించేందుకు ఈ చిత్ర ప్రదర్శన ప్రతి సోమవారం ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, డిపిఒ యాదయ్య ఇతర అధికారులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కారం

### కలెక్టర్ కె.హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్న ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ఆమె ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలని, శాఖల వారీగా ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ బెంగాలీ క్యాంపునకు చెందిన తితి మండల్ తనకు దివ్యాంగుల పెన్షన్ కావాలని దరఖాస్తు చేసుకుంది. తిర్యాని మండలం గోయగాం గ్రామానికి చెందిన అడ జంగు తన భూమిని ఇతరులు అక్రమంగా కబ్జా చేసి సాగు చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరాడు. కాగజ్‌నగర్ మండలం ఓల్డ్ కాలనీకి చెందిన మహమూద ఫాతిమా తనకు 14వ వార్డులో అంగన్వాడి టీచర్‌గా బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసింది. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌కు చెందిన దుర్గం దుర్గాబాయి తన అనుమతి లేకుండా తన భూమిలో విద్యుత్ స్తంభాలు వేశారని ఫిర్యాదు చేసింది. రెబ్బెన మండలం రాజారం గ్రామానికి చెందిన కాటుకూరి అంజయ్య తాను సాగు చేసుకుంటున్న భూమిని అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని పేర్కొన్నాడు. ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లి గ్రామానికి చెందిన కోట మొండయ్య తనకు చెందిన భూమి ఓపెన్ కాస్ట్ గనిలో పోయిందని, నష్టపరిహారంతో పాటు ఇంటి స్థలం ఇవ్వాలని కోరాడు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 12వ వేజ్‌బోర్డులో 40శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

### ఐక్య కార్మిక సంఘాల నాయకులు




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** 12వ వేజ్ బోర్డులో కనీసం 40 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్ మంజూరు చేయాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూలై 1న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాకు సన్నాహకంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి 4 గనిపై సోమవారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు పాల్గొని మాట్లాడుతూ సెక్రెటరీ జనరల్ డాక్టర్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 1974 నుంచి ఇప్పటి వరకు జరిగిన 11 వేజ్ బోర్డుల ద్వారా కార్మికుల వేతనాలు, సంక్షేమ పథకాలలో వచ్చిన పెరుగుదలలు కార్మిక సంఘాల పోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. గతంలో దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది బొగ్గుగని కార్మికులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 2 లక్షల 12 వేల మందికి తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

11వ వేజ్ బోర్డులో 19 శాతం ఫిట్‌మెంట్ సాధించామని, ప్రస్తుతం పెరిగిన జీవన వ్యయం, నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని 12వ వేజ్ బోర్డులో కనీసం 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ఈ నెలతో ముగుస్తున్నందున వెంటనే 12వ జెబిసిసిఐ వేతన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి పరిరక్షణకు కొత్త గనుల ఏర్పాటు, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం ఐక్య కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని తెలిపారు. జూలై 1న కొత్తగూడెంలో జరిగే మహాధర్నాలో ఐఎన్‌టియుసి తో పాటు ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు కార్మిక సంఘాలు పాల్గొంటాయని, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు కలవేణి శ్యామ్, గరిగే స్వామి, పిట్ కార్యదర్శి రెక్కల గోపాల్, బ్రాంచ్ కమిటీ, పిట్ కమిటీ నాయకులు, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## పిట్లం లయన్స్‌క్లబ్‌కు జిల్లా ఉత్తమ క్లబ్ అవార్డు


**ప్రజాపక్షం/పిట్లం :** హైదరాబాద్‌లో జరిగిన లయన్స్‌క్లబ్ జిల్లా స్థాయి అవార్డ్స్ కార్యక్రమంలో రూరల్ విభాగంలో పిట్లం లయన్స్‌క్లబ్‌కు జిల్లా స్థాయి ఉత్తమ క్లబ్ అవార్డు వరించింది. కంటి వైద్య శిభిరాలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, పేద విద్యార్థులకు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం, అవగాహన కార్యక్రమాలు తదితర విభాగాలలో అవార్డులతో పాటు వ్యక్తిగత విభాగంలో జిల్లా ఉత్తమ రీజియన్ చైర్మెన్ చైర్మెన్‌గా అనితారెడ్డి, రీజియన్ కోఆర్డినేటర్‌గా మరగల వేణు, ఉత్తమ అధ్యక్షులుగా మున్నూరు నారాయణలు అవార్డులు అందుకున్నారు.




## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ : ఐఎఫ్‌టియు

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సిడిడి) పరిధిలోని పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో అవుట్ సోర్సింగ్ మరయిఉ యాక్టివిటీ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు గత పద్నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని (ఐఎఫ్‌టియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు షెడ్యుల్డ్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ మాట్లాడుతూ పోస్ మెట్రిక్ వసతి గృహాల్లో రాత్రింబవళ్ళు కష్టపడుతున్న వంట కార్మికులు, స్లీపింగ్ నైట్ వాచ్‌మెన్, డే వాచ్‌మెన్ , శానీటేషన్ వర్కర్లకు పద్నాలుగు నెలలుగాద జీతాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థి మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, రక్షణ కల్పిస్తూ అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వంట కార్మికులకు జీవో నెంబర్ 49 ప్రకారం వేతనాలు నిర్ణయించినప్పటికీ, అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మండిపడ్డారు. హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు జీవు నెంబర్ 60 ప్రకారం పూర్తి జీతాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన ఉద్యోగుల పేర్లను ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఈపిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన హక్కులను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపదధ్యక్షుడు దుర్గం లింగన్న యూనియన్ జిల్లా నాయకులు గిల్లి రాకేష్, హెచ్.సునీల్ , లలిత శాంత, బి.లక్ష్మీ, రాజవ్వ రాధా, వరలక్ష్మి సంధ్యా, సంతోషి, నయనతార పాల్గొన్నారు.

## ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



### తులం బంగారం హామీ ఎప్పుడు నెరవేరుస్తారు?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లా కేంద్రంలోని పి.ఎస్.ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రతి మహిళకు నెలకు రూ.2.500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన హామీ ఇప్పటికి అమలు కాలేదని విమర్శించారు. వృద్ధులకు ప్రస్తుతం ఉన్న పెన్షన్ ను రూ. 2 వేల నుంచి 4వేల వరకు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. మహిళలకు అందిస్తామని చెప్పిన స్కూటీల కోసం మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. ఎన్నికల హామీలన్నింటిన వెంటనే అమలు చేసే ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల నమ్మకాన్ని నెలబెట్టుకుంటారా, హామీలే మిగిలిపోతాయా? అని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఒక్క సంవత్సరం మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది. గత ప్రభుత్వం మీద ఇంకా ఎన్ని రోజుల ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారికి ఇచ్చిన హామీలు గుర్తు చేస్తున్నామన్నారు.




## గాంధారిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కామారెడ్డి డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏలే మల్లిఖార్జున్, మదన్‌మోహన్‌లకు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ జెండాలు, పార్టీ నినాదాలతో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించేందుకే ప్రీ ప్రైమరీ పాఠశాల: ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/కొల్చారం :** కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి, పోతంశెట్టి పల్లి, రాంపూర్, రంగంపేట్ గ్రామాల్లో నూతనంగా మంజూరైన ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలలను సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించిందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం చేయాలనుకునే తల్లిదండ్రులకు ఈ పాఠశాలలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి అక్షయ పాత్ర ద్వారా అందించిన మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ఆరగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపిడిఒ రఫికున్నీసా, ఎంఇఒ ఉమారాణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్త, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
30-06-2026
www.prajapaksham.in

‘ గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా ‘హ్యాపీ జర్నీ’ . అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. ’

# లీల

## కుటుంబంతో కలిసి చూడొచ్చు



### ‘హ్యాపీ జర్నీ’ టీజర్ లాంచ్ ఈవెంట్ లో సీనియర్ నటి అన్నపూర్ణమ్మ

గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా ‘హ్యాపీ జర్నీ’ . అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత . ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ఈ చిత్రంలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్లో సీనియర్ నటి అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఇప్పటివరకు నేను చేసిన పాత్రలకు భిన్నంగా ఇందులో నా పాత్ర వుంటుంది. దర్శకుడు నన్ను ఈ పాత్రకు ఎంపిక చేయడం నిజంగా నాకే ఆశ్చర్యంగా అనిపించింది. మనందరికీ ఎన్నో కథలు, భావోద్వేగాలు ఉంటాయి. అవన్నీ ఈ సినిమా చూసిన తర్వాత మరింతగా అర్థమవుతాయి. ఇది కుటుంబం అంతా కలిసి హాయిగా చూసే సినిమా. ఇంట్లో మన వాళ్లను ఎందుకు అర్థం చేసు లేకపోతున్నామో చెప్పే నిర్వచనం కూడా ఈ సినిమాలో ఉంది. పారిస్ లో షూటింగ్ చేశాం. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నిజంగా ఈ సినిమా నాకు ఒక ’హ్యాపీ జర్నీ’ అని చెప్పారు. నటి ఆమని మాట్లాడుతూ ’హ్యాపీ జర్నీ’ నిజంగానే ఒక హ్యాపీ జర్నీ. మేమందరం ఫ్రెండ్స్‌లా కలిసి ఈ సినిమా చేశాం. పారిస్ లో షూటింగ్ను చాలా ఎంజాయ్ చేశాం. ఇది నాకు చాలా కొత్త అనుభవం. ఇంత పెద్ద లాంగ్ ట్రిప్‌లో ఇంతమంది ఆర్టిస్టులతో కలిసి సినిమా చేయడం ఇదే మొదటిసారి. ఇలాంటి పాత్రలో నన్ను మీరు ఇప్పటివరకు చూసి ఉండరు.ఈ సినిమాలో నిజమైన హీరో, హీరోయిన్ అన్నపూర్ణమ్మ గారే. పారిస్ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. ఝాన్సీ నాకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యారు. ప్రతి విషయంలో ఆమె ఎంతో సహాయం చేశారు. నటి ఝాన్సీ, నటుడు వంశీధర్ గౌడ్, దర్శకుడు అభిరామ్ నాయుడు, నటి సునయన, సహ నిర్మాత తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీహరి తనయుడు మేఘాంశ్ హీరోగా ‘స్టూడెంట్’



దివంగత నటుడు శ్రీహరి తనయుడు మేఘాంశ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ’స్టూడెంట్’. ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్ గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వరక్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. స్టూడెంట్ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి) ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరుపున పాలిటిక్స్ లోకి రావడం కాలేజ్ లో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. పాలిటిక్స్ కు కొత్తైనా రాజకీయాల్లో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకుంటాడు భాను. ’పక్కనోడు కత్తితో యుద్ధం చేస్తున్నప్పుడు మనం చెయ్యి పెడితే తెగిపోద్ది, మనం పాలిటిక్స్ లో ఉన్నాం, ఇక్కడ ఎథిక్స్ ఉండవు, ఓన్లీ ట్రిక్సే ఉంటాయి.’ అంటూ మేఘాంశ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ టీజర్ కు హైలైట్ గా నిలుస్తోంది. స్టూడెంట్ రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది ఇంపాక్ట్ ఫుల్ గా చూపించారు. భాను లైఫ్ లో తన్మయితో ఉన్న ప్రేమకథ ఏంటి?, రాజకీయాల్లోకి వచ్చి భాను తను అనుకున్నది సాధించగలిగాడా లేదా?, భుజంగం, కేతి రెడ్డి మధ్య గొడవలేంటి? అనే అంశాలతో టీజర్ ఆసక్తిని కలిగించింది. ఈ చిత్రానికి కొరియోగ్రఫీ ఈశ్వర్ పెంటి, రామ్ ఇసుకపాటి, అడిషనల్ స్క్రీన్ ప్లే నగేష్ గుండపనేని,ఆర్ట్ డైరెక్టర్ రాజు చిరుపెల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఉదయ్ పెండ్యాల, స్టంట్స్ రియల్ సతీష్, ఎడిటర్ నరేష్ అడుపా, హరిశంకర్ టీఎన్, డిఒపి శ్రీనివాస్ బెజుగం, మ్యూజిక్ ప్రేమ్ చంద్ కంచర్ల.

## ‘కళ్యాణం కమనీయం జీవితం’ పోస్టర్ ఆవిష్కరణ



విఫై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ విదురాని, సాహితి ఆవంచ హీరోయిన్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'కళ్యాణం కమనీయం జీవితం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను బాహుబలి రచయిత, దర్శకుడు రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. హీరో హీరోయిన్ లకు సినిమా టీమ్ కు అల్ ది బెస్ట్ అని అన్నారు. నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ : విజయేంద్ర ప్రసాద్ అడగగానే మా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా వుందని అన్నారు. మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ మంచి కథ, కథనాలతో సినిమాని తెరకెక్కించాము త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అన్నారు . దర్శకుడు రవి లోకిరెడ్డి మాట్లాడుతూ ప్రేమ సస్పెన్స్ కలయికతో ఒక ఉత్కంఠ భరితంగా సినిమా వుంటుంది.అలాగే మా టీమ్ అంతా కలిసి ఒక మంచి ప్రయత్నం చేసాము ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను అన్నారు ఈ చిత్రానికి రచయిత :ఎన్ సి అరవింద్ ఏకలవ్య, సంగీతం :శ్రీ మురళీ కార్తికేయ, డిఒపి. వెంకటరాజు డి,

## డిజిటల్ ఛార్జీలు తగ్గించాలి


* ఫిలింఛాంబర్ ముందు నిర్మాతల ధర్నా
* నైజం లో థియేటర్లు ఇవ్వడం లేదు



చిన్న చిత్రాలకు థియేటర్స్ లభించని పరిస్థితులు ఇండస్ట్రీలో చూస్తున్నాం. అలాగే చిన్న నిర్మాతలు తమ సినిమాలను థియేటర్స్ లో రిలీజ్ చేసుకోవాలంటే క్యూబ్, యూఎఫ్ వో, పీఎక్స్‌డి వంటి విపి ఎఫ్ ( వర్చువల్ ప్రింట్ ఫీ) ఖర్చులు భారంగా మారాయి. చిన్న చిత్రాల మనుగడను ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి సమస్యలను అటు ప్రభుత్వం, ఇటు ఇండస్ట్రీ పెద్దలు పరిష్కరించాలని కోరుతూ ఫిలిం నగర్ లోని తెలుగు ఫిలింఛాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాలో ఆర్.కె దీక్ష మూవీ దర్శక నిర్మాత, తెలంగాణ ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్. నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, నిర్మాతలు గురురాజ్, లయన్ సాయి వెంకట్, హీరో కిరణ్, షెరాజ్ మెహదీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ థియేటర్స్ గుత్తాధిపత్యం, వీపీఎఫ్ ఛార్జీల భారం తగ్గించాలని కోరుతూ మహాధర్నా చేస్తున్నాం. కొన్నేళ్ల కిందట ఈ డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్స్ వచ్చినప్పుడు ఉచితంగా ప్రదర్శించారు. ఆ తర్వాత ఛార్జీలు వసూలు చేయడం మొదలుపెట్టారు. ఏడేళ్ల తర్వాత ఎలాంటి ఛార్జీలు ఉండవు అన్నారు. ఇప్పుడు పన్నెండేళ్లవుతున్నా ఆ ఛార్జీలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఒక చిన్న నిర్మాత తన సినిమా రిలీజ్ చేసుకోవాలంటే వీపీఎఫ్ ఛార్జీలు ఐదు నుంచి పది లక్షలు అవుతున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి పక్క రాష్ట్రాల్లో 2, 3 వేలు ఉంటే మన దగ్గర పది నుంచి పదిహేను వేల రూపాయలు వారానికి వసూలు చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారాలు లభించేలా పోరాడతాం అన్నారు. హీరో కిరణ్ మాట్లాడుతూ నేను దాదాపు పాతికేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా. బాల నటుడి నుంచి కెరీర్ కొనసాగిస్తున్నా. ఇప్పుడు ఆర్కే దీక్ష మూవీలో హీరోగా నటిస్తున్నా. ఇలా థియేటర్స్ ఇవ్వకుండా డిజిటల్ ఛార్జీలు పెంచి, చిన్న సినిమా బయటకు రాకుండా చేస్తున్నారు. చిన్న సినిమాను చంపేస్తున్నారు. ఇలాంటి స్వార్థపరులపై పోరాటం చేస్తాం. మా రామకృష్ణ గౌడ్ వెంట ఉండి ఎలాంటి ధర్నాలకైనా సిద్ధంగా ఉంటాం అన్నారు. ఈ ధర్నాకు తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ, నిర్మాత ప్రసన్నకుమార్ సంఘీభావం ప్రకటించారు. హీరో షెరాజ్ మెహదీ ,నిర్మాత లయన్ సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి షెడ్యూల్‌లో ‘సంబరాల ఏటిగట్టు’

హీరో సాయి దుర్గ తేజ్ తాజాగా నటిస్తున్న పాన్ఇండియా సినిమా ఎస్‌వై జీ సంబరాల ఏటిగట్టు. రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమోషన్ ఎంటర్‌టైనర్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ’అసుర ఆగమన’ గ్లింప్స్, ప్రమోషనల్ కంటెంట్ కి వస్తున్న భారీ స్పందనతో ఈ చిత్రంపై హ్యూజ్ బజ్ నెలకొంది. పాన్ఇండియా సంచలనం ’హనుమాన్’ను అందించిన ఈ నిర్మాణ సంస్థ, ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. నిర్మాణంలో చివరి, అత్యంత కీలకమైన దశకు నాంది పలుకుతూ ’సంబరాల ఏటిగట్టు’ చిత్రం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. అత్యంత అద్భుతమైన యాక్షన్‌ప్యాక్డ్ సన్నివేశాలకు జీవం పోయడానికి, ప్రత్యేకంగా ఒక భారీ సెట్ను నిర్మించారు. ఈ చివరి షెడ్యూల్లో ప్రధాన తారాగణం పాల్గొనే కీలకమైన ఘట్టాలు ఉంటాయి, ఇది ఒక మరపురాని సినిమా ఎక్స్ పీరియన్స్ కి వేదిక కానుంది.సాయి దుర్గ తేజ్ తన కెరీర్లోనే అత్యంత పవర్ ఫుల్, ఇంటెన్స్ పాత్రలలో కనిపించబోతున్నారు. విలక్షణమైన కథలను ఎంచుకోవడంలో పేరుగాంచిన సాయి తేజ్ ఈ సినిమా కోసం అద్భుతమైన ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. దర్శకుడు రోహిత్ కేపీ ఈ చిత్రాన్నియాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన వెంటనే పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రారంభం కానున్నాయి.ఈ చిత్రంలో ఒక టాప్ బాలీవుడ్ నటుడు కీలక పాత్ర పోషిస్తుండగా, పళనిస్వామి, బి. అజనీష్ లోక్నాథ్ సంగీతాన్ని అందించారు. ఎడిటర్ నవీన్ విజయ్ కృష్ణ, ప్రొడక్షన్ డిజైనర్ గాంధీ నడికుడికర్.ఈ సినిమాను డిసెంబర్లో థియేటర్లలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు.



# బిఆర్ఎస్ చిల్లర విమర్శలకు స్పందించా...

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు తాను ప్రతిసారీ స్పందించబోనని, ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్రకాల్చి వాత పెడతానని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏ విధంగా ఉన్నదో మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలుసని, రెండు కాళ్లు లేనివాడు చూసుకుందాం రా? అని సవాలు విసిరినట్టుగానే బిఆర్ఎస్ నాయకులు సవాళ్లు విసురుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక, భవిష్యత్తులో బిఆర్ఎస్‌కు అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కెటిఆర్ తన ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారన్నారు. హైదరాబాద్, సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన కొందరు జర్నలిస్టులతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హరీశ్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం వ్యక్తమవుతోందన్నారు. ప్రజలు తమకు ఐదేళ్లకు అవకాశం కల్పిస్తే, రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తామన్నారు. కెటిఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదని, ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టేనని, ఏ వ్యక్తిపైనా, వ్యక్తిగతంగా కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. తప్పు చేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్టు కాదని, ప్రతి ఎన్నికల్లో వారిని ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. అధికారంలోకి వస్తామని బిజెపి పగటి కలలు కంటుందని, ఆశ ఉండడంలో తప్పులేదని, కానీ, ఆ పార్టీ అత్యాశకు పోతుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశపడుతోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజెపి ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదాని కంటే రెండు,మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించామని వివరించారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. భూముల ధరల సవరణల విషయంలో ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధరను ఇదే తరహా జరిగితే అక్కడ సరిదిద్దామని మంత్రి పొంగులేటి వివరించారు.

## బేసిక్ పెన్షన్ నుంచి 1.5 శాతం ఇహెచ్ఎస్‌కు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవల నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల బేసిక్ పే, లేదా బేసిక్ పెన్షన్ నుండి 1.5 శాతం మొత్తాన్ని ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఇహెచ్ఎస్) ఫండ్ కోసం మినహాయించనున్నారు. ఉద్యోగులు,పెన్షనర్లు తమ వంతుగా అందించే 1.5 శాతం విరాళానికి సమానమైన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాగా హెల్త్ కేర్ ట్రస్ట్‌కు జమ చేయనుంది. మే ,2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల నుంచి (జూన్ 2026లో చెల్లించేవి) 1.5 శాతం మినహాయింపు అములలోనికి రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ప్రతి నెలా ఈ మినహాయింపులు నిరంతరాయంగా కొనసాగుతుంది. అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల నుంచి మినహాయించిన మొత్తాన్ని హెల్త్ స్కీమ్ ఫండ్‌కు బదిలీ చేసేందుకు ప్రత్యేకంగా హెడ్ ఆఫ్ అకౌంట్‌ను కేటాయించారు. అన్ని ట్రెజరీ కార్యాలయాలు, పే అండ్ అకౌంట్స్ అధికారులు ఎలాంటి తప్పులు లేకుండా ఈ నిధులను సదరు ఖాతాకు జమ చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించింది.

### భార్యభర్తలిద్దరిలో ఒకరి నుంచే 1.5 శాతం వసూలు ..

కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఇద్దరికీ కాకుండా ఒకే ఉద్యోగి లేదా పెన్షనర్‌కు మాత్రమే 1.5 శాతం మినహాయింపును ప్రభుత్వం పరిమితం చేసింది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైనప్పుడు వారిద్దరిలో ఒకరిమి మాత్రమే మినహాయింపు ఉంటుంది. ఒకరు ప్రభుత్వ ఉద్యోగి, మరొకరు పెన్షనర్ అయినప్పుడు, ఒకే పెన్షనర్ సర్వీస్ పెన్షన్,ఫ్యామిలీ పెన్షన్ ఈ రెండూ పొందుతున్నప్పుడు. ఒకరి జీతం/పెన్షన్ నుంచి మాత్రమే మినహాయింపు ఉంటుంది. డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఐఎఫ్ఎంఐఎస్‌హెచ్ఆర్ఎమ్ఎస్ పోర్టల్‌లో భార్యాభర్తల వివరాలను సరిచూసి, ఒకరికే మాత్రమే కటింగ్ అయ్యేలా చూడాలని, ఒకవేళ పొరపాటున ఇద్దరికీ కట్ అయితే ఆ అదనపు మొత్తాన్ని తిరిగి రీఫండ్ (వెనక్కి) ఇవ్వాలని ఆర్థిక శాఖ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## సీనియర్ జర్నలిస్టు ఆర్.రాజగోపాల్‌కు ఓటు హక్కు, పాస్‌పోర్ట్ పునరుద్ధరించాలి

### కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు, ది టెలిగ్రాఫ్ మాజీ ఎడిటర్ ఆర్.రాజగోపాల్ పేరు ఓటరు జాబితా నుంచి తొలగించడం, అదే కారణంతో ఆయన పాస్‌పోర్ట్ పునరుద్ధరణను నిలిపివేయడం వేధింపులకు పాల్పడటమేనని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెఎయు) పేర్కొన్నది. ఈ చర్య స్వతంత్ర మీడియా గొంతులను అణిచివేసే ప్రయత్నమని, వెంటనే ఆయన తక్షణమే ఓటు హక్కును పునరుద్ధరించి పాస్‌పోర్ట్‌ను జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఐజెయు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్మూ, ప్రధాన కార్యదర్శి డి.సోమసుందర్, ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి సోమవారం సంయుక్తంగా ఈ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సందర్భంగా ఆర్.రాజగోపాల్ పేరు ఓటరు జాబితా నుంచి తొలగించారని, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర ఆధారాలు సమర్పించినప్పటికీ, 2003 ఓటరు జాబితాలో ఆయన తండ్రి పేరు లేదనే కారణంతో దరఖాస్తును తిరస్కరించారని వారు తెలిపారు. ఫలితంగా ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని తెలిపారు. అనంతరం పాస్‌పోర్ట్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేయగా, నమోదిత ఓటరు కాదనే కారణంతో పోలీస్ క్లియరెన్స్ నిరాకరించడంతో పాస్‌పోర్ట్ రెన్యువల్ నిలిచిపోయిందని, ఫలితంగా అమెరికాలో జరిగిన తన కుమార్తె వివాహానికి కూడా హాజరు కాలేకపోయారని వారు వెల్లడించారు. రాజగోపాల్‌ను ఓటరు జాబితా నుంచి తొలగింపుపై దాఖలు చేసిన అప్పీల్ ప్రస్తుతం ఎన్నికల ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉందని, ఇలాంటి దాదాపు 27 లక్షల దరఖాస్తులు కూడా పశ్చిమ బెంగాల్లో పెండింగ్‌లో ఉన్నాయని వారు వివరించారు. అప్పీల్ పెండింగ్‌లో ఉండగానే ఒక సీనియర్ జర్నలిస్టు పౌరసత్వాన్నే ప్రశ్నించే పరిస్థితి ఏర్పడడం ఆందోళనకరమని వారు వ్యాఖ్యానించారు. అధికారాలను ప్రశ్నించే ధైర్యవంతమైన జర్నలిస్టుగా పేరొందిన ఆర్.రాజగోపాల్ ఓటు హక్కును కోల్పోవడం, పాస్‌పోర్ట్ పునరుద్ధరణ నిలిచిపోవడం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలోని లోపాలను బహిర్గతం చేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను విధానపరమైన లోపాల కారణంగా ఏ పౌరుడూ కోల్పోకుండా ప్రభుత్వం, ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## అభయ హస్తమా ?

(మొదటి పేజీ తరువాయి)

యువజన సంఘాల ప్రతినిధులు, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ఆ పార్టీ సీనియర్ నాయకురాలు బృందా కరత్ నిరసన జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని, దీప్కే, వాంగ్‌చుక్‌లను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా పరీక్షలు నిర్వహించడంలో కేంద్రంలోని మోదీ సర్కారు పదేపదే విఫలమవుతుండటంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆగ్రహానికి దేశ రాజధాని ఢిల్లీ వేదికగా వివిధ విద్యార్థి, యువజన సంఘాల మద్దతుతో సిజెపి చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం...ప్రభుత్వ వైఫల్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఆందోళనకారులను ఉద్దేశించి డి. రాజా మాట్లాడుతూ... కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ పదేపదే తన అసమర్థతను చాటుకున్నారని విమర్శించారు. అయినప్పటికీ ప్ర ధాని మోదీ ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించకుండా కాపాడుతున్నారని మం డిపడ్డారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తున్నారని, ఇకనైనా కేంద్ర ప్రభుత్వం వారి డిమాండ్‌ను
ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్, నేహా తదితర ఉద్యమకారులను డి.రాజా కలిసి సంఘీభావం తెలిపారు. నిరసన ప్రాంగణంలో ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలు నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ గ్రంథాలయాన్ని కూడా ఆయన సందర్శించారు. విద్య, విజ్ఞానం, ప్రజాస్వామ్య పోరాటం పట్ల విద్యార్థుల నిబద్ధతకు ఈ గ్రంథాలయం శక్తివంతమైన ప్రతీకగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

## అమెరికా–ఇరాన్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

దొడ్డిదారిన రాకపోకలకు ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని, మళ్ళీ ఉద్రిక్తతలు పేట్రేగుతాయని నౌకలకు ఇరాన్ హెచ్చరిక చేసింది. మరోవైపు అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ చేసిన ప్రకటనను కూడా ఇరాన్ మీడియా విడుదల చేసింది.
చమురు,పెట్రోకెమికల్స్ ఆంక్షల ఎత్తివేతపై అమెరికాతో ఒప్పందాల తర్వాత ఖతార్‌లో స్తంభించిపోయిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తుల్లో ఆరు బిలియన్ డాలర్లు విడుదల అవుతాయని పెజెష్కియన్ పేర్కొన్నారు.

## కేంద్రం ఉదాసీనత

(మొదటి పేజీ తరువాయి)

దీప్కే పేర్కొన్నారు. ఈనెల అభ్యర్థి కహాన్ పటేల్ తండ్రితో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను కూడా దిప్కే పంచుకున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు తమ ఆవేదనను తెలియజేయడానికి పటేల్ తండ్రి గుజరాత్ నుండి జంతర్ మంతర్‌కు వచ్చారు. ఆ వీడియోలో, తన కుమారుడిని బయటి ప్రపంచం ఎలా చిత్రీకరిస్తోందో ప్రశ్నించిన పటేల్ తండ్రి, తన కుమారుడు నిజంగా ఎలాంటివాడో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రెండవ రోజు నిరాహార దీక్షలో పాల్గొన్న సామాజిక కార్యకర్త వాంగ్‌చుక్, సిజెపికి లఢాఖ్‌కు సంబంధించిన కీలక సమస్యలకు మద్దతుగా ఈ దీక్షలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిజెపికి లఢాఖ్‌కు మద్దతుగా తాను చేస్తున్న దీక్షలో ఇది రెండవ రోజు అని, మీరు కూడా తమతో చేరవచ్చని, ఒక రోజు దీక్ష కోసం జంతర్ మంతర్‌కు రావాలన్నారు. ఒకవేళ మీరు ఇక్కడికి రాలేకపోతే, విద్యారంగంలో సంస్కరణలు, జవాబుదారీతనం, పర్యావరణ పరిరక్షణ వంటి డిమాండ్లకు మద్దతుగా ఒక రోజు దీక్ష పాటించి సంఘీభావాన్ని తెలపాలన్నారు. దేశాన్ని మెరుగుపరచడానికి భారతీయులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.
పరీక్షలలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై సిజెపి చేపట్టిన నిరసనకు మద్దతుగా, మంత్రి ప్రధాన్ రాజీనామాతో సహా ప్రభుత్వ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ, వాంగ్‌చుక్ ఆదివారం నాడు జంతర్ మంతర్ వద్ద తన నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ఆ పార్టీ సీనియర్ నాయకురాలు బృందా కరత్ నిరసన జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని, దీప్కే, వాంగ్‌చుక్‌లను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ నిరసనకు విద్యార్థులు, పౌర సమాజ సభ్యుల నుండి కూడా మద్దతు లభించింది. ఐసాకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రధాన వేదికపై కాకుండా, అక్కడే ఉన్న మరో ప్రత్యేక వేదికపై తమ నిరాహార దీక్షను కొనసాగించారు. వీరిలో ఐసా అఖిల భారత అధ్యక్షురాలు నేహా, జెఎన్‌యుఎస్‌యు జాయింట్ సెక్రటరీ డానిష్, ఐసా ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు మనీష్, ఢిల్లీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు దీపక్, జెఎన్‌యు బరాక్ హాస్టల్ అధ్యక్షుడు హృషికేష్, ఎయుడి విద్యార్థి మండలి మాజీ సిసి సభ్యుడు అమీన్ ఉన్నారు. ఆదివారం రాత్రి, జంతర్ మంతర్ వద్ద ఉన్న బహిరంగ మరుగుదొడ్లలో నీటి సరఫరా లేదనే కారణంతో, వాంగ్‌చుక్ కోసం పోర్టబుల్ టాయిలెట్ (తాత్కాలిక మరుగుదొడ్డి) ఏర్పాటుకు ఢిల్లీ పోలీసులు నిరాకరించారని దీప్కే ఆరోపించారు. నిరసనలో పాల్గొనేందుకు బిహార్ నుండి వచ్చిన ఒక వ్యక్తి ప్రయాణ టికెట్‌ను కూడా దీప్కే పంచుకున్నారు. జంతర్ మంతర్‌కు చేరుకోవడానికి ఆ వ్యక్తి చేసిన ప్రయత్నాన్ని దీని ద్వారా ఆయన హైలైట్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com